

దాశరథి సాహిత్యం-3
రూ॥ 450/-
పేజీలు: 480
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



ముస్లింలను విభజించటమే కొత్త వక్ఫ్ చట్టం లక్ష్యం

వైద్య ఆరోగ్య శాఖలో నిబంధనలకు పాతర... అక్రమార్కులకే పెద్దపీట

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 130 | గురువారం | 10-04-2025 | ఖమ్మం    Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**    పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## వక్ఫ్ చట్టంపై సుప్రీంలో సిపిఐ సవాల్



### పిటిషన్ దాఖలు చేసిన పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా

**న్యూఢిల్లీ:** వివాదాస్పద వక్ఫ్ చట్టాన్ని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) సుప్రీం కోర్టులో సవాలు చేసింది. కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలులోకి తెచ్చిన వక్ఫ్ (సవరణ) చట్టాన్ని సవాలు చేస్తూ పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా సుప్రీంకోర్టులో బుధవారంనాడు పిటిషన్ దాఖలు చేశారు. న్యాయవాది రామ్ శంకర్ ద్వారా ఈ పిటిషన్‌ను ఆయన దాఖలు చేశారు. 1995 నాటి వక్ఫ్ చట్టంలో ఉన్న నిబంధనలను తొలగించి ఈ ఏడాదిలో కొత్తగా చేసిన సవరణను ఈ చట్టంలో పొందుపరచడం ద్వారా ఈ చట్టానికి ఉన్న రాజ్యాంగ చెల్లుబాటును పిటిషన్‌లో ఆయన ప్రశ్నించారు. "సామ్యవాదం, కమ్యూనిజం పక్షపాతిగా, సరికొత్త విప్లవాత్మక ఆలోచనలతో సమూల మార్పులను కోరే భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ), మనదేశంలో

తరువాయి 2లో



## ప్రజలను ఒక్కటిగా ఉంచేదే మా జాతీయవాదం

### విభజించేది ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిల బూటకపు జాతీయవాదం

### అహ్మదాబాద్‌లో 'న్యాయ్‌పథ్' పేరుతో ఎఐసిసి తీర్మానం

**అహ్మదాబాద్ :** తాము చెప్పే జాతీయవాదం ప్రజలను ఒక్కటిగా ఉంచుతుందని, బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ "బూటకపు జాతీయవాదం" ప్రజలను విభజిస్తుందని కాంగ్రెస్ పార్టీ తెలిపింది. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో సబర్మతీ నది తీరంలో బుధవారం జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఎఐసిసి) సమావేశం ఈ మేరకు 'న్యాయ్ పథ్' తీర్మానం చేసింది. తీర్మానం కాంగ్రెస్ ప్రవచిత జాతీయవాదాన్ని నిర్వచిస్తూ, అది బిజెపి జాతీయవాదానికి పూర్తిగా ఎలా భిన్నమైందో వివరించింది. "మన జాతిఅస్థిత్వాన్ని భారతదేశ సమగ్రత ప్రదర్శిస్తుంది. కానీ, జాతీయవాదం వాస్తవ ఉద్దేశ్యంలో సామాజిక, రాజకీయ, ఆర్థిక న్యాయంతో పాటు భారత ప్రజల సాధికరతను సూచిస్తుంది" అని తీర్మానం పేర్కొంది. జాతీయవాదం అంటే అణగారిన, పీడిత, అధికారాలు లేని వారి హక్కుల పరిరక్షణ, అభ్యున్నతిలో సమానత్వం

తరువాయి 2లో

## ఇండియా కూటమికి కట్టుబడి ఉన్నాం

*కేవలం కాలపరీక్షలో నిలిచిన రాజకీయ మిత్రపక్షాలతోనే కాకుండా నిర్మాణాత్మక సహకారం, సమష్టి కృషి అనే స్ఫూర్తితో కాంగ్రెస్ పని చేస్తుందని, అలాగే ప్రజా సమస్యల విషయంలో ఏకత్వంతో 'ఇండియా కూటమి'ని ఏర్పాటు చేసి, నిర్మాణాన్ని సుస్థిరంగా కొనసాగిస్తున్నామని అహ్మదాబాద్ సమావేశంలో చేసిన తీర్మానంలో కాంగ్రెస్ వెల్లడించింది. భవిష్యత్తులో కూడా నిబద్ధతతో ఈ ప్రయత్నాన్ని కొనసాగించేందుకు తాము కట్టుబడి ఉన్నామని తెలిపింది. 'ఒకే దేశం, ఒకే ఎన్నిక', వంటి వాటితో సమాఖ్య వ్యవస్థలపై చేసే ప్రతి దాడిని చెదరని నిబద్ధతతో తిప్పికొట్టాలని, జమ్మూ కశ్మీర్‌కు సంపూర్ణ రాష్ట్ర హోదా కల్పించాలని, విద్యలో స్వతంత్ర, స్వేచ్ఛా ఆలోచన ప్రక్రియను పునరుద్ధరించాలని, నిజాయితీ, సమానత్వంతో కూడిన పునర్విభజన ప్రక్రియను చేపట్టాలని ఎఐసిసి తీర్మానం పేర్కొంది. త్యాగం, ఉదారవాదం, అందరు కలిసుండాలనే భారత జాతీయ కాంగ్రెస్ బహుళత్వ మార్గం భారతీయ జాతీయవాదం అసలైన లక్షణం. ఎప్పటికీ రాజ్యాంగ వ్యతిరేక శక్తుల విధ్వంస ప్రణాళికలను విజయవంతం కానివ్వబోమని వాగ్దానం చేస్తున్నామని కాంగ్రెస్ పేర్కొంది.*

## బ్యాలెట్‌ను తిరిగి తీసుకురావాలి

మహారాష్ట్ర ఎన్నికల్లో మోసం

దేశాన్ని అమ్మేస్తున్న మోదీ

కాంగ్రెస్ నేతలు పనిచేయకపోతే తప్పుకోవాలి

ఎఐసిసి ప్లీనరీలో మల్లిఖార్జున ఖర్గే హెచ్చరిక

## ట్రంప్ టారిఫ్‌లపై మోదీ మాట్లాడరా

- ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నిలదీత
- వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని వ్యాఖ్య
- తెలంగాణలో చేసింది దేశమంతా చేస్తామని స్పష్టీకరణ



**అహ్మదాబాద్ :** వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం అని, మత స్వేచ్ఛపై దాడి అని, త్వరలోనే క్రైస్తవులు, సిక్కులు తదితర మైనారిటీల హక్కులపై బిజెపి –ఆర్‌ఎస్‌ఎస్‌లు దాడి చేస్తామని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ అన్నారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఎఐసిసి సమావేశంలో

తరువాయి 2లో

## గాడ్సే ఆలోచనా వ్యాప్తికి మోదీ యత్నం



అడ్డుకునేందుకు ప్రతిఒక్కరూ పోరాడాలి

ఈ ఉద్యమంలో రాహుల్‌గాంధీకి అండగా నిలవాలి

సిడబ్ల్యుసి సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి



03

## ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువవికాసం మంజూరులో ఎంబిసిలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

- తెలంగాణ బిసి కమిషన్ తీర్మానం



02

## డొమినికన్‌లో కుప్పకూలిన నైట్‌క్లబ్ రూఫ్

## 'తిరుపతి – కాట్పాడి' రైల్వే లైన్ డబ్లింగ్‌కు ఆమోదం

- రూ. 1,332 కోట్లు మంజూరు

సిఎడిడబ్ల్యుం పథకానికి ఒకే

రైల్వే ఇన్ఫ్రాకు రూ.1,875 కోట్లు

ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.1,600 కోట్లు

కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు

02



## ఫ్రాన్స్‌తో భారత్ అతిపెద్ద డీల్

### 26 రాఫెల్ మెరైన్ ఫైటర్ విమానాల కొనుగోలుకు అంగీకారం

**న్యూఢిల్లీ :** భారత నౌకాదళానికి అత్యాధునిక ఫైటర్ జెట్లను సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఫ్రాన్స్‌నుంచి 26 రాఫెల్ మెరైన్ ఫైటర్ విమానాల కొనుగోలు డీల్‌కు భారత్ అంగీకరించింది. ఈమేరకు రక్షణశాఖ వర్గాలను ఉటంకిస్తూ ఓ ఆంగ్ల వార్త సంస్థ పేర్కొంది. ఈ డీల్ మొత్తం విలువ రూ. 63,000 వేల కోట్లుగా అంచనా వేస్తున్నారు. దీనిపై అతి త్వరలోనే సంతకాలు చేసే అవకాశాలున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం 22 సింగిల్ సీటర్ విమానాలు, శిక్షణ కోసం నాలుగు ట్విటన్

తరువాయి 2లో

## నిధుల కొరతతో అల్లాడుతున్నా రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం

### పన్నుల్లో వాటా ఇవ్వకుండా దేశ సమాఖ్య వ్యవస్థ నిర్వీర్యానికి మోదీ ప్రభుత్వం కుట్ర

### బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికి గణనీయంగా సహకరిస్తున్న తెలంగాణ లాంటి రాష్ట్రాలు నిధుల కొరతతో అల్లాడుతుంటే, అక్రమంగా వసూలు చేస్తున్న సెస్సులతో, సమకూరుతున్న ఆదాయంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై పెత్తనం చెలాయిస్తోందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు మండిపడ్డారు. పన్నులలో రావాల్సిన న్యాయమైన వాటాను రాష్ట్రాలకు ఇవ్వకుండా

తరువాయి 2లో



## తెలంగాణ సాయుధ పోరాటంలో సిఆర్ పాత్ర గణనీయం

- అంకితభావం, పట్టుదల, సమన్వయానికి చంద్ర రాజేశ్వరరావు నిదర్శనం
- వర్ధంతి సభలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి
- భూ పోరాటాల్లో సిఆర్ దిట్ట : కూనంనేని



అలుపెరుగని ఆదర్శ నేత 03

ప్రజాపక్షం/హైదరాబాద్/కొత్తగూడెం టౌన్

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)కి 25 ఏళ్ల పాటు జాతీయ ప్రధాన కార్యదర్శిగా చంద్ర రాజేశ్వరరావు సేవలందించడం ఆయన నమ్మిన సిద్ధాంతం పట్ల అంకిత భావం, పట్టుదల, సమన్వయానికి నిదర్శనమని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. చంద్ర రాజేశ్వరరావు తనకు ఉన్న మొత్తం ఆస్తిని కమ్యూనిస్టు పార్టీకి ఇచ్చి హైదరాబాద్‌లోని మగ్ధూంభవన్‌లో నివాసం ఉంటూ ఆదర్శవంతమైన జీవితం గడిపారని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీలు ఐక్యంగా ఉండాలని రాజేశ్వరరావు ఆకాంక్షించారని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని చాడ వెంకటరెడ్డి తెలిపారు. కమ్యూనిస్టు యోధులు, సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతి సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో ఆయన చిత్ర పటానికి చాడ వెంకట్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ పెద్ద భూస్వామ్య కుటుంబంలో పుట్టి కూడా కమ్యూనిస్టు పార్టీలో చేరి పేద ప్రజలకు సేవలందించిన మహనీయుడు చంద్ర రాజేశ్వరరావు అని కొనియాడారు. బనారస్ విశ్వవిద్యాలయంలో చదువుకుంటూ

తరువాయి 2లో

## సాగు భూములన్నింటికీ రైతు భరోసా

- రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలి
- పంటల బీమా పథకాన్ని ఏర్పాటు చేయాలి
- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్
- కలెక్టరేట్ల వద్ద ధర్నాలు



ప్రజాపక్షం/ఖమ్మం/మేడ్చల్ ప్రతినిధి

వ్యవసాయానికి పెట్టుబడి సాయాన్ని కేంద్ర ప్రభుత్వం 6వేల నుండి 18 వేలకు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, రాష్ట్రస్థాయి పంటల భీమా పథకాన్ని ఏర్పాటు చేసి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యాప్తంగా రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ల ఎదుట ధర్నా నిర్వహించారు. మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ, ఖమ్మం కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు పాల్గొన్నారు. మేడ్చల్ కలెక్టరేట్ వద్ద డి.జంగయ్య అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి పశ్యపద్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని కల్సి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ. 2 లక్షలు, ఆపై ఉన్న రుణాలను పూర్తి స్థాయిలో మాఫీ చేయాలని,



తరువాయి 12లో



## అమెరికా– చైనా టారిఫ్ వార్

## 104% | 84%



**బ్యాంకాక్ :** ట్రంప్ అనుసరిస్తున్న ఆర్థిక రక్షణవాదం, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ ఎడాపెడా ఇష్టానుసారంగా విధిస్తున్న సుంకాలవాదాన్ని స్థిరంగా ప్రతిఘటిస్తామని, తుదివరకూ పోరాటం చేస్తామనీ చైనా ప్రతిజ్ఞ చేసింది. అమెరికాపై 84 శాతం ప్రతీకార సుంకాలను విధించింది. చైనాపై విధించిన 104 శాతం దిగుమతి సుంకాలను మంగళవారం (ఏప్రిల్ 8) నుండీ అమెరికా వసూలు చేయడం ప్రారంభించగా, చైనాలోకి దిగుమతయ్యే అమెరికా వస్తువులపై 84 శాతం ప్రతీకార సుంకాలు గురువారం (ఏప్రిల్ 10) నుండి చైనా వసూలు చేయడం ప్రారంభించింది. చైనా ప్రతీకార సుంకాలతో ఇప్పటికే క్షీణించిన యూరోపియన్ మార్కెట్లు బుధవారంనాడు మరింత క్షీణదశకు చేరాయి. అమెరికాలోకి దిగుమతయ్యే అన్ని చైనా వస్తువులపై ట్రంప్ నిన్నటివరకూ 54 శాతం సుంకాలు మాత్రమే విధించారు. ట్రంప్ విముక్తి దినోత్సవానికి (ఏప్రిల్ 2) విరుగుడుగా గడచిన శుక్రవారంనాడు చైనా 34 శాతం ప్రతీకార సుంకాలు ప్రకటించింది. అరుదైన ముడిఖనిజ వనరుల ఎగుమతులపై నియంత్రణలు అమలు చేసింది. మరో ఆరు అమెరికా కంపెనీలను విశ్వసనీయత లేని కంపెనీల జాబితాలో చేర్చింది. ప్రపంచ వాణిజ్య సంస్థ వద్ద అమెరికాకు వ్యతిరేకంగా కేసు దాఖలు చేసింది. ఇన్ని చర్యలు చైనా తీసుకోవడంతో ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని ఉపసంహరించుకోకపోతే మరో 50 శాతం సుంకాలు విధిస్తామని సోమవారంనాడు హెచ్చరించారు. అన్యాయపూరితమైన ఈ విధానాలపై తుదివరకూ పోరాటం చేస్తామని, తగిన విధంగా ప్రతిఘటిస్తామని చైనా వాణిజ్యమంత్రిత్వ శాఖ తన వాణిజ్య శ్వేతపత్రంలో ప్రకటించింది. సుంకాలు పెంచినంతమాత్రాన సమస్యలు పరిష్కారం కాబోవని గతంలో

తరువాయి 12లో

## వడ్డీరేట్లు మరో 0.25% తగ్గింపు

- 6.25 నుంచి 6 శాతానికి దిగొచ్చిన రెపోరేటు
- వడ్డీరేటు తగ్గింపుతో గృహ, వాహన, ఇతర రుణాల వడ్డీరేట్లు తగ్గే అవకాశం
- ద్రవ్య పరపతి విధాన కమిటీ నిర్ణయాలను వెల్లడించిన ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా



**ముంబయి: :** కీలక వడ్డీ రేట్లను ఆర్‌బిఐ మళ్లీ సవరించింది. వరుసగా రెండోసారి రెపో రేటును 0.25 శాతం మేర తగ్గించింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన కమిటీ నిర్ణయాలను ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం వెల్లడించారు. దీంతో రెపో రేటు 6.25 శాతం నుంచి 6 శాతానికి దిగొచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ కీలక వడ్డీరేట్లను కేంద్ర బ్యాంకు 25 బేసిస్ పాయింట్లు తగ్గించిన సంగతి తెలిసిందే. తగ్గింపు నిర్ణయానికి మానిటరీ పాలసీ కమిటీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు ఆర్‌బిఐ గవర్నర్ వెల్లడించారు. ఈ సందర్భంగా స్థిర విధానం నుంచి సర్దుబాటు వైఖరికి మరాలని కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. వడ్డీరేటు తగ్గింపుతో గృహ, వాహన, ఇతర రుణాల వడ్డీరేట్లు తగ్గే అవకాశం ఉంది.

**గవర్నర్ ప్రసంగంలోని కీలకాంశాలు..**

* ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక అనిశ్చితులు పెట్టుబడులు, వినిమయంపై ప్రతికూల ప్రభావం చూపించనున్నాయి. ఫలితంగా వృద్ధి రేటు నెమ్మదించొచ్చు.

* అధిక సుంకాలతో ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడనుంది. తయారీ రంగం పునరుద్ధరిస్తున్న సంకేతాలు కన్పిస్తున్నాయి.

* 2025–26 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.5శాతంగా నమోదయ్యే అవకాశాలున్నాయి. తొలి త్రైమాసికంలో 6.5శాతం, రెండో త్రైమాసికంలో 6.7శాతం జీడీపీ నమోదవ్వొచ్చని అంచనా. మూడు, నాలుగు త్రైమాసికాల్లో వృద్ధి రేటు వరుసగా 6.6శాతం, 6.3శాతం ఉండొచ్చు.

* ఆహార పదార్థాల ధరలు తగ్గుముఖం పడుతుండటంతో 202526 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 4శాతానికి దిగి రావొచ్చని అంచనా. త్రైమాసికాల వారీగా 3.6శాతం, 3.9శాతం,

తరువాయి 2లో

## జనరిక్ మందులపై అవగాహన ఏది..?

- మెడికల్ షాపుల మోసాలు... ఫార్మా మాఫియాకు వేల కోట్ల లాభాలు
- బ్రాండెడ్ పేరుతో జనరిక్ మందుల విక్రయం
- నిబంధనలు పాటించని మెడికల్ షాపులపై అధికారుల నిర్లక్ష్యం

ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి



అదే ఫలితాన్ని ఇచ్చే మందులు తక్కువ ధరకు లభిస్తే ఎవరు ఎక్కువ చెల్లిస్తారు? కానీ ప్రజలకు అవగాహన లేకపోవడం వల్లే ప్రజలు మోసపోతున్నారని ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జనరిక్ ఔషధాలు తక్కువ ధరకు, అదే ప్రభావంతో అందుబాటులో ఉన్నా, వాటిపై సరైన ప్రచారం లేకపోవడం వల్ల ప్రజలు బ్రాండెడ్ మందులకే మక్కువ చూపుతున్నారు. ఇదే అవకాశంగా మలుచుకున్న మెడికల్ షాపులు, ఫార్మా మాఫియా కలిసి వేల కోట్ల లాభాలను గడుస్తున్నాయి. జనరిక్ మందుల ధర రూ.5 మాత్రమేనని తెలిసినా, అదే మందును బ్రాండెడ్ పేరుతో రూ.25కి విక్రయించడం కామన్ అయ్యింది. ఉదాహరణకు

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## ఇస్తాంబుల్‌లో నేడు రష్యా– అమెరికా చర్చలు



**మాస్కో :** రష్యా–అమెరికా ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణపై రెండో విడత చర్చలు ఇస్తాంబుల్‌లో గురువారంనాడు జరుగుతాయి. ఈ చర్చల్లో పాల్గొనే రష్యా బృందానికి ఆ దేశ రాయబారి అలెగ్జాండర్ డార్చియేవ్ నాయకత్వం వహిస్తారు. రష్యా విదేశాంగమంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా మాస్కోలో రోజువారీ పత్రికాగోష్ఠిలోభాగంగా ఈ విషయం చెప్పారు. ద్వైపాక్షిక దౌత్యకార్యకలాపాలకు సంబంధించి ఈ సమావేశంలో చర్చిస్తారని ఆమె చెప్పారు. రెండు దేశాలమధ్యా సంబంధాలను సాధారణీకరించుకునే చర్యల్లో భాగంగా ఈ రెండో విడత చర్చలు జరుగుతున్నట్లు ఆమె చెప్పారు.

# డొమినికన్‌లో కుప్పకూలిన నైట్‌క్లబ్ రూఫ్

### 113 మంది మృతి



**శాంటో డోమింగో :** ఉత్తర అమెరికాదేశం డొమినికన్ రిపబ్లిక్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. శాంటో డోమింగోలోని నైట్ క్లబ్ పైకప్పు కూలిపోవడంతో కడపటి వార్తలు అందేసరికి దాదాపు 113 మంది మృతదేహాలను వెలికితీశారు. ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. 255 మంది గాయపడ్డారు. మరణించిన వారిలో ఇప్పటివరకూ 32 మృతదేహాలను మాత్రమే గుర్తుపట్టారు. ఈ మృతుల్లో పలువురు క్రీడాకారులు,ప్రముఖ కార్డియాలజిస్ట్, ప్రభుత్వ ఆర్కిటెక్, రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్,దేశ యువజన మంత్రి సోదరుడు సహా పలువురు ప్రముఖులు ఉన్నారు. బలమైన భూకంపం సంభవించిందని తాము భావించామని సజీవంగా తప్పించుకున్నవారు కొందరు చెప్పారు. టూరిజంద్వారా ఈ దేశానికి భారీ ఆదాయం లభిస్తుంది. ఆ దేశ జిడిపిలో 15 శాతం టూరిజం ద్వారానే లభిస్తుంది. ఉత్తర మాసిడోనాలో కూడా గతనెలలో ఇదేవిధంగా ఒక నైట్‌క్లబ్ పైకప్పు కుప్పకూలిపోవడంతో 59 మంది మరణించారు. డొమినికన్ రిపబ్లిక్ నైట్‌క్లబ్‌లో ప్రముఖ పాపులర్ మెరెంగ్యూ (సమయాలీన సంప్రదాయ నృత్యగానాలు) సింగర్ రబ్బీ పెరెజ్ (69) క్లబ్‌లో అందరినీ ఉర్రూతలూగించేవిధంగా పాటలు పాడుతూ అలరిస్తున్న సమయంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆకస్మికంగా నైట్‌క్లబ్ పైకప్పు కూలిపోయింది. సింగర్‌తోపాటు మృతుల్లో మోంటే క్రిస్టీ గవర్నర్ నెల్సీ క్రజ్ సహా ప్రపంచ ప్రఖ్యాత బేస్‌బాల్ ప్లేయర్ ఆక్టావియో డోటెల్ కూడా ఉన్నారు. డోటెల్ వయసు 51 సంవత్సరాలు. ఆక్టావియో డోటెల్ తన జీవితకాలంలో 13 మేజర్ లీగ్స్ ఆడారు. 2011లో వరల్డ్ సిరీస్‌ను ఆయన కైవసం చేసుకున్నారు. కాగా పాపులర్ సింగర్ రబ్బీ పెరెజ్ గతనెల 8వ తేదీన జన్మదిన వేడుకలు చేసుకున్నారు. సరిగ్గా నెలరోజులకు ఏప్రిల్ 8 వ తేదీన ఈ ప్రమాదంలో ఆయన మరణించారు. కాగా మరో ఆటగాడు టోనీ ఎనిక్ బ్లాంకో కాబ్రెరా, డొమినికన్ అధ్యక్షుడు లూయిస్ అబినాదర్ హుటాహుటిన వచ్చి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. మృతులకు తీవ్ర సంతాపం తెలియజేశారు. దేశంలో మూడు రోజులు సంతాప దినాలు ప్రకటించారు. తొలుత మృతులసంఖ్య 15గా ఉంటుందని అంచనావేశారు. కానీ క్రమంగా బుధవారం నాటికి ఈ సంఖ్య 113కు చేరుకుంది. సహాయ కార్యక్రమాల్లో భారీ క్రేన్లు ఉపయోగిస్తున్నారు. పాపులర్ సింగర్ పెరెజ్ వేదికపై పాటలు పాడుతుండగా ఆయన కుమార్తె జులింకా మాత్రం ఈ ప్రమాదం జరిగిన తర్వాత అదృష్టవశాత్తు సురక్షితంగా తప్పించుకుని బయటకు పరుగులు తీశారు. ఆమెతోపాటే అనేకమంది ప్రమాదం నుండి సురక్షితంగా బయటపడ్డారు.మొదట చిన్నగా దుమ్ము,ధూళి కిందకు రాలడం ప్రారంభమై తం గ్లాసుల్లోని డ్రింక్స్‌లో పడిందని, ఆ తర్వాత మెల్లిగా ఒకటీ రెండు రాళ్ళు పెద్ద కిందకు రాలిపడ్డాయని, భయపడి అప్రమత్తమైనవారు పారిపోగా, ఇక ఆ తర్వాత పెద్ద శబ్దంతో పైకప్పు కుప్పకూలిపోయిందని సజీవసాక్షులు చెప్పారు. సహాయ బృందాలు సజీవులకోసం అన్వేషణ చేస్తున్నాయి. దాదాపు 370 మంది సహాయ బృందాలు కూలిపోయిన ఇటుకలు, ఇనుపరాడ్లు, ఇతర బరువైన సామాగ్రిని తొలగించి శిథిలబూడిదను క్లియర్ చేస్తున్నారు. పెరెజ్ నృత్యగాన కార్యక్రమ జరుగుతున్న సమయంలో వెయ్యిమందికిపైగా నైట్‌క్లబ్‌లో ఉన్నారని స్థానిక పత్రికలు పేర్కొన్నాయి. వాస్తవానికి ఈ క్లబ్‌లో సీటింగ్ సామర్థ్యం 700 మాత్రమే ఉండగా, మరో 1000 మంది చుట్టూ నిలబడి ఈ కార్యక్రమాన్ని తిలకిస్తున్నారని స్థానిక మీడియా ప్రకటించింది. ఈ విషాద ఘటనలో రబ్బీ పెరెజ్ సహా అందరూ మరణించారు. దీంతో ఆ దేశంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. ఉత్తర అట్లాంటిక్ సముద్రం హిస్పానియోలా దీవిలో ఈ చిన్ని దేశం ఉంది. క్యూబా తర్వాత ఈ ప్రాంతంలో ఇదే అతిపెద్ద దేశం. జెట్ సెట్ నైట్‌క్లబ్‌లో రబ్బీ పెరెజ్ తన నృత్యగానాలతో అందరినీ వినోదంలో ముంచెత్తుతున్న సమయంలో ఆ వినోదంలోనే ఈ పెను విషాదం సంభవించింది. యువకుడుగా ఉన్నప్పుడు బేస్‌బాల్ ప్లేయర్‌గా ఉన్న పెరెజ్ ఆ తర్వాత పాపులర్ సింగర్ గా ఎదిగి ఆ వృత్తిలోనే స్థిరపడి గొప్ప పేరు ప్రతిష్ఠలు సంపాదించుకున్నారు.

## వేతనాలకోసం
# గ్రీస్ కార్మికుల జాతీయ సమ్మె



**ఏథెన్స్ :** వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ గ్రీస్‌దేశంలో కార్మికులు దేశవ్యాప్తంగా 24 గంటలు సార్వత్రిక సమ్మె ప్రారంభించారు. దీంతో ఓడరేవులు, విమానాశ్రయాలు, ఇతర కార్యాలయాలలో దేశవ్యాప్తంగా కార్మిక కార్యకలాపాలన్నీ స్తంభించిపోయాయి. వేలాదిమంది కార్మికులు బుధవారంనాడు వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేశారు. ప్రధాన ప్రభుత్వ కార్యాలయాల ఎదుట గుమిగూడి నిరసన ప్రదర్శనలు జరిపారు. విపరీతంగా ధరలు పెరుగుతున్నప్పటికీ అందుకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెరగడంలేదు. దేశంలోని రెండు ప్రధాన కార్మిక సంఘాలు ఈ సమ్మె పిలుపు ఇచ్చాయి. దేశంలో వివిధ రంగాలకు చెందిన అనేక ప్రభుత్వ, ప్రైవేటు కార్మిక సంఘాలున్నాయి. ఈ కార్మిక సంఘాలన్నీ రెండు జాతీయ కార్మిక సంఘాలకు అనుసంధానమై ఉన్నాయి. ఈ రెండు జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు సమ్మె ప్రారంభం కావడంతో దాదాపు దేశంలో కార్యకలాపాలన్నీ స్తంభించిపోయాయి. జీవన వ్యయాలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని దేశవ్యాప్తంగా కార్మికులు కోరుతున్నారు. గ్రీస్‌లో ఆర్థిక సంక్షోభం వచ్చినప్పుడు 2009లో బెయిలౌట్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ సందర్భంగా కార్మికులతో చేసుకున్న అమలులో ఉన్న పూర్తిహక్కులను, వేతనాలను రద్దుచేశారు. పెన్షన్లు రద్దుచేశారు. ఆనాడు ఈ విధంగా మొత్తం 290 బిలియన్ యూరోల మేరకు కార్మికులకు చెందాల్సిన సొమ్మును వారికి కాకుండా రద్దుచేసి ప్రభుత్వ ఖాతాలో వేసుకున్నారు. ఈనాడు గ్రీస్ ఆర్థిక వ్యవస్థ 2.3 శాతం మేరకు వృద్ధి సాధించింది. దీంతో కార్మికులు తమకు తిరిగి న్యాయం చేయాలని కోరుతున్నారు. కార్మికులు ఆనాడు కోల్పోయిన ఆ హక్కులన్నింటినీ తిరిగి ఇవ్వాలని, కార్మికులకు న్యాయం చేయాలని, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని రెండు ప్రధాన కార్మిక సంఘాలు గ్రీస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

## జర్మనీ కూటమి ప్రభుత్వంలో సోషల్ డెమోక్రాట్స్



**బెర్లిన్ :** జర్మనీలో ఎట్టకేలకు కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు ఒక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం సిడియు (క్రిస్టియన్ డెమొక్రటిక్ యూనియన్) పార్టీ నాయకుడు ఫ్రెడరిక్ మెర్జ్ ఛాన్సలర్‌గా వచ్చేనెలలో పదవీ బాధ్యతలు చేపడతారు. 2022 నుండి ఆయన జర్మనీ పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడుగా కొనసాగుతున్నారు. ఆర్థిక సమస్యలు, ధరల పెరుగుదల జర్మనీని చుట్టుముట్టాయి. మెర్జ్ ఇప్పుడు ఈ సమస్యలు పరిష్కరించాల్సి ఉంటుంది. ఎన్నికలు జరిగిన అనేక వారాల తర్వాత సిడియు–సిఎస్‌యు (క్రిస్టియన్ సోషల్ యూనియన్) లు కలిసి సోషల్ డెమోక్రటిక్‌పార్టీతో ఒప్పందం చేసుకుని కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 23న జర్మనీ పార్లమెంటుకు ఎన్నికలు జరిగాయి. కన్జర్వేటివ్ సిడియు–సిఎస్‌యు సోదరపార్టీలు ఎన్నికల్లో విజయభేరీ మోగించాయి. ఐతే చట్ట ప్రకారం కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు జాప్యం జరిగింది. చివరకు సోషల్ డెమొక్రటిక్ పార్టీని ప్రభుత్వంలో చేర్చుకునేందుకు సిడియు–సిఎస్‌యులు ఒప్పందం చేసుకున్నాయి. ఫిబ్రవరి ఎన్నికల్లో సిడియు–సిఎస్‌యుపార్టీలు 28.6 శాతం ఓట్ల తిరుగులేని మెజారిటీ సంపాదించుకున్నాయి. దేశంలో పచ్చిమితవాదులుగా ముద్రవేసుకున్న ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ (ఎఎఫ్‌డి)పార్టీ 20.8 శాతం ఓట్లు సంపాదించుకుని రెండోస్థానంలో నిలబడిన అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇప్పటివరకూ అధికారంలో కొనసాగిన సోషల్ డెమోక్రాట్స్ (ఎస్‌పిడి)16.4 శాతం, గ్రీన్స్‌పార్టీ 11.6 శాతం ఓట్లు సంపాదించి మూడోస్థానికి పడిపోయాయి. గడచిన 40 ఏళ్ళలో ఎన్నడూలేనిరీతిలో జర్మనీలో 82.5 శాతం మేరకు ప్రజలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఓలాఫ్ షుల్జ్ ఇప్పటివరకూ ఛాన్సలర్‌గా వ్యవహరించారు.

## చైనాలో 20 మంది సజీవదహనం

**బీజింగ్ :** చైనాలోని ఒక వృద్ధాశ్రమంలో మంటలు చెలరేగి 20 మంది సజీవ దహనమయ్యారు. ఉత్తరప్రాంత హెబై రాష్ట్రం లాంఘుయా కౌంటీలోని చెంగ్దే నగరంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో ఉన్న నర్సింగ్ హోంలో ఈ ఘటన జరిగిందని జిన్హువా వార్తాసంస్థ బుధవారంనాడు ప్రకటించింది. దీంతో పోలీసులు నర్సింగ్‌హోం ప్రధాన నిర్వాహకుణ్ణి అరెస్టు చేశారు. ఈ వృద్ధాశ్రమంలో జరిగిన ప్రమాదంలో గాయపడినవారిని ఆసుపత్రులకు తరలించారు. మిగిలిన వారిని ఇతర ప్రాంతాలలో ఉన్న సురక్షిత నర్సింగ్‌హోంలకు తరలించారు. విచారణ బృందాలు, ఇతర సహాయకులు హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఈ అగ్ని ప్రమాదం ఎందుకు జరిగిందన్న విషయం ఇంతవరకూ తెలియరాలేదు. నిపుణులు ఈ విషయం తెలుసుకునేందుకు దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తు సక్రమంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని చైనా స్టేట్ కౌన్సిల్‌కు చెందిన వర్క్ సేఫ్టీ కమిటీ సంబంధిత అధికారులను ఆదేశించింది. విషాదకరమైన ఈ సంఘటన జరగడానికి గల కారణాలను వీలైనంత త్వరగా తెలుసుకోవాలనీ, తదుపరి నియంత్రణ చర్యలు తీసుకోవాలనీ చైనా ఎమర్జెన్సీ మంత్రిత్వశాఖ ఆదేశించింది.

## మృత్యుకేంద్రంగా మారిన గాజా

**గాజా :** తూర్పు గాజా నగరం సుజయే డిస్ట్రిక్ట్‌లో ఇజ్రాయెల్ సైనిక దళాలు జెట్ విమానాలతో బుధవారంనాడు నివాసిత ప్రాంతాలపై బాంబుదాడులు చేయడంతో 29 మంది సిల్లలు మరణించారు. 55 మంది గాయపడ్డారు. మరో 80 మంది జాడతెలియకుండా పోయారు. కాగా గాజాలో పరిణామాలపట్ల యూనిసెఫ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గాజా చివరకు ''ఒక మృత్యు కేంద్రం''గా మారిందని పేర్కొంది. ప్రతి రోజూ గాజాలో ఇజ్రాయెల్ దాడులవల్ల 100 మంది పిల్లలు మరణించడమో, తీవ్రంగా గాయపడటమో జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేసింది. మార్చి 18వ తేదీన ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి గాజాపై తిరిగి దాడులు ప్రారంభించింది. అప్పటినుండి గడచిన 22 రోజుల్లో 1,449 మంది పాలస్తీనియన్లు దాడుల్లో మరణించారని పాలస్తీనా ఆరోగ్యమంత్రిత్వశాఖ ప్రకటించింది.



## 0.25% తగ్గింపు (మొదటి పేజీ తరువాయి)

3.8శాతం, 4.4శాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి.

* ఏప్రిల్ 4వ తేదీ నాటికి విదేశీ నిల్వలు 676 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వీటితో రాబోయే 11 నెలల వరకు దిగుమతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

**ఆర్‌బిఐ నిర్ణయం హర్షణీయం: సిఎస్ శెట్టి**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజాగా తీసుకున్న నిర్ణయాలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ సిఎస్ శెట్టి స్వాగతించారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో వడ్డీ రేట్ల తగ్గింపు సకాలంలో తీసుకున్న నిర్ణయమని అభిప్రాయపడ్డారు. ఈ నిర్ణయం మార్కెట్‌కు మద్దతుగా నిలుస్తుందని, సుంకాల వల్ల దేశీయ ఆర్థిక వ్యవస్థపై ఏర్పడే పరోక్ష ప్రభావాన్ని తగ్గిస్తుందని పేర్కొన్నారు. వృద్ధికి కూడా ఊతం ఇస్తుందన్నారు.

## మా జాతీయవాదం (మొదటి పేజీ తరువాయి)

కల్పించడం. ''అది మొత్తం జాతిని సౌభ్రాతృత్వం, సోదరభావ స్ఫూర్తితో బంధిస్తుంది. భారత బహుళత్వ, ఉదారాచారాలు, మన ప్రవర్తన, మన విశ్వాస్వాలు, మన జీవన విధానంలోనే జాతీయవాదం మూలాలు ఉన్నాయి''. ''కాంగ్రెస్ దృష్టిలో జాతీయవాదం అనే ఆలోచన ప్రజలను ఒక్కటిగా కలిపి ఉంచేది. మరో వైపు, బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్‌ల బూటకపు–జాతీయవాదం సమాజ, మన ప్రజల విభజనను కోరుతుంది.'' అని ఎఐసిసి తీర్మానం వివరించింది. ''బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ నమూన జాతీయవాదం భారత వైవిధ్యాన్ని చెరిపేసేది'', అదే సమయంలో కాంగ్రెస్ స్వీకరించిన జాతీయవాదం ''మన ఉమ్మడి వారసత్వంలో లోతుగా పాదుకోగా, బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్‌ది క్రూరమైనది, పక్షపాతంతో కూడుకున్నది'' అని తెలిపింది. స్వాతంత్ర్యోద్యమాన్ని ప్రత్యేకించి క్విట్ ఇండియా ఉద్యమాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన సంస్థలే ఇప్పుడు నకిలీ జాతీయవాదం సర్టిఫికెట్లను జారీ చేసే కాంట్రాకు హక్కులున్నట్లు భావించడం విడ్డూరమని కాంగ్రెస్ తన తీర్మానంలో విమర్శించింది.''బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్‌ల బూటకపు జాతీయవాంద అధికారంలో కోసం అవకాశవాదం తప్ప మరొకటి కాదు. వారి లక్ష్యం జాతీయవాదాన్ని ఐక్యపరచడం కాదని దోపిడితత్వ అధికారం కోసం మాకియావెల్లి శోధన. ఎలాగైనా అధికారాన్ని కబళించేందుకు, తిరిగి సాదించేందుకు వారు జాతిని మతం, కులం, ప్రాతం, భాష, దుస్తులు, ఆహార అలవాట్ల పేరుతో విభజనకు కోరుకుంటారు' అని తీర్మానం పేర్కొంది. వారి డొల్ల జాతీయవాదం ద్వేషాన్ని వ్యాపించి, అధికారాన్ని దక్కించుకొని, రెయిడ్ (దాడి), ఇన్వేడ్(దురాక్రమణ), ఎక్స్‌టార్ట్(బెదిరింపు) ద్వారా విరాళాలు సేకరించటమేనని తెలిపింది.

## అతిపెద్ద డీల్ (మొదటి పేజీ తరువాయి)

సీటర్ విమానాలను భారత్ కొనుగోలు చేయనుంది. దీంతోపాటు వీటి నిర్వహణ, స్పేర్లు, లాజిస్టికల్ సపోర్ట్, శిక్షణకు సంబంధించిన అంశాలు కూడా దీనిలో ఉండనున్నాయి. ఆఫ్ సెట్ నిబంధన కింద దేశీయంగా కొన్ని విడిభాగాలు తయారుచేయాలనే షరతు కూడా ఇందులో ఉన్నట్లు సమాచారం. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ ఈ డీల్‌కు ఆమోదముద్ర వేసింది. దేశీయంగా అభివృద్ధి చేసిన విమాన వాహక నౌకపై ఈ రాఫెల్ మెరైన్‌లను మోహరించాలని భారత్ భావిస్తోంది. ఇది సముద్ర జలాల్లో మన దేశ నౌకాదళ శక్తిని గణనీయంగా పెంచనుంది. రాఫెల్‌లో మెరైన్ శ్రేణి విమానాలను నౌకాదళాల అవసరాలను దృష్టిలోఉంచుకుని అభివృద్ధి చేశారు. దీని ల్యాండింగ్ గేర్ భిన్నంగా ఉండటంతోపాటు.. అరెస్టర్ హుక్స్, చిన్న రన్‌పై టేకాఫ్ అయ్యేలా ప్రత్యేకమైన ఎయిర్ ఫ్రేమ్ వంటి వాటిల్లో వాడారు. ఇప్పటికే ఇది పలు పోరాటాల్లో తన శక్తిని చాటుకొంది. దీనిలో అత్యాధునిక ఏవియానిక్స్, ఆయుధాలు వంటి ఫీచర్లు ఉన్నాయి. ఈ విమానం ఒప్పందం కుదిరిన నాటినుంచి నాలుగేళ్లకు మన నౌకాదళానికి అందటం మొదలుకానున్నాయి. తొలిబ్యాచ్ 2029లో రావొచ్చని.. 2031 నాటికి మొత్తం చేతికొచ్చే అవకాశాలున్నాయి. ఈ విమానాలు ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఐఎన్ఎస్ విక్రాంత్‌పై వినియోగించనున్నారు. ఇప్పటికే ఉన్న మిగ్ 29కే విమానాల స్థానాలను ఇవి భర్తీ చేయనున్నాయి. భారత్, ఫ్రాన్స్ ప్రభుత్వాలు ఈ డీల్‌పై సంతకాలు చేయనున్నాయి. డసాల్ట్ నుంచి డెలివరీ డెడ్‌లైన్లు, నిర్వహణ ఇతర అంశాలు సకాలంలో పూర్తయ్యేలా ఫ్రెంచి ప్రభుత్వమే చూస్తుంది.

# 'తిరుపతి-కాట్పాడి' రైల్వే లైన్ డబ్లింగ్‌కు ఆమోదం

రూ.1,332 కోట్లు మంజూరు
సీఏడీడబ్ల్యూఎం పథకానికి ఓకే
రైల్వే ఇన్ఫ్రాకు రూ.1,875 కోట్లు...
ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.1600 కోట్లు
కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

**న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం రెండు రైల్వే ప్రాజెక్టులకు పచ్చజెండా ఊపింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో 104 కిమీల తిరుపతిపాకాలాకాట్పాడి రైల్వే లైన్ డబ్లింగ్‌కు ఆమోదం తెలిపింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడ్‌లో పంజాబ్‌హర్యానా మధ్య 19.2 కిమీల జిరాక్పూర్ బైప్ అధీనంలోని ఆరు లేన్ల నిర్మాణానికి అంగీకరించింది. రూ.1,878 కోట్ల రైల్వే ఇన్ఫ్రా, రూ.1600 కోట్ల ఇరిగేషన్ ప్రాజెక్టులనూ ఆమోదించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ బుధవారం భేటీ అయింది. అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌తమిళనాడు మధ్య తిరుపతిపాకాలాకాట్పాడి సింగిల్ రైల్వే లైన్ డబ్లింగ్ ప్రాజెక్టును ఆమోదిస్తూ, ఇందుకోసం రూ.1,332 కోట్లను మంజూరు చేసింది. ప్రధాన మంత్రి క్రిషి సించాయీ యోజన (పీఎంకేఎస్‌వై) ఉప పథకంలో భాగంగా 202526 కోసం రూ.1,600 కోట్లతో కమాండ్ ఏరియా అభివృద్ధి, జల నిర్వహణ (ఎంసీఏడీడబ్ల్యూఎం)కు ఆమోద ముద్ర వేసింది. ఈ మేరకు కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. తిరుపతిపాకాలాకాట్పాడి డబులింగ్ ప్రాజెక్టు వల్ల తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి కోట వంటి ప్రముఖ క్షేత్రాలకు వచ్చే లక్షలాది భక్తులకు ప్రయోజనం ఉంటుందన్నారు. వైద్య, విద్య హబ్‌లుగా తిరుపతి, వెల్లూరు ప్రాంతాలు ఉంటే రవాణా సౌకర్యాలు మెరుగవుతాయన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 17 ప్రధాన వంతెనలు, 327 చిన్న వంతెనలు, ఏడు పై వంతెనలు, 30 అండర్‌పాస్‌లను నిర్మించనున్నట్లు వైష్ణవ్ తెలిపారు. డబ్లింగ్ పనులు పూర్తైతే రోడ్డు మార్గంలో రద్దీ తగ్గుతుందని, రైలు మార్గం ఎక్కువగా వినియోగమవుతుందని అన్నారు. తద్వారా 20 కోట్ల కిలోల కబ్బన ఉద్గారం తగ్గుతుందని చెప్పారు. నాలుగు కోట్ల లీటర్ల డీజిల్ ఆదా అవుతుందని కూడా అశ్వినీ వైష్ణవ్ అన్నారు. ఇప్పటికే సర్వే పనులు పూర్తి అయినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుతో భారతీయ రైల్వే నెట్‌వర్క్ 113 కిమీల మేరకు విస్తరిస్తుందని చెప్పారు. అలాగే, రూ,1,878 కోట్ల వ్యయ అంచనాతో పంజాబ్ హర్యానాలో ఎన్‌హెచ్7 (జిరాక్పూర్‌పాటియాలా) నుంచి ఎన్‌హెచ్5 (జిరాక్పూర్ పర్వానూ) వరకు 19.2 కిమీల ఆరు లేన్ల జిరాక్పూర్ బైపాస్‌కు కేబినెట్ ఆమోదం లభించినట్లు వెల్లడించారు. పాటియాలా, ఢిల్లీ, మొహాలీ ఎయిరో సీటీ నుంచి ట్రాఫిక్ మళ్లించడం ద్వారా చుట్టుపక్కల ప్రాంతాలు, జిరాక్పూర్, పంచ్‌కులా వద్ద రద్దీ తగ్గించడానికి ఈ ప్రాజెక్టు దోహదమవుతుందని అన్నారు. హిమాచల్ ప్రదేశ్‌తో నేరుగా అనుసంధానం అవుతుందన్నారు. ఎన్‌హెచ్7, ఎన్‌హెచ్5, ఎన్‌హెచ్5 మీద రద్దీతో పాటు ప్రయాణ సమయం తగ్గడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఇరిగేషన్ మేనేజ్‌మెంట్ ట్రాన్స్‌ఫర్ (ఐఎంటీ) ద్వారా వాటర్ యూజర్ సొసైటీ (డబ్ల్యూయూఎస్) కోసం ఇరిగేషన్ ఆస్తుల నిర్వహణ ప్రాజెక్టునూ కేబినెట్ ఆమోదించింది. ప్రస్తుతమున్న కాలువలు, ఇతర నిర్దేశిత క్లస్టర్‌ల నుంచి నీటి సరఫరాకు అనుకూలమైన మౌలిక వసతుల కల్పనకు ఈ ప్రాజెక్టును కేబినెట్ ఆమోదించినట్లు వైష్ణవ్ తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీలు), వ్యవసాయోత్పత్తుల సంస్థలు (ఎఫ్‌పీఓలు) వంటి వాటితో అనుసంధానం ద్వారా వాటర్ యూజర్ సొసైటీలకు ఐదేళ్ల దాకా సహకారం లభిస్తుందని అన్నారు. నీటిపారుదల ఆధునిక పద్ధతులను అనుసరించడంతో యువతను వ్యవసాయం వైపునకు ఆకర్షించే అవకాశం ఉంటుందని వైష్ణవ్ చెప్పారు. అలాగే, దేశంలోని వివిధ ఆగ్రోక్లైమేట్ జోన్లలో 78 పైలట్ ప్రాజెక్టులకు ప్రాథమిక ఆమోదం లభించిందన్నారు. ఈ ప్రాజెక్టుల ప్రయోగాత్మక అమలుతో పొందే అనుభవం ఆధారంగా 16వ ఆర్థిక కమిషన్ కాలంలోనే 2026, ఏప్రిల్ నుంచి కమాండ్ ఏరియా అభివృద్ధిజల నిర్వహణ జాతీయ ప్రాణాళిక విడుదలవుతుందని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

## కేంద్రం పెత్తనం
(మొదటి పేజీ తరువాయి)

దేశ సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోందన్నారు. ఇంధన ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని,కేంద్ర ఎక్సైజ్ సుంకాలను గణనీయంగా తగ్గించి, రాష్ట్రాలకు ఇవ్వని సెస్‌లను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెంచిన పెట్రో, గ్యాస్ ధరలను వెనక్కి తీసుకోవాలని కోరుతూ కేంద్ర పెట్రోలియం మంత్రి హార్దీప్ సింగ్ పూరికి కెటిఆర్ బుధవారం బహిరంగ లేఖ రాశారు. భూటాన్, పాకిస్తాన్, ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన శ్రీలంకలో కూడా పెట్రో, డిజిల్, ఎల్.పి.జి ధరలు భారత్ లో కంటే చౌకగా ఉన్నాయని వివరించారు. ఎల్పిజి సిలిండర్ ధర రూ.1,100 దాటడం పేద, మధ్యతరగతి ఆడపడుచులకు భరించలేని భారంగా మారిందని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉజ్వల యోజన ఒక కృరమైన జోక్ గా మారిందని, ఒకప్పుడు ఉజ్వల యోజన కింద సిలిండర్లు తీసుకున్న మహిళలు, పెరిగిన గ్యాస్ ధరలతో మళ్లీ కట్టెల పైనే వంట చేస్తున్నారని ఎద్దేవా చేశారు. మినిమం గవర్నమెంట్, మాక్సిమం గవర్నెన్స్ అన్న కేంద్ర ప్రభుత్వ నినాదం 'మాక్సిమం టాక్సేషన్, మినిమం రిలీఫ్'గా మారిందని ఆరోపించారు. మోదీ చెప్పిన 'అచ్చే దిన్' అంటే ఇఎంఐలను చెల్లించలేక, ఇంధన బిల్లుల భారం భరించలేక మిడిల్ క్లాస్ సతమతమవడమే అని అన్నారు. అంతర్జాతీయ క్రూడ్ ధరలకు అనుగుణంగా పారదర్శక ధరల విధానం అమలు చేయాలని, ఇంధన పన్నులు, సెస్ వినియోగం, ఆదాయ వాటా వివరాలతో కూడిన శ్వేత పత్రం విడుదల చేయాలని, ఆర్థిక కేంద్రీకరణ విధానాలను విడనాడి, నిజమైన సహకార ఫెడరలిజాన్ని పునరుద్ధరించాలని సూచించారు..

## మోదీ మాట్లాడరా (మొదటి పేజీ తరువాయి)

బుధవారం ఆయన ప్రసంగిస్తూ ''ఆర్థిక తుఫాను'' సమీస్తున్నదని, టారిఫ్‌ల విధింపు విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ప్రధాని మోదీ లొంగిపోయారని విమర్శించారు. 'ట్రంప్‌ను ప్రధాని మోదీ కౌగిలించుకున్న ఫోటోను మీరు చూశారా? ఈసారి మేము కౌగలించుకోబోమని, కొత్త టారిఫ్‌లు విధిస్తామని మోదీని ఆయన ఆదేశించారు. మోదీ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. దృష్టి మరల్చేందుకు పార్లమెంటులో రెండు రోజుల పాటు డ్రామా నడిపించార''ని ఎద్దేవా చేశారు. ప్రధాని ఎక్కడ దాచుకున్నాడు అని ప్రశ్నించారు. భారతదేశానికి వ్యతిరేకంగా బంగ్లాదేశ్ నాయకుడు (యూనస్) మాట్లాడితే, ఆయన పక్కనే మోదీ కూర్చున్నారని, 56 ఇంచుల ఛాతి ఎక్కడ? అని నిలదీశారు. పార్టీ పునాదులను బలోపేతం చేయడంలో భాగంగా డిసిసి అధ్యక్షులకు మరింత సాధికారత, బలం కల్పిస్తామని రాహుల్‌గాంధీ తెలిపారు. దేశవ్యాప్తంగా కుల గణన గురించి ప్రస్తావిస్తూ ''50 శాతం రిజర్వేషన్‌ల గోడను మేము బద్ధలుకొడతాం. తెలంగాణ ఏదైతే చేసిందో, మేము దేశవ్యాప్తంగా చేయబోతున్నాం'' అని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతం రాజ్యాంగానికి వ్యతిరేకమైనదని, వారు దేశంలోని అన్ని వ్యవస్థలను నియంత్రించాలనుకుంటున్నారని విమర్శించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం నాయకులు పోరాడాలని, అది అంత సులువు కాదని చెప్పారు. వారి దగ్గర అన్నీ ఉన్నాయని, కానీ మన దగ్గర నిజం, ప్రజల ప్రేమ ఉందని రాహుల్‌గాంధీ అన్నారు.

**ఉత్తర, దక్షిణ పేరుతో దేశాన్ని విభజిస్తున్న బిజెపి**

దేశాన్ని ఉత్తరం, దక్షినం పేరుతో విభజించేందుకు బిజెపి ప్రయత్నిస్తున్నదని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపి శశి థరూర్ విమర్శించారు. కాంగ్రెస్ ఆశ కల్పించే పార్టీగా ఉండాలలే తప్ప నిరాశ కలిగించేలా కాదని, కేవలం గతానికి చెందింది కాకుండా భవిష్యత్తు కోసం ఉండే పార్టీ అని, కేవలం విమర్శలకే పరిమితం కాకుండా సానుకూల వృత్తాంతంతో సాగే పార్టీ అని చెపాపరు.

## సిపిఐ సవాల్ (మొదటి పేజీ తరువాయి)

మైనారిటీలు, వెనుకబడిన, అణగారిన వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేసింది. తమిళనాడులో ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె)తో కలిసి ఒక కూటమిగా ఉంటూ, వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలంటూ ఆ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి తిరు.ఎం.కె.స్టాలిన్ అసెంబ్లీలో 2025 మార్చి 27న చేసిన తీర్మానానికి భారత కమ్యూనిస్టుపార్టీ మద్దతు ఇచ్చింది. దేశంలో ప్రజాబాహుళ్యం తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ కూడా కేంద్ర ప్రభుత్వం 2025 వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంటులో ఆమోదించింది. సంయుక్త పార్లమెంటరీ కమిటీలో సభ్యులు వ్యక్తం చేసిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదు. ఈ బిల్లుతో సంబంధం ఉన్న సమాజంలోని వివిధ వర్గాలు చేసిన విజ్ఞప్తులను కూడా పట్టించుకోలేదు. సంయుక్త పార్లమెంటరీ కమిటీకి లక్షలాదిగా వారు సమర్పించిన విజ్ఞాపనలను అభ్యంతరాలను సరిగ్గా పరిశీలించలేదు. పరిగణనలోకి తీసుకోలేదు. 2025 ఏప్రిల్ ఆరో తేదీ నుండి ఈ సవరించిన కొత్త వక్ఫ్ సవరణ బిల్లు అమలులోకి రావడంతో ముస్లిం మైనారిటీ వర్గం ప్రాథమిక హక్కులపై ఈ బిల్లు తీవ్ర ప్రభావం చూపిస్తున్నది. తక్షణం ఈ చట్టాన్ని అమలులోకి తీసుకు రావడంవల్ల తమిళనాడులో ఉన్న దాదాపు 50 లక్షలమంది ముస్లింల హక్కుల ఉల్లంఘన జరిగింది. వారిపట్ల పక్షపాతం అమలవుతోంది. దేశంలోని ఇతర ప్రాంతాలలో ఉన్న 20 కోట్లమంది ముస్లింలపై కూడా ఈ చట్టం ఇదే ప్రభావాన్ని చూపిస్తోంది. సిపిఐ (డిఎంకె)లు ఈ వక్ఫ్ సవరణ చట్టంలోని నిబంధనలను భారత సర్వోన్నత న్యాయస్థానంలో సవాలు చేస్తున్నాయి'' అని డి.రాజా తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

## సిఆర్ పాత్ర గణనీయం
(మొదటి పేజీ తరువాయి)

మార్క్స్, లెనిన్ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై ఎఐఎస్‌ఎఫ్‌లో చేరారన్నారు. విశాఖ మెడికల్ కాలేజీలో వైద్య విద్యను పూర్తి చేసి ఎర్రజెండాను చేత పెట్టారన్నారు. బ్రిటిష్ వలస పాలనను, సామంతుల అంతానికి కృషి చేశారన్నారు. జాతీయస్థాయిలో, ఆంధ్ర, తెలంగాణ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి ఎంతగానో కృషి చేశారని చాడ వెంకట్ రెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయన పాత్ర గణనీయమైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, గిరిజన సమాఖ్య నాయకులు శంకర్ నాయక్, చందు తదితరులు పాల్గొన్నారు.

**భూపోరాటాల్లో సిఆర్ దిట్ట : కూనంనేని**

దేశంలో భూపోరాలకు శ్రీకారం చుట్టి నిరుపేదల జీవనోపాది కల్పించిన చంద్ర రాజేశ్వర రావు చిరస్మరణీయుడని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు చంద్ర రాజేశ్వర్రావు 31వ వర్థంతిని బుధవారం శేషగిరిభవన్ లో ఘనంగా నిర్వహించారు. తొలుత సిఆర్ చిత్ర పఠానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో కూనంనేని మాట్లాడారు. జమీందారి కుటుంబంలో జన్మించి కమ్యూనిస్టు ఉద్యమాలకు ఆకర్షితుడై తన యావదాస్తిని పేదలకు పంపిణీ చేసిన మహానీయుడని కొనియాడారు. పేదలకు భూమి దక్కితనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని విశ్వసించిన సిఆర్ దేశవ్యాప్త భూపోరాటాలకు నాందిపలికాడన్నారు. మహిళలపై దాడులు, అరాచకాలను అరికట్టేందుకే, ఉద్యమాలను అనిచివేతను పూనుకుంటున్న ప్రభుత్వాలకు అడ్డుకట్ట వేసేందుకు ఉద్యమాల్లో పాల్గొనే ప్రజలకు రక్షణ కల్పించేందుకే ఆరు దశాబ్దాల క్రితమే జనసేవాదళ్ను ఏర్పాటు చేసిన ముందు చూపు ఉన్న మహానేత అని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో పయనించి ప్రజా ఉద్యమాలకు నిర్మించడమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, జిల్లా నాయకులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, వంగ వెంకట్, భూక్యా దస్రు, భూక్యా శ్రీనివాస్, కె.రత్నకుమార్, ఎస్‌కె ఫహీమ్, నేరెళ్ల రమేష్, ధర్మరాజు, జహీర్, వుల్లోజు వెంకట్, లక్ష్మి, గుత్తుల శ్రీనివాస్, పల్నాటి వీణ రాణి, షమీమ్, మర్రి కృష్ణ, రసూల్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఎన్‌వివిఎస్ రెడ్డికి మరో ఏడాది అవకాశం

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్‌ఎల్), హెదరాబాద్ ఎయిర్ పోర్టు మెట్రో లిమిటెడ్ (హెచ్‌ఎఎంఎల్) ఎండిగా మరోసారి ఎన్‌విఎస్ రెడ్డిని ప్రభుత్వం నియమించింది. మరో ఏడాది పాటు ఆయనను ఎండిగా నియమిస్తూ పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్ట్ పనులకు సంబంధించిన ప్రతిపాదనలు కీలకదశలో ఉన్నాయి. ఈ సమయంలో ఎన్‌విఎస్‌ఎన్ రెడ్డి సేవలను మరికొంత కాలం కొనసాగించడం సముచితం అని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. కాగా పాతబస్తీ, ఎయిర్ పోర్టు, ఫోర్త్ సిటీ, నార్త్ సిటీ వంటి ప్రాంతాలకు కూడా మెట్రోరైల్‌ను నడిపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా మెట్రోకు సంబంధించిన డిపిఆర్‌ను ఐదు నెలల క్రితమే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన విషయం తెలిసిందే.

# గాడ్సే ఆలోచన వ్యాప్తికి మోదీ యత్నం

అడ్డుకునేందుకు ప్రతి ఒక్కరూ పోరాడాలి
ఈ ఉద్యమంలో రాహుల్‌గాంధీకి అండగా నిలవాలి
అహ్మదాబాద్ సిడబ్ల్యుసి విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** గాడ్సే ఆలోచనా విధానాన్ని దేశంలో వ్యాపింపజేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారని, గాడ్సే వారసుల ఆలోచనా ధోరణిని అడ్డుకునేందుకు గాంధీ కుటుంబ సభ్యులు, రాహుల్ గాంధీ మిత్రులు, దేశం నలుమూలల ఉన్న ప్రతి ఒక్కరూ మోదీకి వ్యతిరేకంగా పోరాడాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో మూలమూలన ఉన్న గాంధేయవాదులు మోదీ వ్యతిరేక పోరాటంలో రాహుల్‌గాంధీకి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. అహ్మదాబాద్ జరుగుతున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) విస్తృత స్థాయి సమావేశంలో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. మహాత్మా గాంధీ ఆలోచనధారతో మనమంతా గాడ్సే వారసులను, మోదీని ఓడించాలన్నారు. గాంధీజీ ఆలోచనలకు అనుగుణంగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రయత్నిస్తున్నామన్నారు. బిజెపి అధికారం చేపట్టిన తర్వాత దేశంలో మోదీ చేస్తున్న విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసేందుకు సబర్మతీ ఒడ్డున కాంగ్రెస్ నాయకులు సమావేశమయ్యామని, మోదీకి వ్యతిరేకంగా పోరాడేందుకు కాంగ్రెస్ శ్రేణులంతా సిద్ధంగా ఉండాలన్నారు. రానున్న రోజుల్లో బిజెపిని ఓడించే బాధ్యతను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, గాంధీ వారసులు ఇక్కడి నుంచి తీసుకొని వెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

**బ్రిటిషర్ల కంటే బిజెపి నాయకులు ప్రమాదకారులు**
బ్రిటిషర్ల కంటే బిజెపి నాయకులు ప్రమాదకారులని, బ్రిటిషర్లను దేశం నుంచి తరిమికొట్టినట్లే ప్రజలంతా బిజెపిని దేశం నుంచి తరిమికొట్టాలని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గాంధీజీ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దండి సత్యాగ్రహంతో పాటు 30 ఏళ్ల పాటు అనేక పోరాటాలు చేశారని, కానీ బ్రిటిష్‌వారు ఎప్పుడూ గాంధీజీపై లాఠీ ప్రయోగం చేయలేదని, స్వాతంత్ర్యం వచ్చిన ఆరు నెలల్లోనే గాడ్సే వారసులు గాంధీజీపై తూటా పేల్చి ఆయనను హత్య చేశారని ఆయన అన్నారు.

**కుల గణనపై మాట్లాడాతారనే భయంతోనే రాహుల్‌కు లోక్‌సభలో మైక్ ఇవ్వలేదు :** లోక్‌సభలో రాహుల్ గాంధీ కులగణనపై మాట్లాడాతారనే భయంతోనే ఆయనకు ప్రధాని మోదీ మైక్ ఇవ్వలేదని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రాహుల్ గాంధీ నాలుగు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశారని, కులగణన, రైతు రుణమాఫీ, యువతకు ఉద్యోగాల కల్పన, మహిళల సంక్షేమంపై ఆయన వాగ్దానాలు చేశారన్నారు. పాదయాత్రలో భాగంగా తెలంగాణకు వచ్చినప్పుడు కులగణన, రైతు రుణమాఫీ, నిరుద్యోగ నిర్మూలన, మహిళల సంక్షేమానికి రాహుల్ గాంధీ హామీలు ఇచ్చారని, రాహుల్ గాంధీ వాగ్దానం మేరకు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లోనే 25 లక్షల కుటుంబాలకు రూ.21 వేల కోట్లు రుణమాఫీ చేశామని, కులగణనను చేసి చూపించామన్నారు. మోదీ రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలు తెచ్చారని, వాటికి వ్యతిరేకంగా రైతులు దాదాపు 15 నెలలు ధర్నాలు చేసినా చర్చలకు రాలేదన్నారు. మోదీ మణిపూర్‌లో మంటలు రాజేశారని, దేశ మూలవాసుల జీవన హక్కును కాలరాసే ప్రయత్నం మోదీ చేశారని విమర్శించారు. ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని మోదీ హామీ ఇచ్చి 11 ఏళ్లు దాటిపోయిందని, ఈ లెక్కన రూ.20కోట్లకు పైగా ఉద్యోగాలు ఇవ్వాలని, మోదీ, అమిత్‌షాకు ఇద్దరికే ఉద్యోగాలు వచ్చాయని, ప్రతి ఏటా 2 కోట్ల యువతకు ఉద్యోగాలు రాలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు.

### తెలంగాణలో బిజెపిని అడ్డుకుంటాం

తెలంగాణ ప్రజలు నిజాం ప్రభుత్వ పాలనలో ఉన్నప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో తెలంగాణకుస్వాతంత్ర్యం వచ్చిందని, అందుకే గుజరాత్ ప్రజలతో, వల్లభాయ్ పటేల్ వారసులతో తెలంగాణ ప్రజలకు సంబంధం ఉందని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సోనియాగాంధీ అందించారని, సోనియా గాంధీ నాయకత్వంలో బిజెపిని తెలంగాణలో అడుగు పెట్టనివ్వబోమని, బిజెపిని అడ్డుకుంటామని, వారిని ఎవరూ క్షమించరని తాను వల్లభాయ్ పటేల్ భూమి గుజరాత్ గడ్డపై నుంచి తాను ప్రకటిస్తున్నామన్నారు. తెలంగాణలో బిజెపిని అడ్డుకునేందుకు, ఓడించేందుకు తాము ఇక్కడి నుంచి ఆశను, ఆదేశాన్ని తీసుకుని వెళుతున్నామన్నారు. రైతులు, యువత, మహిళల కోసం సిడబ్ల్యుసిలో సాగినచర్చలపై ఆశతో ఇక్కడి నుంచి తాను వెనక్కు వెళుతున్నానని సిఎం అన్నారు.



## ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేతకు కుట్ర

ఎంపి ఆర్.కృష్ణయ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసి, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు ఉన్నత విద్య రాదనే అసూయతో కొందరు ఉన్నతాధికారులు సిఎంకు లేనిపోని సాకులు చెబుతూ 'ఫీజు రీయింబర్స్‌మెంట్' పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్ర చేస్తున్నారని..ఈ పథకం జోలికి వస్తే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని రాజ్యసభ సభ్యులు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.క్రిష్ణయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. హైదారాబాద్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ఆర్థిక సంవత్సరం ముగిస్తుంది.. అయితే ఇంతవరకు ప్రభుత్వం 14 లక్షల మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇబిసి విద్యార్థుల ఫీజుల బకాయిలు ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. ఒకవైపు వార్షిక పరీక్షలు వచ్చాయని, కాలేజీ యాజమాన్యాలు విద్యార్థుల హాల్ టికెట్లు ఇవ్వడం లేదన్నారు. దీంతో విద్యార్థులు పరీక్షలు రాస్తామా లేదా? అని తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజుల బకాయిలు 4వేల కోట్లు దశల వారీగా విడుదల చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్లకు వేలకోట్లు చెల్లిస్తుందని, చదువుకునే విద్యార్థులకు మాత్రం ఫీజులు చెల్లించకుండా అన్యాయం చేస్తుందన్నారు. ప్రభుత్వం యొక్క నిర్లక్ష్యం వలన లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు కాలేజీ యాజమాన్యాలు కోర్సు పూర్తి అయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో ఉన్నత కోర్సులలో సీట్లు వచ్చిన చదవలేక పోతున్నారని పేర్కొన్నారు. అలాగే హాస్టల్లో అద్దె భవనాల రేటు మూడు సంవత్సరాలుగా చెల్లించక పోవడంతో అద్దె భవనాల యాజమాన్యాలు హాస్టల్ భవనాలు ఖాళీ చేయమని ఒత్తిడి తెస్తున్నాని తెలిపారు. సమావేశంలో నేతలు నీల వెంకటేష్, మణికంత, రాజేందర్, అనంతయ్యలతో పాటు పాల్గొన్నారు.

నేడు సిఎం చేతుల మీదుగా

## యంగ్ ఇండియా పోలీసు స్కూల్ ప్రారంభం







**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా మంచిరేవుల గ్రామంలో నూతనంగా నిర్మించిన 'యంగ్ ఇండియా పోలీసు స్కూల్'ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి గురువారం ప్రారంభించనున్నారు. ఇందుకు పోలీసు అధికారులు అన్ని ఏర్పాట్లను చేశారు. ఇప్పటికే ఈ స్కూల్‌లో నూతనంగా అడ్మిషన్లను ప్రారంభించారు. సైనిక్ స్కూల్స్ తరహాలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు గత ఏడాది అక్టోబర్ 21న శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే.
భవన నిర్మాణాలు పూర్తికావడంతో రేవంత్‌రెడ్డి యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవానికి సిఎంతో పాటు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు హాజరుకానున్నారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభించడంపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ డిజి సివి ఆనంద్ తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశంసించారు. ఈమేరకు ఆయన తాజాగా ఒక వీడియో విడుదల చేశారు. పోలీస్ లైఫ్ అనేది చాలా కష్టంతో కూడుకున్నదని, వారి డ్యూటీల కారణంగా కుటుంబంతో తక్కువ సమయం గడపాల్సి వస్తుందన్నారు. ఇక, ఈ స్కూల్‌లో 50% అడ్మిషన్స్ అమరుల పిల్లలు, హోంగార్డ్స్, కానిస్టేబుల్స్ నుంచి ఐపిఎస్ ర్యాంకు అధికారుల పిల్లల వరకు రిజర్వ్ ఉంటుందని తెలిపారు. మరో 50% అడ్మిషన్స్ నాన్ పోలీస్ పిల్లలకు (సివిలియన్) ఉంటాయని తెలిపారు. ఈ స్కూల్‌లో ఫీజులు కూడా సాధారణ స్థాయిలోనే ఉంటాయని చెప్పుకొచ్చారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్లో ఇంటర్నేషనల్ లెవల్ ఎడ్యుకేషన్, సిబిఎస్‌సి సిలబస్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. అలాగే స్పోర్ట్స్ తర్వాతి తరానికి క్రమశిక్షణ, నాయకత్వ విలువలు నేర్పించేలా కృషి చేస్తారని వెల్లడించారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభం కానున్న నేపథ్యంలో, ప్రతి చిన్న అంశాన్ని పరిశీలించటం, 1200కిపైగా అతిథులు హాజరవుతుండటంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడంలో ఎంతో బిజీగా ఉన్నామని ఆయన తెలిపారు.
ఎంతోమంది చిన్నారులకు ఉజ్వలమైన భవిష్యత్తు అందించే ఈ పాఠశాల తెలంగాణ పోలీస్ శాఖ చరిత్రలోనే అతిపెద్ద మైలురాయని తెలంగాణ పోలీసులు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

'ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం' మంజూరులో

## ఎంబిసిలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

తెలంగాణ బిసి కమిషన్ తీర్మానం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకంలో అత్యంత వెనుకబడిన బిసి కులాలకు(ఎంబిసి) చెందిన నిరుపేదలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ మేరకు బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని బిసి కమిషన్ కార్యాలయంలో బుధవారం జరిగిన బిసి కమిషన్ సమావేశం తీర్మానం చేసింది.
అలాగే బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ శాసనసభ ఆమోదించిన రెండు వేర్వేరు బిల్లులను చట్టం చేసేందుకు కేంద్రం సత్వర చర్యలు తీసుకునేలా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు, కుల సంఘాలు సహకరించాలని బిసి కమిషన్ తీర్మానం చేసింది. గత నెలలో కమిషన్ రాష్ట్రంలోని వేములవాడ, జగిత్యాల, సిరిసిల్ల, ఆమన్‌గల్, అచ్చంపేట తదితర ప్రాంతాల్లో పర్యటించి, సంచార జాతుల ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్నది. వారి ఆర్థిక, సామాజిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఈ కులాలకు సంబంధించిన వారికి ఇంటిరమ్మ ఇళ్ళు, ఉపాధి నిమిత్తం రాజీవ్ యువవికాస్ పథకంలో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకు బ్యాంకులు కూడా వారికి తోడ్పాటును అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కమిషన్ విజ్ఞప్తి చేసింది. జాతీయ బిసి కమిషన్‌కు ఉన్న అధికారాలను రాష్ట్ర బిసి కమిషన్‌కు కూడా కల్పించాలని మరో తీర్మానం చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలగించిన 26 కులాలను తిరిగి బిసి జాబితాలో చేర్చే అంశాన్ని పరిశీలించాలని తెలిపింది.
ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ కులాల సర్వే 2024 ద్వారా సేకరించిన సమాచారాన్ని వెంటనే బిసి కమిషన్‌కు నివేదిస్తే, ఆయా కులాలకు సంబంధించిన విషయాలపై బిసి కమిషన్ ఒక నిర్ణయం తీసుకునేందుకు అవకాశం ఉంటుందని స్పష్టం చేసింది.

### నేడు ముంబైకి మంత్రి జూపల్లి కృష్ణారావు

దక్షిణాసియా హోటల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సులో పాల్గొననున్న మంత్రి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పర్యాటక రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా ఏప్రిల్ 10న ముంబైలో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించనున్నారు. ముంబై పోవై లేక్‌లో జరుగుతున్న 20వ దక్షిణాసియా హోటల్ ఇన్వెస్ట్‌మెంట్ కాన్ఫరెన్స్, వర్క్‌షాప్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొనన్నారు. ఇన్వెస్టర్లకు మెరుగైన రాయితీలు కల్పించి పూర్తి సహకారం అందిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు వివిధ సంస్థలకు భరోసా కల్పించనున్నారు. తెలంగాణ నూతన పర్యాటక పాలసీతో పాటు ఎకో, టెంపుల్, మెడికల్ టూరిజంలో ఉన్న అవకాశాలను మంత్రి వివరించనున్నారు. ఆతిథ్య రంగంలో పెట్టుబడుల అవకాశాలను వివరించి ఇన్వెస్టర్లను మంత్రి జూపల్లి తెలంగాణకు ఆహ్వానించనున్నారు. పర్యాటక రంగంలో రూ.15 వేల కోట్ల పెట్టుబడులను సమీకరించడం. తద్వారా 3 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ సందర్భంగా తెలిపారు.

# ఆడంబరమెరుగని ఆదర్శ నేత చంద్ర రాజేశ్వర్‌రావు

సిపిఐ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాప్ రెడ్డి

సిఆర్ ఫౌండేషన్‌లో ఘన నివాళి




**ప్రజాపక్షం/రంగారెడ్డిప్రతినిధి/శేరిలింగంపల్లి:** భారత కమ్యూనిస్టు పార్టీలో అత్యున్నత స్థానంలో ఉన్న.. తానొక గొప్ప సిద్ధాంతవేత్తననే బడాయిని ప్రదర్శించకుండా, నిరాడంబరంగా (ఆడంబరమెరుగని) జీవితాన్ని గడిపిన ఆదర్శ నేత చంద్ర రాజేశ్వర్‌రావు సిపిఐ సీనియర్ నాయకులు కందిమళ్ల ప్రతాప్ రెడ్డి అన్నారు. బుధవారం కమ్యూనిస్టు యోధుడు చంద్ర రాజేశ్వర్‌రావు 31వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్, కొండాపూర్, సిఆర్ ఫౌండేషన్‌లోని ఆయన విగ్రహానికి సిపిఐ సీనియర్ నాయకులు స్వాతంత్ర సమరయోధులు కందిమల్ల ప్రతాపరెడ్డి, సిఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి, నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీ,సిపిఐ నాయకులు నెల్లికంటి సత్యం, సిఆర్ ఫౌండేషన్ కార్యదర్శులు చెన్నమనేని వెంకటేశ్వర రావు, పిడికిటి సంధ్యా కుమారి ఉపాధ్యక్షులు కంభంపాటి అజయ్, కోశాధికారి వి.చెన్నకేశవ రావు, ఎఐటియుసి సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, ఆరోగ్య కేంద్ర డైరెక్టర్ డాక్టర్ కె.రజిని, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోశ్యభట్ల కల్పన, సభ్యులు కనపర్తి జ్యోస్న, వి.లలిత, తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహా తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కందిమల్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ వంద సంవత్సరాల కమ్యూనిస్టు పార్టీ ఉద్యమం, భారత జాతీయ, స్వాతంత్ర ఉద్యమంలోనూ, సంస్థాన విలీనోద్యమంతోపాటు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ జమీందారీ, జాగిరదారి భూస్వామ్య వ్యవస్థ నిర్మూలించడంలో చంద్ర రాజేశ్వర్ రావు నిర్వహించిన పాత్ర చెప్పుకో తగినదని అన్నారు. అంతే కాకుండా కమ్యూనిస్టు పార్టీ చీలికైనా క్లిష్టమై పరిస్థితులలో ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపట్టి పార్టీ, ప్రజాసంఘాల నిర్మాణంలోను, వారి కృషి మరువలేదని అయన గుర్తు చేశారు. రాజ్యాంగ, ప్రజాస్వామ్య, లౌకికవాద రక్షణకు, దేశ సమైక్యతకు కృషిచేసిన గొప్ప మానవతావాది చంద్ర రాజేశ్వరరావు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమం సలహా కమిటీ సభ్యులు రాజేందర్‌రావు, డాక్టర్ మండవ గోపీచంద్, తమ్మారెడ్డి తాన్యా, డాక్టర్ పి.సరస్వతి, వృద్ధాశ్రమవాసులు, మహిళా సంక్షేమ కేంద్ర వృత్తివిద్యా కోర్సుల విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

రాజీలేని పోరాటాలతోనే

# గిరిజనుల సమస్యల పరిష్కారం

తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.అంజయ్య నాయక్





**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాజీలేని పోరాటాలతోనే ఆదివాసీ గిరిజనుల సమస్యలు పరిష్కారమౌతాయని, ఇందుకు బలమైన ఉద్యమాలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.అంజయ్యనాయక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య హైదరాబాద్ జిల్లా 4వ మహాసభ బుధవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని మగ్ధూమ్‌భవన్‌లో జరిగింది. మహాసభకు ముఖ్యఅతిథిగా ఆర్.అంజయ్య నాయక్ పాల్గొన్నారు.
ఆయన మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నాయని విమర్శించారు. హైదరాబాద్ మహానగరంలో గిరిజనుల, ముఖ్యంగా లంబాడా తెగకు చెందిన ప్రజలు ఇంటి స్థలాలు లేక మురికివాడల్లో నివసిస్తున్నారని, వారికి ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించడంలేదన్నారు. ఇల్లు లేని పేద గిరిజనులకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయించాలని అయన డిమాండ్ చేశారు.
దశాబ్దాలుగా గిరిజన యువతకు రుణసౌకర్యం కల్పిస్తున్న ట్రైకార్‌లో పెండింగ్‌లో ఉన్న రూ.219 కోట్ల రుణాలను తక్షణం విడుదల చేయాలన్నారు. మహాసభలో సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు ఆర్.శంకర్‌నాయక్, చందు నాయక్ పాల్గొన్నారు. గిరిజన సమాఖ్య హైదరాబాద్ జిల్లా నూతన అధ్యక్షులుగా రూప్‌సింగ్, ప్రధాన కార్యదర్శిగా హరినాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారాయణ నాయక్, ఉపాధ్యక్షులుగా రాజునాయక్, శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా దశరథ్ నాయక్ మహాసభ ఎన్నుకుంది.

### బెట్టింగ్ కేసులను సమీక్షించిన సిట్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బెట్టింగ్ కేసుల దర్యాప్తు, ప్రాసిక్యూషన్ కోసం త్వరలో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఒపి)ని రూపొందించాలని సిట్ అధికారులు నిర్ణయించారు. ఎస్‌ఒపి ఖరారు అయిన తర్వాత, అనుసరించాల్సిన ప్రామాణిక విధానాలపై సంబంధిత అధికారులకు సంక్షిప్తంగా, శిక్షణ ఇవ్వడానికి ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తామని సిట్ ఐజి రమేష్‌రెడ్డి తెలిపారు.


**శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానము**
ధర్మపురి పట్టణం – జగిత్యాల జిల్లా.

ఆర్.సి.నెం.ఇ/31/2025 | టెండర్ ప్రకటన – 4వ పిలుపు | తేది : 09-04-2025

తేది : 17.04.2025 నుండి 31.03.2027 వరకు తలనీలాలు సేకరించుకొను హక్కు గూర్చి బహిరంగ వేలంపాట-కం-సీల్డు కొటేషన్ టెండర్-కం-ఇప్రోక్యూర్‌మెంట్ టెండర్ నిర్వహించబడును. తేది : 10.04.2025 ఉదయం 11.00 గంటల నుండి తేది. 16.04.2025 మ॥1.00గంటల వరకు ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ టెండర్ దాఖలు చేయవచ్చును. తేది : 16.04.2025 మ॥ 2.00 గంటలకు టెక్నికల్ బిడ్ ఓపెన్ చేసి మ॥ 3.00 గంటలకు ప్రైజ్‌బిడ్ ఓపెన్ చేయబడును. మరియు సీల్డు కొటేషన్ షెడ్యూల్ కొరకు మరియు బహిరంగ వేలం పాట వివరముల కొరకు కార్యాలయ పనివేళలో సంప్రదించవచ్చును.

DIPR R.O. No. : 190-PP/CL/ADVT/1/2025-26 Date:09.04.2025 సం/- కార్యనిర్వహణాధికారి

**గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్**
మల్కాజ్‌గిరి సర్కిల్ - 28 GHMC

NIT NO. 01/EE-28/SBZ/GHMC/2025-2026, పని పేరు: నిర్వహణ పనులు, ఇతర పనులు-02, అంచనా మొత్తం (రూ.లక్షలలో) 41.50, బిడ్ సమర్పణ ప్రారంభ తేదీ, సమయం: 09.04.2025 మధ్యాహ్నం 1 గం., బిడ్ సమర్పణ ముగింపు తేదీ, సమయం 16.04.2025 మధ్యాహ్నం 1 గం., పేరు మరియు అడ్రస్, ఆఫీసర్ సెల్ నెం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నెం. 9154796465, మరిన్ని వివరాలను ఈ-ప్రొక్యూర్‌మెంట్ http://www.tender.eprocurement.gov.in కు పంపవచ్చు.

Sd/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్ఎంసి, డివిజన్ నెం-28

DIPR R.O. No: 228-PP/CL/ADVT/1/2025-26 Date:09.04.2025

తెలంగాణ ప్రభుత్వము
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ)
నాగర్‌కర్నూల్ జిల్లా
ఫారం-7
(Declaration) రూఢీ ప్రకటన

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 19(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 25 ప్రకారము

గెజిట్ నెం. 13/2025 తేది: 13.03.2025
ఫైల్ నెం. G2/1638/2024

నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలములోని చెర్కూరు గ్రామము వద్ద ప్యాకేజి నెం. 29 డిస్ట్రిబ్యూటరి-82 గ్రామ పరిధినందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన ఎ. 0.16 గుంటలు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా డిస్ట్రిబ్యూటరి-82 కెనాల్ నిమిత్తం సేకరించవలిసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి ఎ॥లు 0.16 గు॥ భూమి డిస్ట్రిబ్యూటరి-82 కెనాల్ నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను రూఢీ ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

గ్రామం:చెర్కూరు మండలం: వెల్దండ జిల్లా: నాగర్‌కర్నూల్

| క్ర. సం. | రికార్డు సర్వే నెం./ SD నెం. | పట్టా/ ఇనామ్ etc.. | భూ వర్గీ కరణ మెట్ట/ ఆరుతడి/ తరి | భూ సేకరణ ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.సెంట్లు/ ఎ.గుంటలు | పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులు గల ఇతర వ్యక్తులు | పరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు | | నిర్మాణములు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 605 | [illegible] | [illegible] | 0.16 | జి.రాజు తండ్రి చిన్న అంజయ్య (0.08) జి.మల్లయ్య తండ్రి చిన్న అంజయ్య (0.08) [illegible] | 606 | 604 | 589 | 613 | [illegible] | [illegible] | [illegible] | [illegible] |
| | | మొత్తము | | 0.16 | | | | | | | | | |

భూసేకరణ చట్టం 30/2013 లోని సెక్షన్ 15 అనుసరించి పైన కనబరిచిన భూములకు సంబంధించినటువంటి రైతుల నుండి ఎటువంటి అభ్యంతరములు/ ఆక్షేపణలు లేనందున ఇట్టి రూఢి ప్రకటన చేయడమైనది.
భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.
పైన చూపిన భూమి భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్‌కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.
సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారము పైన చూపిన భూసేకరణ పిమ్మట ఏ ఒక్కరునూ వారి జీవనోపాధి కోల్పోవడం గానీ, భూమి లేని వారిగా గాని జరగడము లేనందున ఇట్టి భూసేకరణ ప్రక్రియనందు పునరుపాధి మరియు పునరావాస కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే.), యూనిట్-I, MGLISP,నాగర్‌కర్నూల్ | సం/- అదనపు కలెక్టర్ నాగర్‌కర్నూల్ | సం/- జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్

DIPR RO NO.11/LA/PP/Advt/Pub/2025-26

ప్రజాపక్షం
గురువారం, ఏప్రిల్ 10

# వడ్డీ రేట్లు తగ్గింపునకు నాంది

రిజర్వు బ్యాంక్ తన ప్రాథమిక విధాన వడ్డీరేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గిస్తూ బుధవారం చేసిన ప్రకటన సంక్షోభంలో ఉన్న ఆర్థిక వ్యవస్థకు దన్నుగా ఉండేందు కు చిన్న ఆరంభ ప్రయత్నం అనవచ్చు. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విచక్షణారహితంగా, ఏకపక్షంగా దిగుమతి సుంకాలు పెంచుతూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కల్లోలం సృష్టిస్తున్న పరిస్థితుల్లో ఏ దేశానికాదేశం తమ ఆర్థిక వ్యవస్థలను కాపాడుకునేందుకు ప్రతివ్యూహాలు రచిస్తున్నాయి. చైనా, యూరోపియన్ యూనియన్, కెనడా తదితర దేశాలు ట్రంప్‌కు పోటీగా అమెరికా నుంచి దిగుమతులపై సుంకాలు పెంచుతూ ట్రంప్ పునరాలోచనకై ఒత్తిడి చేస్తున్నాయి. భారత ప్రభుత్వం మాత్రం ట్రంప్‌కు సన్నాయినొక్కులు నొక్కుతూ ఆయన ప్రాపకం కోసం ప్రయత్నిస్తోంది. అయినా ట్రంప్ తమ దేశంతో వాణిజ్యమిగులున్న ఏ దేశాన్నీ విడిచిపెట్టడు. తమ బడ్జెట్‌లో భారీ లోటు తగ్గించటమే లక్ష్యమంటున్నాడు. దిగుమతి సుంకాల పెంపుదలవల్ల వినిమయ వస్తువుల ధరలు పెరిగి తమ కుటుంబ బడ్జెట్‌లు తలకిందులవుతాయని గత వారాంతంలో 50 రాష్ట్రాల్లో అమెరికన్‌లు నిరసన ప్రదర్శనలు జరిపారు. అయినా ట్రంప్ వైఖరిలో మార్పు లేదు. మరోవైపు స్టాక్ మార్కెట్లు అల్లకల్లోలంగా ఉన్నాయి. పదుల లక్షల కోట్లు మదుపుదారుల సంపద ఆవిరి అవుతోంది. పెట్టుబడిదారీ వ్యవస్థ అంతర్జాతీయ సంక్షోభాన్ని ప్రతిబింబిస్తున్నది. 2008 లాంటి ద్రవ్య సంక్షోభం పునరావృతమవుతుందా అనే సందేహాలు పీడిస్తున్నాయి.

ఇతర ప్రపంచ దేశాలతో పోల్చితే మన దేశంపై తక్కువగా 27శాతమే సుంకాలు పెంచారనే అల్పసంతోషం మోదీ ప్రభుత్వంలో ఉండవచ్చు. అయితే ఫార్మాపై సుంకాలను త్వరలో పెంచుతానని ట్రంప్ చెప్పనే చెప్పాడు. ట్రంప్ విధానాలతో మోదీ ప్రభుత్వం మమేకత ప్రకటించినందున అది ఇప్పుడు నోరు మెదపలేకుండా ఉంది. అయితే ట్రంప్ విధానాలు మన దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతాయని, జిడిపి వృద్ధిరేటు అంచనాలు తలక్రిందులవుతాయన్న ఆందోళన ప్రభుత్వంలో, పారిశ్రామిక వేత్తల్లో ఉన్నాయి. ట్రంప్ పదవిలోకి రాక ముందునుంచే ఆర్థిక వృద్ధికి ప్రోత్సాహకంగా వడ్డీరేట్లు తగ్గించాలన్న ఒత్తిడి రిజర్వుబ్యాంకుపై ఉంది. అయితే ద్రవ్యోల్బణం అదుపునకు ప్రాధాన్యత ఇచ్చిన గత గవర్నర్ శక్తికాంత్‌దాస్, మానిటరీ పాలసీ కమిటీ ఆ ఒత్తిళ్లకు లొంగలేదు. కొత్త గవర్నర్ వచ్చేనాటికే ప్రభుత్వం నుంచి కూడా వడ్డీరేటు తగ్గింపునకు ఒత్తిడి ఉంది. ద్రవ్యోల్బణం తగ్గుదల ధోరణులు రిజర్వుబ్యాంక్ వడ్డీరేటు తగ్గింపు నిర్ణయానికి దోహదం చేశాయి.

వినిమయ ధరల సూచీ 2024 డిసెంబర్‌లోని 5.2 శాతం నుంచి 2025 ఫిబ్రరిలో 3.6శాతానికి తగ్గింది. ఆహారం, ఇంధనం ధరలు తగ్గుదల ఇందుకు దోహదం చేశాయి. అలాగే కూరగాయల ధరలు సీజనల్ తగ్గుదలతో ఆహార ద్రవ్యోల్బణం 21మాసాలనాటి తక్కువ స్థాయికి తగ్గింది. అనగా 2025 జనవరిలోని 5.7 శాతం నుంచి ఫిబ్రవరిలో 3.8శాతానికి తగ్గింది. దీనికితోడు ఇంధన గ్రూపులో ధరలు కూడా గత సంవత్సరంతో పోల్చితే 2025ఫిబ్రవరిలో మైనస్ 1.3 శాతానికి తగ్గింది. ఈ ధోరణుల కారణంగా ప్రస్తుత సంవత్సరం ద్రవ్యోల్బణం సగటును తమ లక్ష్యమైన 4శాతం సాధించగలుగుతామని రిజర్వుబ్యాంక్ విశ్వసిస్తున్నది.

రిజర్వుబ్యాంకు బ్యాంకులకు ఇచ్చే రుణాలపై వడ్డీరేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించటం ప్రస్తుత పరిస్థితుల్లో తక్కువగానే కనిపించవచ్చు. పరిస్థితు లు ఆశాజనకంగా ఉంటే తదుపరి మానిటరీ సమీక్షలో మరికొంత తగ్గించవచ్చు. బ్యాంకుల నిరర్థక ఆస్తుల స్థితి కూడా మెరుగుపడినందున, ప్రస్తుత వడ్డీరేటు తగ్గింపును పారిశ్రామిక, వాణిజ్య వేత్తల రుణాలకే గాక గృహ, వాహన, వ్యక్తిగత రుణాలకు కూడా వర్తింపజేస్తాయని ఆశించుదాం. అయితే ఒక జాగ్రత్త అవసరం. బ్యాంకులు డిపాజిట్‌ల సేకరణకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో డిపాజిట్‌లపై వడ్డీరేట్ల తగ్గింపు నిరుత్సాహకంగా పరిణమిస్తుంది. లక్షలాదిమంది రిటైర్డ్ ఉద్యోగుల తమ రిటైర్మెంట్ సొమ్మును నమ్మకమైన ప్రభుత్వ బ్యాంకుల్లోనే డిపాజిట్ చేస్తారు. వడ్డీరేట్లు మరీ తగ్గి నెలవారీ వారి చేతికందే సొమ్ము తగ్గితే ఆ ఆదాయంపైనే ఆధారపడిన వారు ప్రత్యామ్నాయాలు ఆలోచించవచ్చు. అందువల్ల వడ్డీ తగ్గింపు విషయంలో ఆర్‌బిఐ ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలి.



హోమియోపతి వైద్యపితామహుడు డాక్టర్ శామ్యూల్ హానిమన్ జయంతిని నేడు ప్రపంచ వ్యాప్తంగా హోమియోపతి దినోత్సవంగా పాటిస్తున్న సందర్భంగా హానిమన్‌కు జేజేలు.

# ముస్లింలను విభజించటమే కొత్త వక్ఫ్ చట్టం లక్ష్యం

## ముస్లింల్లో రాజకీయ మథనానికి దారితీస్తుందా?

**అరుణ్ శ్రీవాస్తవ**

బిజెపి లౌకిక పార్టీలు అని చెప్పుకునే తన భాగస్వామి పక్షాలైన జెడి(యు), టిడిపిపై సవారీ చేస్తూ అధిక ప్రచారమైన వక్ఫ్ బిల్లును ఏప్రిల్ మాసం తొలి వారంలో పార్లమెంటు ఉభయసభల్లో ఆమోదింపజేసుకుంది. తద్వారా శతాబ్దాలుగా వక్ఫ్ నిర్వహణను ముస్లిం చేతుల్లో నుంచి లాగేసుకోవడమే కాకుండా ముస్లింల అస్థిత్వాన్ని చెరిపేసే కర్తవ్యాన్ని మోదీ ప్రభుత్వం మరింత ముందుకు తీసుకెళ్ళింది. ముస్లింల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా కాషాయ ప్రభుత్వం గతంలో అనేక చర్యలు తీసుకుంది. కానీ తాజా చర్య వారి అస్థిత్వంపై ప్రత్యక్ష, కఠినమైన దాడులలో ఒకటి. ఇది వారిని హిందూ మెజారిటీవాదానికి లొంగి ఉండేలా బలవంతపెడుతుంది. ముస్లిం అస్థిత్వం, వారి హక్కులు ఆర్‌ఎస్‌ఎస్‌కు దీర్ఘకాలంగా ఆమోదయోగ్యం కాదు. వారి అస్థిత్వాన్ని చెరపడమే కాకుండా, తాజా బిల్లు పేద ముస్లిం(పస్మందా)లను హిందూమతంలోకి (ఘర్ వాపసీ) తిరిగి తీసుకువచ్చే పెద్ద పథకంలో భాగం.

అగ్ర కుల, ధనిక ముస్లింలు ముస్లిం సమూహానికి వెన్నెముక అనే అభిప్రాయాన్ని ఆర్‌ఎస్‌ఎస్ పెంచిపోషిస్తుంది. వారే భారతదేశ విభజనకు, పాకిస్థాన్ సృష్టికి మూలకారణమని భావిస్తుంది. అలాంటి వారి రాజకీయ, ఆర్థిక ఆధిపత్యాన్ని నియంత్రిస్తే సంఘ్ ఆధిపత్యం, ఆదేశాలకు సామాన్య, పేద ముస్లింలు పెను సవాలు కాబోరు. భారతదేశం నుంచి 20 కోట్ల పైచిలుకు ముస్లింలను బైటికి పంపలేమనే వాస్తవం ఆర్‌ఎస్‌ఎస్ నేతలకు తెలుసు. వారికి సంఘ్ ఆజ్ఞలను అనుసరించాలనే బెదిరింపు ఉత్తమ ప్రత్యామ్నాయం అనేది స్పష్టం.

ఈ నేపథ్యంలో పార్లమెంటులో కేంద్ర హోం మంత్రి అమిత్ షా వాచాలత్వంపై గంభీరంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. నూతన సవరణ బిల్లు పేద ముస్లింలకు సాయం చేస్తుందని ఆయన అన్నాడు. ముస్లింలలో వివక్ష చూపడం, ఇప్పటికే కులం, వర్గం ఆధారంగా దెబ్బతిన్న సమూహాన్ని విభజించేందుకు అమిత్‌షా అలా మాట్లాడారు. దేశంలో పెద్ద సంఖ్యలో ఉన్న పేదలలో అత్యధికంగా ఉన్న హిందువులను ఉద్దేశించి ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నాయకులు ఎన్నడూ పేదలు అనే పదం వాడరు. కానీ, అకస్మాత్తుగా 'పేద ముస్లింలను సాధికారులను చేస్తామ'ని మాట్లాడుతున్నారు. ఇది కేవలం ధనిక, అగ్ర కుల ముస్లింలను సామాన్య, పేద ముస్లింల సమూహం నుంచి ఒంటరి చేసే చర్య.

భారతదేశంలో వక్ఫ్ సంప్రదాయ మూలాలు 13వ శతాబ్దంలోని ఢిల్లీ సుల్తాన్‌ల కాలం నుంచి కొనసాగుతుంది. ప్రపంచంలోనే అత్యధిక వక్ఫ్ ఆస్తులు కలిగిన దేశాలలో భారతదేశం ఒకటి. ఇక్కడ సుమారు 14.2 బిలియన్ డాలర్ల విలువైన 9 లక్షల హెక్టార్‌లకు పైగా భూములతో 8.70 లక్షల ఆస్తులు వక్ఫ్ కింద ఉన్నాయి. దేశంలో సైన్యం, రైల్వేలకు మాత్రమే పెద్ద సంఖ్యలో భూములపై నియంత్రణ ఉంది. ఇస్లాం సంప్రదాయం ప్రకారం ముస్లింలు తమ సమాజ ప్రయోజనం కోసం చేసే దాతృత్వం లేదా మతపర దానమే వక్ఫ్. వక్ఫ్ యజమాని ఖుదా(దేవుడు). వక్ఫ్ బోర్డే ఆ ఆస్తులను నిర్వహిస్తుంటుంది. వక్ఫ్ కింద ఉండే మసీదులు, పాఠశాలలు, అనాథాశ్రమాలు లేదా ఆసుపత్రులను అమ్మడం లేదా ఇతర అవసరాలకు వినియోగించడం చేయకూడదు. మొదటి నుంచి వక్ఫ్ ఆస్తులు ధనిక, అగ్రకుల ముస్లింల ఆధీనంలో ఉన్నాయి. పేద లేదా పస్మందా ముస్లింలకు వక్ఫ్ కౌన్సిల్స్ లేదా బోర్డుల వ్యవహారాలలో ఎలాంటి ప్రాధాన్యం లేదు. తాజా సవరణ ద్వారా పేద ముస్లింలు ప్రధాన లబ్దిదారులు అని అమిత్ షా నోటి వెంబడి వచ్చిన మాట దళితులు, పేద హిందువులు రాజ్యాధికారంలో తమ వాటా కోసం ప్రయత్నిస్తున్న తరుణంలో సహజంగానే సామాన్య ముస్లింలపై అద్భుతమైన ప్రభావం చూపుతుంది.

నరేంద్ర మోదీ ప్రభుత్వ తాజా బిల్లు 1995 వక్ఫ్ బిల్లులో 40కి పైగా మార్పులు తీసుకువచ్చింది. వాటిలో వక్ఫ్ ఆస్తుల నిర్వహణను వక్ఫ్ బోర్డుల నుంచి రాష్ట్ర ప్రభుత్వాలకు బదలాయించడం కూడా ఉంది. ఈ చర్యపై దేశంలో ఇస్లాం చట్టాలను పరిరక్షించే బాధ్యతను చూసే అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు స్పందిస్తూ వక్ఫ్ ఆస్తులను, నిర్వహణను బలహీనపరిచే బిల్లు అని వ్యాఖ్యానించింది.

''ఈ బిల్లు వక్ఫ్ బోర్డును నాశనం చేసేందుకే తప్ప మెరుగుపరిచేందుకు తీసువచ్చింది కాదని నేను భావిస్తున్నాను. కొత్త చట్టం బలహీనమైనది, వక్ఫ్ ఆస్తులపై దాడి చేసేది'' అని బోర్డు సభ్యుడు మాలిక్ మొహ్తసీమ్ ఖాన్ అన్నారు. భవిష్యత్తులో బోర్డును ప్రభుత్వ అధికారులే నిర్వహిస్తారనే అనుమానాలు ముస్లింలలో నెలకొన్నాయి. చివరకు ముస్లిం అధికారి అయినా తన రాజకీయ అధినాయకుని ఆకాంక్షలకు వ్యతిరేకంగా ధైర్యాన్ని కూడదీసుకోలేరనేది వాస్తవం. ''ముస్లిం ప్రభావం లేకుండా వక్ఫ్ చట్టం చేయాలనేది వారి ఉద్దేశం. వారి ప్రధాన లక్ష్యం ముస్లింలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చేయడమే'' అని ఖాన్ చెప్పడంలో నిజం ఉంది.

ముస్లిం సమాజాన్ని చుట్టుముట్టిన సంశయాలను తగ్గించేందుకు అమిత్ షా ఆవేశపూర్వక చర్యలకు పాల్పడుతున్నప్పటికీ వారిలో సామాజిక–ఆర్థిక వివక్షత, సాంస్కృతిక, మతపరమైన అణిచివేత, గడిచిన పదకొండేళ్ళ మోదీ పరిపాలనలో క్రమంగా వారిని లక్ష్యంగా చేసుకుని హింస కొనసాగుతుండడం, మరింత తీవ్రమవడం వాస్తవం. అధిక సంఖ్యాక(మెజారిటేరియన్) రాజకీయాలు మరింత ఉధృతమవుతాయి. ''భారతదేశంలో ముస్లింల హక్కులను బలహీనపరచడమే వారికి కావాలి. వర్తమాన ప్రభుత్వం పార్లమెంటరీ విలువలకు గౌరవం లేని వాతావరణాన్ని సృష్టించింది. న్యాయ విలువలు పలుచనవుతున్నాయి. నేడు ముస్లిం సమాజం అంచులకు నెట్టివేయబడింది. ఇది వాస్తవం'' అని ముస్లింలు చెప్పడం సమంజసమే.

మోదీ ప్రభుత్వం ముందుకు సాగుతున్న తీరు తీవ్రంగా కలవరపరుస్తున్నది. ఎందుకంటే ఇది బిజెపి విషతుల్య హిందూత్వ ఎజెండాను పంచుకోని లౌకిక భాగస్వాములం అని చెప్పుకునే జెడి(యు), టిడిపిలతో కూడిన సంకీర్ణ ప్రభుత్వం. ఏదేమైనప్పటికీ వారు మోదీ–షాల రాజకీయ ఆకాంక్షను నెరవేర్చారు.

వక్ఫ్ ఆస్తుల ఆక్రమణల అంశాన్ని మోదీ ప్రభుత్వం లేవనెత్తడాన్ని ఎంఐఎం సభ్యుడు అసదుద్దీన్ ఓవైసీ ప్రస్తావిస్తూ ''అదే కారణమైతే, 2014లో ఒక మంత్రి ప్రవేశపెట్టిన వక్ఫ్ ఆస్తులు(అనధీకృత ఆక్రమణదారులను తొలగింపు)బిల్లును 2024లో ఈ ప్రభుత్వం ఎందుకు ఉపసంహరించుకుంది?'' అని ప్రశ్నించారు. మోదీ, ఆర్‌ఎస్‌ఎస్ – బిజెపిలు ''షరియత్, మసీదులు, మదరసాలను'' లక్ష్యంగా చేసుకుంటున్నాయని ఆయన అన్నారు.

అమిత్ షా అన్నట్లు పాలనాపరమైన సంస్కరణలు, సాంకేతిక ఆధారమైన మెరుగుదల వంటి చర్యల ద్వారా ప్రస్తుత వక్ఫ్ చట్టంలో లోపాలను తొలగించటమే తాజా సవరణ బిల్లు లక్ష్యమైతే, అలాంటప్పుడు అమలులోఉన్న చట్టంలో పెనుమార్పులు తీసుకురావాల్సిన అవసరం ఏమొచ్చింది? ప్రస్తుతం తీసుకువచ్చిన మార్పులు అనేక వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన యాజమాన్య హక్కులు, ఇతర అంశాలపై ప్రస్తుతం ఉన్న న్యాయసవాళ్ళలో, వాటికి మరింత హాని కలిగించేలా ఉన్నాయి. అందువల్ల వక్ఫ్ బిల్లుతో మత విషయాల్లో జోక్యం చేసుకుంటున్నారని భయం వ్యాప్తి చేస్తున్నారని, అది ఓటు బ్యాంక్ రాజకీయాలతో చేస్తున్న తప్పు ప్రచారమనే అమిత్ షా వాదన పసలేనిది.

వక్ఫ్ బోర్డును, దాని కింద ఉన్న విస్తృత భూములను తమ ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకురావడం, ముస్లింలను ద్వితీయ శ్రేణి పౌరుల స్థాయికి నెట్టివేయటంపై కాషాయ శిబిరంలో ఉత్సాహం పెల్లుబుకుతుంది. నిజానికి లోతుగా పరిశీలించినట్లయితే బిజెపి వ్యూహం ముస్లింల నూతన తరహా రాజకీయాల ఆవిర్భావానికి అనుకోని వరంలా పనిచేయవచ్చు. వారి హక్కులు, వారి ఆకాంక్షల కోసం పోరాడే రాజకీయ పార్టీలకు మద్దతిస్తుంటారని ముస్లింలను సాధారణంగా నిందిస్తుంటారు. తమ సామాజిక, ఆర్థిక ప్రయోజనాలను కాపాడే రాజకీయ పార్టీ వెనుక ముస్లింలు చేరుతారనే భావనను సృష్టిస్తుంటారు. ఈ అవగాహనను సరైన దృష్టిలో విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ఇది ఊహాజనిత వదంతేనా లేదా ఉద్దేశపూరిత వంచనా? లేదా మోసమా?. ఎందుకు ముస్లింలు తమను తాము అదుపులో ఉంచుకున్నారు, నిలదొక్కుకోలేదు? ఇందుకు బలమైన కారణాలు ఉండి ఉంటాయి.

### స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర

భారత రాజకీయాలలో ముస్లింలు నిర్ణయాత్మక పాత్రను పోషించారు. వారు రాజకీయ ఆకృతిని సృష్టించడం లేదా మార్చడం చేశారు. కేరళ చరిత్రలో మలబార్ రైతాంగ పోరాటం, 1921లో ప్రఖ్యాత మోప్లా తిరుగుబాటుకు ప్రముఖ స్థానం ఉంది. ఇది ఆర్థిక సమస్యలు, బ్రిటీష్ వ్యతిరేక భావాలు, మతపరమైన ఉద్రిక్తతలతో తలెత్తింది. బ్రిటీష్ వలసవాదం, హిందూ భూస్వాములకు వ్యతిరేకంగా ఆ పోరాటం జరిగింది. పశ్చిమ బెంగాల్‌లోని తెభాగ రైతాంగ తిరుగుబాటు దేశవ్యాప్తంగా రైతాంగ తిరుగుబాటు రూపాన్ని, స్వభావాన్ని మార్చేసింది.

స్వతంత్ర భారతదేశంలో ముస్లింలు రాజకీయ, సామాజిక వ్యవస్థలో ఒక పక్కకు నెట్టివేయబడ్డారు. అలాగే ముస్లిం నాయకులను ముస్లిం సమాజ నాయకులుగా ఎదగకుండా రాజకీయ పార్టీలు నిరుత్సాహపరిచాయి. ఈ ప్రక్రియలో ముస్లింలు ఓటు బ్యాంకుగా మారారు. లౌకిక పార్టీలు బుజ్జగింపు విధానాలను అవలంభించాయని బిజెపి ఆరోపించడం ద్వారా ముస్లింలను ప్రధాన స్రవంతి రాజకీయాల నుంచి దూరం చేసింది. పెద్ద సంఖ్యలో ముస్లింలు రాజకీయ వ్యవస్థ నుండి గుర్తింపు పొందేందుకు అనాసక్తి చూపడమే కాకుండా తామంతట తాముగా రాజకీయ పాత్రను స్వీకరించకపోవడంతో ముస్లింలను న్యూనత పరచడం, అప్రతిష్టపాలు చేయటం ఆర్‌ఎస్‌ఎస్‌కు సులువైం ది.

ఇక్కడొక పరిణామాన్ని చెప్పాలి. అరవై, డెబ్బయవ దశకాలలో అనేక మతఘర్షణలు జరిగాయి. వాటిలో చాలావరకు భూమి యాజమాన్య హక్కుకు సంబంధించి ప్రారంభమైనప్పటికీ, వాటిని హిందువులలో తన పునాదిని బలపరుచుకునేందుకు, విస్తరించేందుకు ఆర్‌ఎస్‌ఎస్ ఆ ఘర్షణలను ఉపయోగించుకుంది. రెండు ఘర్షణల గురించి ప్రస్తావిస్తాను. ఒకటి బిహార్‌షరీఫ్, మరొకటి జంషెడ్‌పూర్‌లో జరిగింది. రెండు కూడా భూమి యాజమాన్యానికి సంబంధించి తలెత్తిన ఘర్షణలు. ఈ రెండు ప్రాంతాల నుంచి నాటి తూర్పు పాకిస్తాన్‌కు వలస వెళ్ళిన ముస్లింలు అక్కడ అణిచివేత కారణంగా మన దేశానికి తిరిగి వచ్చారు. ఇక్కడ గతంలోని తమ భూమి తిరిగి పొందాలనుకున్నారు. ఆ భూములను ఆక్రమించుకున్నవారు అందుకు నిరాకరించారు. ఇది ఘర్షణలు తలెత్తడానికి ప్రాథమిక కారణం. ఈ అల్లర్లను తన పునాది పెంచుకునేందుకు ఆర్‌ఎస్‌ఎస్ వాడుకుంది.

### నేడు వ్యతిరేకించిన చట్టాన్నే నాడు సమర్థించిన బిజెపి

యుపిఎ హయాంలో 2013లో తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును బిజెపి సమర్థించింది. దానిని స్వాగతించిన వారిలో బిజెపి ఎంపి షానవాజ్ హుస్సేన్ ఉన్నారు. ఆ బిల్లు అత్యంత సమంజసమైనదని, వక్ఫ్ ఆస్తుల ఆక్రమణను తగ్గిస్తుందని ఆయన అన్నారు. కానీ, నాటి యుపిఎ ప్రభుత్వం సృష్టించిన పరిస్థితుల కారణంగా తాజా వివాదాస్పద వక్ఫ్ (సవరణ) బిల్లు అవసరమైందని 2025లో మోదీ ప్రభుత్వం ఆరోపించింది. యుపిఎ హయాంలోనివక్ఫ్ సవరణ చట్టం మరో బుజ్జగింపు ప్రక్రియకు పరాకాష్ట అని అమిత్ షా అన్నారు. అలాంటప్పుడు 2013 బిల్లుకు బిజెపి ఎందుకు మద్దతిచ్చింది?

2013లో తీసుకువచ్చిన సవరణల ద్వారా ట్రిబ్యునళ్ల పనితీరు బలోపేతమవగా, 2025 బిల్లు వక్ఫ్ ఆస్తుల నిర్వహణ ప్రక్రియనే పలుచన చేసింది. నాటి బిల్లు ట్రిబ్యునల్ నిర్ణయమే తుది తీర్పు అని చెప్పగా, కొత్త బిల్లులో అలాంటి వాక్యమే లేదు. తొలిసారిగా బోర్డులో ముస్లిం ఏతరులకు అవకాశం కల్పించారు.

అదానీలు, ఇతర కార్పొరేట్ దిగ్గజాలకు వక్ఫ్ భూములను బహుమతిగా ఇచ్చేందుకే ఈ కసరత్తంతా జరిగినట్లుంది. ఇప్పటికే మోదీ ధారావిలోని అత్యంత ఖరీదైన భూములను అదానీకి కట్టబెట్టారు. గత ఏడాది ఏప్రిల్‌లో జరిగిన బహిరంగ సభలో రాహుల్‌గాంధీ ప్రసంగిస్తూ ''కేవలం రూ.300 కోట్లకే అదానీకి 45వేల ఎకరాల భూమిని మోదీ ఇచ్చేశాడ'ని అన్నారు. వక్ఫ్ భూమి, ఆస్తిపై నియంత్రణకు కొత్త చట్టం ప్రకారం వక్ఫ్ బోర్డు ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ముస్లిం కానవసరం లేదు. భారతదేశంలో వివిధ రూపాల్లో భూములు వక్ఫ్ కిందకు వస్తాయి. వాటిలో మసీదులు, ఈద్గాలు, దర్గాలు, ఖాందాహ్‌లు, ఇమాంంబరాలు, ఖబరిస్తాన్‌లు ఉన్నాయి.

కాషాయ కుట్రలను బహిర్గతం చేసేందుకు లౌకిక, ప్రజాతంత్ర శక్తులు వీధులకు ఎక్కకపోవడం దురదృష్టకరం. ముస్లింలు వారి యుద్ధాన్ని వారే చేసుకునేలా వదిలివేయబడ్డారు. హిందూత్వ శక్తులు, బిజెపి ప్రభుత్వాలు అధికార యంత్రాంగాన్ని వినియోగించి ముస్లింలను అణచివేయటం లక్ష్యంగా చేసుకున్నాయి. ఆ పరిస్థితుల్లో వారి హక్కులు, అస్థిత్వం కోసం వారే ఎలా పోరాటం చేయగలరు? యుపిలో హిందూత్వ ఛాందసవాది యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ప్రభుత్వం వారిని భయోత్పాతానికి గురి చేయడమే కాకుండా, ముస్లింల వందలాది ఇళ్లను బుల్డోజర్‌లతో నేలమట్టం చేసింది.

### ముస్లింలను వంచించిన జెడి(యు),టిడిపి

మోదీ కొంత ఆలస్యంగానైనా తమ పట్ల సానుకూల వైఖరి అవలంభిస్తారని, పీడకలల కాలం అంతమవుతుందనే ఆశతో ముస్లింలు కాషాయ హింస, అణిచివేతలను భరించేందుకే ముస్లింలు మొగ్గు చూపారు. కానీ, తాజా చర్య ద్వారా మోదీ, ముస్లింల సాంస్కృతిక, సామాజిక అస్థిత్వాన్ని నాశనం చేయడం ద్వారా సమూలంగా అణగదొక్కాలని కాషాయ ఆవరణ చూస్తున్నట్లు స్పష్టమైన సందేశమిచ్చారు.

కొత్త చట్టంతో ముస్లింలకు వారి అస్థిత్వాన్ని కాపాడుకునేందుకు ప్రజాస్వామిక పోరాటాలు తప్ప మరో ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. ఇది కొత్త తరహా ముస్లిం నాయకులు ఆవిర్భవించడానికి దోహదపడుతుంది. ఇప్పటికే బిల్లు ఆమోదంతో తాము నమ్మకద్రోహానికి గురయ్యామనే భావన ముస్లింలలో ఉంది.


స్వయం ప్రకటిత లౌకిక నాయకులు నితీశ్ కుమార్, చంద్రబాబు నాయుడు, చిరాగ్ పాశ్వాన్‌లు లౌకిక శక్తులు, పార్టీలపై ముస్లింలకు నమ్మకం లేకుండా చేశారు. ఇప్పటికే అనేక ముంది ముస్లిం నాయకులు జెడి(యు), టిడిపిని వీడారు. అందుతున్న సమాచారం ప్రకారం త్వరలో పట్నా లో పలువురు ముస్లిం నాయకులు సమావేశమై కాంగ్రెస్‌వైపు తిరిగి వెళ్లటమా లేక గాంధేయ సిద్ధాంతంతో కొత్త పార్టీని ఏర్పాటు చేయడమా అనే అంశంపై సమాలోచనలు చేస్తారని తెలుస్తున్నది.

(ఐపిఎ సర్వీస్)

# వైద్య ఆరోగ్య శాఖలో నిబంధనలకు పాతర...అక్రమార్కులకే పెద్దపీట

**ఇ.చంద్రశేఖర్**

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలో నిబంధనలను బేఖాతరు చేస్తున్నారని, అంకితభావంతో పనిచేస్తున్న వారిని పట్టించుకోకుండా అక్రమార్కులకే పెద్దపీట వేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత పదేళ్ల బిఆర్‌ఎస్ పరిపాలనలో ఇష్టారాజ్యంగా కొనసాగిన శాఖలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా తమ పని పరిస్థితుల్లో ఆశించిన మార్పు రాలేదని ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఉద్యోగులకు న్యాయం చేయాల్సిన ఉన్నతాధికారులు తమకు కావాల్సిన వారికి, ముడుపులు ముట్టజెప్పిన వారికి మాత్రమే న్యాయం చేస్తున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. పదకొండున్నర ఏళ్లుగా ఒక ఉద్యోగి ఒకే చోట విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఆ విషయాన్ని ప్రజారోగ్య డైరెక్టరేట్ అధికారులు రోస్టర్‌లో చూపకుండా దాచిపెడుతున్నారంటే శాఖలో పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమౌతుందని అంటున్నారు. విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ఉద్యోగులను క్రమశిక్షణ పేరుతో లగ్జరీగా ఉండే హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు అధికారులు బదిలీ చేస్తుండటం చూసి ఉద్యోగులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఆరోగ్య సమస్యలు, ఆపదలు, మానవత్వ కారణాలు, మెడికల్ గ్రౌండ్స్ కింద అభ్యర్థిస్తే సవాలక్ష అడ్డంకులు, బదిలీలు నిషేధం అంటూ దాటవేస్తున్నారని అంటున్నారు. జిఓ 317 అమలులో అక్రమాలు జరుగుతున్నాయని, కేవలం జోన్‌ను మాత్రమే కేటాయించాల్సి ఉండగా, జోన్‌తో పాటు విధులు నిర్వహించే ఇనిస్టిట్యూట్ కేటాయించిన తీరు కొంత మంది అధికారుల అవినీతి చర్యలు అద్దం పడుతుందంటున్నారు. స్వయంగా సిఎం ప్రాతినిధ్యం వహిస్తున్న పాలమూరు జిల్లాలో కుమారుని మానసిక పరిస్థితి బాగాలేని ఒక నర్సు నైట్ డ్యూటీలేని పోస్టింగ్ కోసం మూడేళ్లుగా ఎదురు చూస్తున్న విషయం తోటి ఉద్యోగులను కంట తడిపెట్టిస్తున్నది. ఇక ప్రభుత్వ నిబంధనలు ఎన్ని వున్నా ముడుపులు ఇవ్వని వారికి మాత్రం ఏ రకంగా పోస్టింగ్ ఇవ్వొద్దని చెప్పేందుకు రాత్రి బవళ్ళు మరి కష్టపడి ఆ ఫైల్‌లో జోడించి తిరస్కరించే విధంగా చేసే ఘనాపాఠీలు డిహెచ్‌పి, డిఎంఇ, కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయాలలో పాతుకపోయారని శాఖలో చర్చ జరుగుతున్నది. సుదూర ప్రాంతాల్లో పోస్టింగ్ ఆర్డర్ వచ్చిన ఒక ఉద్యోగి, గతంలో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డ అదే ఉద్యోగికి ఇప్పుడు కోర్ట్ కేసులు చూసేందుకని ఆయనకు ఒక హోదాతో కూడిన పోస్టింగ్‌ను సృష్టించి ఉద్యోగాన్ని కట్టబెట్టడం ఇందుకు నిదర్శనం. ప్రతి దానికి ఒక లెక్కగట్టి చెప్పేందుకు స్వయంగా మంత్రి పేషీలో ఒక ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఉద్యోగికి అవకాశం కల్పించారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. గత పదేళ్ల బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక సమస్యను ఎదుర్కొంటే ఇప్పుడు మరొక సమస్య ను ఎదుర్కోవాల్సి వస్తుందని ఉద్యోగు లు మథన పడుతున్నారు.



**బదిలీలపై నిషేధం ఉన్నా క్రమశిక్షణ చర్యల పేరుతో ఎఫ్ఎస్‌డిలు, డిప్యూటేషన్‌లు**

ప్రస్తుతం బదిలీలపై నిషేధం ఉన్న తరుణంలో మరెన్నో మార్గాలను తెరచిపెట్టిన డిపిహెచ్ సిబ్బంది ఇప్పుడు తాజాగా ముగ్గురు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌లకు హైదరాబాద్‌లో వివిధ డిఎంహెచ్‌ఓలలో పనిచేసేందుకు క్రమశిక్షణా చర్యల కింద పోస్టింగ్‌కు ఉత్తర్వులు ఇచ్చేందుకు సన్నద్ధమౌతున్నట్లు సమాచారం. కానీ మూడేళ్ళుగా ముప్పుతిప్పలు పెడుతున్న సదరు నర్సింగ్ ఆఫీసర్‌కు చెందిన ఫైల్ విషయంలో ఇటు మంత్రి అటు సెక్రెటరీ ఏ మాత్రం నోరు మెదపకపోవడం పరిస్థితికి అద్దం పడుతుంది. సిఎం ప్రాతినిధ్యం వహిస్తున్న పాలమూరు జిల్లాకు చెందిన ఒక నర్సింగ్ ఉద్యోగికి ఇంత అన్యాయం జరుగుతుంటే ఇక మిగతా వారి పరిస్థితి ఏమిటని సదరు నర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు పెదవి విరుస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం బదిలీలపై నిషేధం విధించిన కాలంలోనే ప్రస్తుత డిపిహెచ్ నిబంధనలకు విరుద్ధంగా క్రమశిక్షణ చర్యల పేరుతో పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చినప్పటికీ వైద్య ఆరోగ్య శాఖ సెక్రెటరీ, ఆ శాఖ మంత్రి ఏ మాత్రం పట్టించుకోలేదని ఉద్యోగ సంఘాలు విమర్శిస్తున్నాయి. గత మూడు నాలుగు నెలలుగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి పేషీలో పెద్ద సంఖ్యలో ఫైల్స్ ఉన్నా పట్టించుకోవడంలేదని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

**క్రమశిక్షణ చర్యల పేరుతో ఉద్యోగికి హైదరాబాద్‌లో పోస్టింగ్...ఇదెక్కడి చోద్యం? :** జిల్లాలో, లేదా ఇతర ప్రాంతాలలో ఒక ఉద్యోగి తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం వారిని సుదూర ప్రాంతాలకు పోస్టింగ్ ఇవ్వడం సర్వ సాధార ణం. కానీ వైద్య ఆరోగ్య శాఖలో పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉంటున్నది. ఈ శాఖలో ఉద్యోగులు తమకు నచ్చిన మెచ్చిన స్థలంలో అది కూడా తమకు ఇష్టమైన ఇనిస్టిట్యూట్‌లో పోస్టింగ్ కావాలంటే వారికి కావాల్సిన కట్నం చెల్లించుకుంటే ఇక జెట్ స్పీడ్‌కు మించి ఆర్డర్స్ ఇవ్వడమే తరువాయి అంటున్నారు. ఇలా ఈ శాఖలో చాలా మంది ఉద్యోగులు బదిలీలపై నిషేధం ఉన్న కాలంలోనే ప్రస్తుత, గతంలో ఉన్న డిపిహెచ్ ఒకరికిమించి మరొకరు ఆర్డర్స్ ఇచ్చారని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ డెంటల్ కళాశాలలో స్టాఫ్ నర్సులకు ఇలాగే ఇచ్చారని, ఇంకా మరికొన్ని ప్రాంతాల్లో కూడా ఉత్తర్వులు ఇచ్చారని ఉద్యోగులు విమర్శిస్తున్నారు. క్రమశిక్షణ చర్యలంటే హైదరాబాద్‌లో ఉద్యోగికి పోస్టింగ్ ఇచ్చే కొత్త సంప్రదాయానికి, నిర్వచనానికి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెరలేపారంటే వీరు ఎంత ఘనులో అర్థం చేసుకోవచ్చని ఉద్యోగులు వాపోతున్నారు.

**317 జిఓలో అడ్డు అదుపూ లేకుండా అక్రమాలు**

జిఓ 317తో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఉద్యోగులను రాచి రంపాన పెట్టిందనే అపవాదును తెచ్చుకొంది. వాస్తవానికి ఈ జిఓ ప్రకారం ఉద్యోగులకు జోన్ మాత్రమే కేటాయించాలి. కానీ కొంతమంది డిపిహెచ్ కార్యాలయ సిబ్బంది పలు జిల్లాలలో డిఎంహెచ్‌ఓ కార్యాలయంలో చక్రం తిప్పే అధికారులు ఉద్యోగికి జోన్ కేటాయించడంతో పాటు విధులు నిర్వహించే ఇనిస్టిట్యూట్‌ను కేటాయించి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని అంటున్నారు. ఈ జిఓ ద్వారా అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు నష్టం జరిగితే విధులకు దుమ్మా కొట్టి సరిగ్గా విధులు నిర్వహించని తూతూ మంత్రంగా విధులు నిర్వహించే ఉద్యోగులకు మేలు జరిగిందని స్వయంగా ఉద్యోగులే చెబుతున్నారు.





**11 ఏళ్లుగా ఒకే ఇనిస్టిట్యూట్‌లో విధులు నిర్వర్తిస్తున్న స్టాఫ్ నర్సు**

కరీంనగర్ జిల్లా నుండి గత 11 ఏళ్ళ కింద ఒక స్టాఫ్ నర్స్ ప్రభుత్వ డెంటల్ కళాశాలలో చేరింది. ఇప్పటికీ ఎన్ని బదిలీలు ఉన్నా ఆమె పోస్టింగ్‌ను మాత్రం రోస్టర్‌లో చూపించకుండా డిపిమెచ్ కార్యాలయ సిబ్బంది దాచిపెడుతూ మిగతా ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నారని ఉద్యోగులు అంటున్నారు. ఈ ఉద్యోగికి ఇప్పటికి జోన్ సైతం అలాట్ కాకపోయినా ఇక్కడే విధులు నిర్వహిస్తుండడం గమనార్హం. ఇప్పటివరకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, కార్యదర్శి కనీసం ఇలాంటి వారు ఎంతమంది ఉద్యోగులు వున్నారని తేల్చకపోవడం ఎంత నిర్లక్ష్యంగా ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్నారో చెప్పడానికి నిదర్శనం.

**ఆరేళ్ళు దుబాయ్‌లో క్లినిక్ ...ఆపై మళ్ళీ రాష్ట్రంలో పోస్టింగ్ ?**

సంగారెడ్డి జిల్లాలో ఒక వైద్యాధికారి దుబాయికి వెళ్లి అక్కడే ప్రైవేట్‌గా క్లినిక్ పెట్టుకుని ఆరేళ్ళ తర్వాత తిరిగి అదే జిల్లాలో పోస్టింగ్ కావాలంటే ప్రస్తుత డిపిహెచ్ ఆ వైద్య అధికారికి పోస్టింగ్ ఇచ్చారని విశ్వసనీయ సమాచారం. ఈ వ్యహారం కాస్త బయటకి పొక్కడంతో నామ మాత్రం చర్యలు తీసుకునే క్రమంలో డిపిమెచ్‌తో పాటు డిడికి ఆ శాఖ కార్యదర్శి ఛార్జ్ మెమో ఇచ్చి చేతులు దులుపుకున్నారు. కాగా ఈ వ్యవహారంలో లక్షల రూపాయలు చేతులు మారాయని పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది.

**సిఎం ప్రాతినిధ్యం వహిస్తున్న పాలమూరు జిల్లా నర్సింగ్ ఆఫీసర్‌కే కష్టాలు**

సవ్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తు న్న పాలమూరు జిల్లాకు చెందిన ఒక నర్సింగ్ ఆఫీసర్‌నే డిపిహెచ్ అధికారులు ముప్పుతిప్పలు పెడుతున్నారు. తమ కుమారుడి మానసిక పరిస్థితి బాగాలేనందున నైట్‌షిఫ్ట్ లేని ఇనిస్టిట్యూట్‌కు పోస్టింగ్‌కోసం దరఖాస్తు చేసుకోగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. మూడేళ్లుగా ఆ నర్సింగ్ అధికారి బదిలీ ఫైల్‌ను పట్టించుకోని అధికారులు మరొక జిల్లా నుండి కేవలం వారం రోజుల్లోనే ఎఫ్ఎస్‌డి పోస్టింగ్ ఆర్డర్స్ మరొక నర్సింగ్ ఆఫీసర్‌కు ఇచ్చారంటే వైద్య ఆరోగ్య శాఖలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇకనైనా వైద్య ఆరోగ్య శాఖపై సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి ఇలాంటి అక్రమాలను కట్టడి చేసేలా చర్యలు చేపట్టాలని, అలాగే పాలమూరుకు చెందిన నర్సింగ్ ఆఫీసర్‌కు న్యాయం చేయాలని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి.

# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## ఐఇడి పేలుడులో బిఎస్ఎఫ్ జవాన్‌కు గాయాలు

**న్యూఢిల్లీ/అమృత్‌సర్ :** పంజాబ్‌లోని భారత్‌–పాకిస్తాన్ అంతర్జాతీయ సరిహద్దు వెంబడి బుధవారం జరిగిన ఐఇడి పేలుడులో బిఎస్ఎఫ్ జవాన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన బుధవారం రాత్రి గురుదాస్‌పూర్ జిల్లాలోని డోరాంగ్లా గ్రామ సమీపంలో జరిగింది. సరిహద్దు భద్రతా దళం పంజాబ్‌లోని ఈ ముందు భాగంలోని 553 కిలోమీటర్ల పొడవునా 'అలర్ట్' జారీ చేసింది, పేలుడు ప్రాంతం చుట్టూ వ్యవసాయాన్ని నిలిపివేసింది. 'సాంకేతిక మరియు ఫోరెన్సిక్' దర్యాప్తు ముగిసిన తర్వాత, బిఎస్ఎఫ్ ఈ విషయాన్ని చేపట్టి, సరిహద్దులో ఉన్న వారి సహచరులకు పాకిస్తాన్ రేంజర్స్‌కు బలమైన నిరసన నోట్‌ను జారీ చేస్తుంది, ఫోర్స్‌లోని వర్గాలు పిటిఐకి తెలిపాయి. ఒక బిఎస్ఎఫ్ పార్టీ రాత్రి సమయంలో కంచెకు ముందు 'ఏరియా డామినేషన్' గస్తీని చేస్తోందని, భారత భూభాగంలో ఐఇడి పేలుడు పరికరాలను గుర్తించినట్లు ఫోర్స్ ఒక ప్రకటనలో తెలిపింది. పేలుడు కారణంగా కానిస్టేబుల్ ర్యాంక్ జవాన్ పాదాలకు గాయాలు అయ్యాయని, అతని కాలి వేలు ఒకటి ఎగిరిపోయిందని వర్గాలు తెలిపాయి.

## బిజెపిది దళిత వ్యతిరేక మనస్తత్వం

### దళిత నేత ఆలయానికి వెళితే శుద్ధి చేయడమే ఇందుకు నిదర్శనం : రాహుల్‌గాంధీ విమర్శ



**అహమ్మదాబాద్ :** బిజెపి దళిత వ్యతిరేక మనస్తత్వాన్ని కలిగి ఉందని ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శించారు. రాజస్థాన్ అల్వార్‌లోని రామాలయంలో జరిగిన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు తికారం జుల్లీ పాల్గొనగా కార్యక్రమం అనంతరం ఆలయాన్ని బిజెపి నాయకుడు గంగాజలం చల్లి శుద్ధి చేయడంతో కాషాయ పార్టీ మనస్తత్వం పూర్తిగా బట్టబయలు అయిందని పేర్కొన్నారు. దేశం రాజ్యాంగం, సూత్రాల ద్వారా నడుస్తుందని, బహుజనులను రెండవ తరగతి పౌరులుగా భావించే 'మనుస్మృతి' ద్వారా కాదని రాహుల్ అన్నారు. బిజెపి నాయకుడు చేసిన పనికి ఆ పార్టీ అగ్రనాయకత్వం క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ మంగళవారం నాడు డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై రాహుల్‌గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. బిజెపి దళిత, మనువాద వ్యతిరేక ఆలోచనకు ఇది మరొక ఉదాహరణ అని, ఆ పార్టీ నిరంతరం దళితులను అవమానిస్తూ రాజ్యాంగంపై దాడి చేస్తోందని మండిపడ్డారు. అందుకే రాజ్యాంగాన్ని గౌరవించడం మాత్రమే కాదు, దానిని రక్షించడం కూడా ముఖ్యమేనన్నారు. మోదీ జీ, ఈ దేశాన్ని రాజ్యాంగం, దాని సూత్రాల ద్వారా నడిపించాలని, బహుజనులను రెండవ తరగతి పౌరులుగా పరిగణించే మనుస్మృతితో కాదని ఎఐసిసి సమావేశంలో పాల్గొనడానికి అహమ్మదాబాద్‌కు విచ్చేసిన సందర్భంగా గాంధీ స్పష్టం చేశారు. జ్ఞానదేవ్ అహుజా చేసిన చర్య దళితులకు అవమానంగా ఉందని జూలీ, మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ సహా కాంగ్రెస్ నాయకులు అభివర్ణించారు. అయితే బిజెపి నాయకుడు ఆ ఆరోపణను ఖండించారు. తన చర్యకు కుల కోణం లేదని చెబుతూ, అహుజా తన చర్యను సమర్థించుకున్నారు. కాంగ్రెస్ నాయకులకు అలాంటి వేడుకలకు హాజరు కావడానికి నైతిక అధికారం లేదని, ఆ పార్టీ నాయకత్వం రాముడి ఉనికిని ప్రశ్నించి గతేడాది అయోధ్యలో జరిగిన ముడుపు కార్యక్రమాన్ని బహిష్కరించిన విషయాన్ని ఈ గుర్తు చేశారు. ఇదిలా ఉండగా, ఆల్వార్‌లోని ఒక నివాస సముదాయంలో ఉన్న రాముడి ఆలయంలో ముడుపు కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి కాంగ్రెస్ నేత జుల్లీ కూడా హాజరయ్యారు. ఈ నేపథ్యంలో బిజెపి నేత అహుజా అక్కడికి వెళ్లి ఆలయ ప్రాంగణాన్ని శుద్ధి చేయడానికి గంగాజలం చల్లినట్లు చెప్పారు. ఈ విషయమై అహుజాను ప్రశ్నించగా, జుల్లీ దళితుడు కాబట్టి తాను ఆలయాన్ని శుద్ధి చేయలేదని, రాముడి పట్ల కాంగ్రెస్ నాయకుల దృక్పథం, వైఖరి కారణంగా తాను ఈ చర్య తీసుకున్నానని అహుజా పిటిఐతో అన్నారు. మరోవైపు, అహుజా చర్య దళితుల పట్ల బిజెపి మనస్తత్వాన్ని సూచిస్తుందని జుల్లీ పేర్కొన్నారు. ఇది తన విశ్వాసంపై దాడి మాత్రమే కాదు, అంటరానితనం అనే నేరాన్ని ప్రోత్సహించే ప్రయత్నం కూడా అని ఆయన పేర్కొన్నారు.

# బ్యాలెట్‌ను తిరిగి తీసుకురావాలి

### మహారాష్ట్ర ఎన్నికల్లో మోసం

### దేశాన్ని అమ్మేస్తున్న మోదీ

### కాంగ్రెస్ నేతలు పనిచేయకపోతే తప్పుకోవాలి

### ఎఐసిసి ప్లీనరీలో మల్లిఖార్జున ఖర్గే హెచ్చరిక



**అహమ్మదాబాద్ :** పని చేయని నాయకులకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. పార్టీ పనికి సహాయం అందించని వారు విశ్రాంతి తీసుకోవాలని, తమకు అప్పజెప్పిన బాధ్యతలను పూర్తి చేయని వారు రిటైర్ కావాలని అన్నారు. సంస్థాగతంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల పాత్రను మరింత పెంచుతామని, పార్టీ అభ్యర్థుల ఎంపికలో వారి మాటకు విలు ఉంటుందని చెప్పారు. గుజరాత్‌లోని సబర్మతీ నది తీరంలో బుధవారం జరిగిన ఎఐసిసి ప్లీనరీలో ఖర్గే ప్రారంభోపన్యాసం చేస్తూ మహారాష్ట్ర ఎన్నికల్లో మోసం జరిగిందని, అందుకే తిరిగి బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ అక్రమాలను అరికట్టకపోగా, వాటిని లేవనెత్తిన పార్టీలనే నిందిస్తున్నదని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం ఆశ్రిత పెట్టుబడిదారులకు లబ్ది చేకూర్చేందుకు ప్రభుత్వ ఆస్తులను అమ్మేస్తున్నదని, ప్రజాస్వామ్యాన్ని నెమ్మది, నెమ్మదిగా అంతమొందిస్తోందని ఖర్గే విమర్శించారు. వనరులను కొద్దిమంది ఆశ్రిత పెట్టుబడిదారులకు కట్టబెట్టి గుత్తాధిపత్యాన్ని స్థిరపరుస్తున్నదన్నారు. ప్రైవేటీకరణ ద్వారా ఎస్‌సి,ఎస్‌టి,ఒబిసి రిజర్వేషన్‌లను అంతం చేస్తున్నారని మండిపడ్డారు. ఇదే కొనసాగితే నరేంద్ర మోదీప్రభుత్వం, మోదీ మొత్తం దేశాన్నే అమ్మేసి, వెళ్ళిపోతారని ఆరోపించారు. ప్రపంచమంతా ఇవిఎం నుండి తిరిగి బ్యాలెట్ పేపర్‌ల వైపు మళ్ళుతుంటే, మనం ఇంకా ఇవిఎంలను వాడుతున్నామని, ఇదంతా మోసమని, అధికార పార్టీ లబ్దికి, ప్రతిపక్షాలకు నష్టం కలిగించేందుకు ఇలాంటి టెక్నిక్‌లను వాడుతున్నారని మండిపడ్డారు. మహారాష్ట్రలో బిజెపి 90 శాతం సీట్లను ఈ విధంగానే గెలిచిందని, దీని గురించి రాహుల్‌గాంధీ బలంగా లేవనెత్తిత్తారని గుర్తు చేశారు.ఎలాంటి ఓటరు జాబితాను తయారు చేశారు? మహారాష్ట్రలో జరిగింది మోసం, హర్యానాలో కూడా అదే జరిగిందని ఖర్గే అన్నారు.

ఇంకా 500 ఏళ్ల అంశాలనే లేవనెత్తుతున్నారు

భవిష్యత్తు సవాళ్ళకు సన్నద్ధం కాకుండా 500 సంవత్సరాల క్రితం నాటి పాత అంశాలను లేవనెత్తుతూ బిజెపి ప్రభుత్వం మతతత్వాన్ని రెచ్చగొడుతున్నదని, ప్రజలను విభజిస్తూ, వారి మధ్య ద్వేషాలను ప్రోత్సహిస్తున్నదని ఖర్గే మండిపడ్డారు. అలాంటి ప్రమాదకరమైన ఆలోచనలకు ఎన్నడూ మద్దతివ్వద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంస్థాగతంగా కీలక పాత్ర పోషిస్తారని, కాబట్టి ఎఐసిసి మార్గదర్శకాలను కచ్చితంగా అనుసరించి నిష్పాక్షికంగా వారిని నియమించాలని అన్నారు. బూత్ కమిటీలు, మండల కమిటీలు, బ్లాక్ కమిటీలు, జిల్లా కమిటీలలో డిసిసి అధ్యక్షులు నియమితులై ఏడాదిలోగా మంచి వారిని నియమించాలని , ఇందులో ఎలాంటి పక్షపాతం ఉండొద్దని స్పష్టం చేశారు. భవిష్యత్తులో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో డిసిసి అధ్యక్షులను భాగస్వాములను చేస్తామన్నారు. సబర్మతీ నది తీరం నుంచి సంకల్పం, పోరాటం, అంకితభావం అనే సందేశాన్ని తీసుకొని న్యాయ పథంలో నడుస్తామని చెప్పారు. మనం మరోసారి భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేస్తున్నామని, రెండవ స్వాతంత్ర్య పోరాటంలో అన్యాయం, అసమానత, వివక్ష, పేదరికం, మతత్వమే మన శత్రువులుని ఖర్గే ఉద్బోధించారు. గతంలో విదేశీయులు అన్యాయాన్ని, పేదరికాన్ని, అసమానతలను ప్రోత్సహిస్తే, నేడు మన స్వంత ప్రభుత్వమే ఆ పని చేస్తున్నదని అన్నారు. ''విదేశీయులు మతతత్వం నుంచి ప్రయోజనం తీసుకునేవారు. నేడు మన స్వంత ప్రభుత్వమే ఆ పని చేస్తుంది. కానీ, మనం ఈ పోరులు గెలస్తాం'' అని ఖర్గే విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రభుత్వం కొద్ది రోజలకు ఒకసారి కొత్త నినాదాలు ఇస్తుందని ఎద్దేవా చేశారు. రాజ్యాంగ వ్యవస్థలు, సూత్రాలపై దాడి జరుగుతున్నదని, వాటి పరిరక్షణకు పోరాటం చేయాలన్నారు. ప్రభుత్వం తమ ఇష్టానుసారం పార్లమెంటు బడ్జెట్ సమావేశాలను నిర్వహించిందన్నారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడి పేరును స్పీకర్ ప్రస్తావించినప్పటికీ, ఆయనకు మాట్లాడే అవకాశం కల్పించలేదని, ఇది ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటు అని, ప్రధాన ప్రతిపక్ష నేతనే మాట్లాడించకపోతే ప్రజలను ఏ విధంగా గొంతెత్తనిస్తారని అన్నారు. ప్రజా సమస్యలపై చర్చించకుండా ప్రభుత్వం తన మతతత్వ ఏకీకరణ ఎజండా(వక్ఫ్ సవరణ బిల్లు) కోసం రాత్రంతా చర్చించిందని విమర్శించారు. తెల్లవారుజామున 4 గంటలకు మణిపూర్ అంశంపై చర్చ చేపట్టారని, మరుసటి రోజు చేపట్టాలని కోరినా ప్రభుత్వం పట్టించుకోలేదని ఖర్గే అన్నారు. బిజెపిది దళిత వ్యతిరేక ఆలోచనాధోరణిని అని, రాజస్తాన్‌లోని ఆల్వార్‌లో కాంగ్రెస్ నేత తీకారామ్ జుల్లీ రామమందిరం వెళ్ళొచ్చాక గంగా జలంతో శుద్ధి చేశారని మండిపడ్డారు. ఎఐసిసి సమావేశంలో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ తీర్మానాన్ని ఆమోదించింది. ఎఐసిసి విస్తృతస్థాయి సమావేశానికి దేశం నలుమూలల నుంచి ఎన్నికైన, కో ఆప్ట్ చేసుకోబడిన 1700 మందికి పైగా ఎఐసిసి సభ్యులు హాజరయ్యారు.

## బెంగాల్‌లో టీచర్ల ఆందోళన



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో టీచర్ల నియామకాల ప్రక్రియ పూర్తిగా కళంకితమైనదని సుప్రీం కోర్టు తీర్పుఇచ్చిన నేపథ్యంలో బుధవారం ఉద్యోగాలు కోల్పోయిన ఉపాధ్యాయులు, ఇతర బోధనేతర సిబ్బందిలోని ఒక వర్గం ఆందోళనకు దిగింది. దక్షిణ కోల్‌కతాలోని పాఠశాలల విభాగం కార్యాలయం వెలుపల నిరసన ప్రదర్శన నిర్వహించగా, టీచర్లకు పోలీసులకు మధ్య ఘర్షణ తలెత్తింది. జిల్లా ఇన్‌స్పెక్టర్ (డిఐ) కార్యాలయం వెలుపల నుండి నిరసన కారులను చెదరగొట్టడానికి కొంతమంది అధికారులు తమను కాళ్లతో తన్ని తరిమేయడమే కాకుండా లాఠీ ఛార్జ్ చేశారని నిరసనకారులు ఆరోపించారు. ఈ ఘటనలో కొందరు గాయపడ్డారన్నారు. అయితే వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన నిరసనలలో ఆందోళనకారులు కొంత స్తబ్దుగా ఉన్నప్పటికీ ఈ కేసులో మాత్రం అత్యుత్సాహం చూపిస్తున్నారని ఆరోపించారు. కాగా, పోలీసుల చర్యలను ప్రతిపక్ష బిజెపి తీవ్రంగా విమర్శించింది. నిరసనకారులు డిఐ కార్యాలయం గేటును పగలగొట్టి బలవంతంగా ఆవరణలోకి ప్రవేశించారని ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సౌత్ సబర్బన్ డివిజన్) బిదిషా కలిత విలేకరులకు తెలిపారు. ఘర్షణలో కొంతమంది పోలీసు సిబ్బంది గాయపడ్డారన్నారు. ఉద్యోగాలు కోల్పోయిన ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది శాంతియుతంగా ప్రదర్శన నిర్వహిస్తున్నప్పుడు పోలీసులు తమపై బలవంతంగా ప్రయోగించారని చెప్పారు.

### మైనారిటీలను రక్షిస్తా..

## వారి ఆస్తులను కాపాడుతా : మమతా బెనర్జీ

### విభజించి పాలించే విధానం కొనసాగడానికి ఎంత మాత్రమూ అనుమతించబోనని స్పష్టీకరణ



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో ముస్లింలు, వారి ఆస్తులను పరిరక్షిస్తానని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మైనారిటీ కమ్యూనిటీ సభ్యులకు హామీనిచ్చారు. వక్ఫ్ (సవరణ) చట్టం అమలు వల్ల ముస్లింలు బాధపడుతున్నారన్నారు. బుధవారం కోల్‌కతాలో జైన్ కమ్యూనిటీ నిర్వహించిన కార్యక్రమంలో మమతా మాట్లాడారు. బెంగాల్‌లో విభజించి పాలించే విధానం కొనసాగడానికి తాను ఎంత మాత్రమూ అనుమతించబోనని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్ సరిహద్దులోని ముర్షిదాబాద్ జిల్లాలో మంగళవారం వక్ఫ్ సవరణ చట్టం అమలుకు వ్యతిరేకంగా ఆందోళనలు చేశారు. అయితే ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. ఈ నేపథ్యంలో మమతా స్పందిస్తూ 'వక్ఫ్ చట్టం అమలు వల్ల ముస్సింలు బాధపడుతున్నారని నాకు తెలుసు. నమ్మకంగా ఉండండి, బెంగాల్‌లో విభజించి పాలించేది ఏమీ జరగదు. అందరూ కలిసి ఉన్నామనే సందేశాన్ని మీరు పంపాలి. జియో ఔర్ జినే దో (జీవించి జీవించనివ్వండి). మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అని మమతా పేర్కొన్నారు. రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించడానికి ప్రజలను రెచ్చగొట్టే వారి మాట వినవద్దని విజ్ఞప్తి చేశారు. మిమ్మల్ని రాజకీయంగా ప్రేరేపిస్తూ ఉద్యమాన్ని ప్రారంభించమని రెచ్చగొట్టే వ్యక్తులు ఉన్నారు. అలా చేయవద్దని మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. వక్ఫ్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జంగీపూర్ ప్రాంతంలో ఎన్‌హెచ్ 12ను నిరసనకారులు దిగ్బందించారు. భద్రతా సిబ్బంది జనసమూహాన్ని తొలగించేందుకు ప్రయత్నించగా పోలీసులపై ఇటుకలతో దాడి చేసి, వారి వాహనాలను తగలబెట్టారు. దీంతో ఆ ప్రాంతం యుద్ధ ప్రాంతంగా మారింది. పోలీసులు లాఠీచార్జ్ చేసి, టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించి అల్లరి మూకలను అదుపు చేశారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. రాళ్ల దాడిలో కొంతమంది పోలీసులు గాయపడ్డారని అధికారులు తెలిపారు. బిజెపి నేతృత్వంలోని కేంద్రం ఇటీవల పార్లమెంటులో ఈ బిల్లును ఎలా ఆమోదించిందో విమర్శిస్తూ... 'బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతాల పరిస్థితిని చూడండి. తొందరపడి పనులు చేయవద్దు. ఎందుకంటే కొన్నిసార్లు అది ఇబ్బందులకు దారితీస్తుంది. మన రాష్ట్రంలో 33 శాతం మంది మైనారిటీ వర్గాలకు చెందినవారు కాబట్టి ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. మనం వారిని వెళ్లగొట్టాలా?' అని అన్నారు. దేశ అంతర్జాతీయ సరిహద్దులకు ఇరువైపులా నిర్వాసితులైన ప్రజలు స్థిరపడటానికి దారితీసిన విభజన చరిత్రను ప్రస్తావిస్తూ, 'స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి వారు ఇక్కడే ఉన్నారు. భారతదేశం, పాకిస్తాన్, బంగ్లాదేశ్ అన్నీ కలిసి ఉండటం మన చరిత్ర. స్వాతంత్ర్యం తర్వాత దేశం విభజించబడింది. ఆ కాలపు నాయకులు అలా చేశారు, మనం అలా చేయలేదు. మనం చాలా కాలం తర్వాత పుట్టాము. కాబట్టి మనం ఎందుకు బాధ్యత వహించాలి? వెనుకబడి ఉన్న వారిని రక్షించడమే మా పని' అని అన్నారు.

# వక్ఫ్ చట్టంపై జమ్ము అసెంబ్లీలో గందరగోళం

### వరుసగా మూడోరోజూ స్తంభించిన కార్యకలాపాలు

### చివరికి నిరవధిక వాయిదా

**జమ్ము :** కొత్త వక్ఫ్ చట్టంపై చర్చకు బిజెపియేతర పార్టీలు డిమాండ్ చేయడంతో జమ్ముకశ్మీర్ అసెంబ్లీలో బుధవారం వరుసగా మూడో రోజు కూడా సమావేశాలు స్తంభించిపోయాయి. చివరకు సభ నిరవధికంగా వాయిదా పడింది. సభ్యులను ఉద్దేశించి స్పీకర్ అబ్దుల్ రహీం రాథర్ మాట్లాడుతూ, వక్ఫ్ సమస్యపై కొంతమంది నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) సభ్యులు, దాని కూటమి భాగస్వాములు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరించడాన్ని స్పీకర్ సమర్థించుకున్నారు. పీపుల్స్ కాన్ఫరెన్స్ నాయకుడు సజాద్ గని లోన్ నేతృత్వంలోని ముగ్గురు ప్రతిపక్ష సభ్యులు తనపై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానాన్ని కూడా సభ యమాలు, సాంకేతిక అంశాలను పేర్కొంటూ తిరస్కరించారు. వక్ఫ్ (సవరణ) చట్టంపై చర్చకు డిమాండ్ చేస్తున్న ట్రెజరీ, ప్రతిపక్ష సభ్యుల నిరసనలతో సభ దద్దరిల్లడంతో గత మూడు రోజుల్లో మొదటిసారిగా 15 నిమిషాలకు పైగా స్పీకర్ రాథర్ ఎటువంటి ఆటంకం లేకుండా మాట్లాడారు. అయితే సవరించిన షెడ్యూల్ ప్రకారం బుధవారం బడ్జెట్ సమావేశానికి చివరి రోజు. ఈ నేపథ్యంలో 21 రోజుల పాటు జరిగిన బడ్జెట్ సమావేశాన్ని సజావుగా నిర్వహించడంలో సభ్యుల సహకారాన్ని స్పీకర్ ప్రశంసించారు. బుధవారం సభ సమావేశమైన వెంటనే, ఎన్‌సి సభ్యులు వక్ఫ్ చట్టంపై చర్చకు డిమాండ్ చేశారు. నిరుద్యోగం వంటి సమస్యలను లేవనెత్తడానికి తమకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బిజెపి సభ్యులు కూడా వెల్‌లోకి దూసుకెళ్లారు. ఈ గందరగోళం మధ్య, స్పీకర్ సభను మధ్యాహ్నం 1 గంట వరకు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైనప్పుడు నిరసనలు మళ్లీ ప్రారంభమయ్యాయి. అయితే సభ వాయిదా తరువాత మూడు గంటల సమయంలో సభ వెలుపల బిజెపి శాసనసభ్యులు, కొంతమంది పిడిపి కార్యకర్తలతో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యే మెహ్రాజ్ మాలిక్ ఘర్షణకు దిగారు. ఈ అంశాన్ని సభలో లేవనెత్తడానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. వక్ఫ్ అంశంపై చర్చకు స్పీకర్ నిరాకరిస్తూ ... ఈ విషయం న్యాయస్థానం పరిధిలో ఉందని వాదించారు. వక్ఫ్ అంశంపై గత రెండు రోజులుగా



అసెంబ్లీ పూర్తిగా వాయిదాల పర్వ కొనసాగింది. బుధవారం కూడా ఎన్‌సి సభ్యులు మరోసారి వక్ఫ్ సవరణ చట్టంపై చర్చించడానికి కార్యకలాపాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ వెల్‌లోకి దూసుకురాగా, బిజెపికి చెందిన బల్వంత్ సింగ్ మంకోటియా నిరుద్యోగ సమస్యపై చర్చించడానికి వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అయితే, స్పీకర్ ఈ తీర్మానాన్ని ఇటీవల జరిగిన ఘటన కాదని పేర్కొంటూ తిరస్కరించి, షెడ్యూల్ ప్రకారం పనులు చేపట్టారు. వక్ఫ్, నిరుద్యోగ సమస్యలపై చర్చకు మద్దతుగా ట్రెజరీ, ప్రతిపక్ష బెంచీల నుండి నినాదా వస్తుండగానే బిజెపి సభ్యుడు సునీల్ భరద్వాజ్ ప్రశ్న అడగాలని కోరారు. సభ సజావుగా సాగడానికి వీలుగా తన విచక్షణాధికారాలను ఉపయోగించి 30 నిమిషాల చర్చకు అనుమతి ఇవ్వాలని ఎన్‌సి శాసనసభ్యుడు నజీర్ అహ్మద్ ఖాన్ గురేజీ స్పీకర్‌ను కోరారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల నినాదాల మధ్య ప్రతిపక్ష నాయకుడు సునీల్ శర్మ నేతృత్వంలోని బిజెపి సభ్యుడు వెల్‌లోకి దూసుకెళ్లారు. కొంతమంది ధర్నా కూడా చేశారు. గందరగోళం మధ్య, స్పీకర్ సభను మధ్యాహ్నం 1 గంట వరకు వాయిదా వేశారు. ఉదయం, ఎన్‌సి శాసనసభ్యులు, వారి కూటమి భాగస్వాములు ప్రతిష్టంభనను ముగించే ప్రయత్నంలో అసెంబ్లీ కాంప్లెక్స్‌లో సమావేశమయ్యారు. కానీ సమావేశం 17 గంటల్లోపు రెండవ సారి సభలో శాంతిని తీసుకురావడంలో విఫలమైంది.

## రాజధానిలో చంద్రబాబు ఇంటికి శంకుస్థాపన




**విశాలాంధ్రబ్యూరోఅమరావ తి :** ప్రజారాజధాని అమరావతిలో సీఎం చంద్రబాబునాయుడు ఇల్లు నిర్మించుకోనున్నారు. బుధవారం వెలగపూడి సచివాలయం వెనక ఇ9 రహదారి పక్కన జీ ప్లస్ 1 మోడల్ లో ఇంటి ని ర్మాణం చేపట్టనున్నారు. ఇం దు కోసం బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. నిరాడంబరంగా జరిగిన ఈ కార్యక్రమంలో చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్ పాల్గొని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ప్రైవేటు కార్యక్రమం కావటంతో ఇతరులెవ్వరినీ కార్యక్రమానికి ఆహ్వానించలేదు. శంకుస్థాపన కార్యక్రమం అనంతరం కుటుంబ సభ్యులు ప్రాంగణమంతా కలియ తిరిగారు. వెలగపూడి గ్రామస్థుల తరపున చంద్రబాబు కుటుంబ సభ్యులకు ఆ గ్రామ పెద్దలు పట్టు వస్త్రాలు సమర్పించారు. చంద్రబాబు ఇంటి నిర్మాణ భూమి పూజ కార్యక్రమం తిలకించేందుకు పెద్దఎత్తున అక్కడికి వచ్చిన రాజధాని రైతులు కార్యక్రమం ముగిసిన వెంటనే జై చంద్రబాబు, జై అమరావతి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చంద్రబాబు, లోకేశ్‌లు కాన్వాయ్ ఆపి రైతులందరినీ ఆప్యాయంగా పలకరించారు. రైతులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. గత ఏడాది డిసెంబరులో వెలగపూడి రెవెన్యూ పరిధిలో 5 ఎకరాల విస్తీర్ణంలోని నివాస ప్లాట్‌ను అదే గ్రామానికి చెందిన రైతు కుటుంబం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబ సభ్యులు కొనుగోలు చేశారు. ఇటీవలే ప్లాట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తయింది. స్థలంలో నైరుతి మూలన శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఇంటి నిర్మాణ బాధ్యతను ఎస్ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి అప్పగించారు.

## బంగ్లాదేశ్ వ్యాపారానికి భారత్ భూభాగ అనుమతి రద్దు

**న్యూఢిల్లీ :** బంగ్లాదేశ్ సరుకులను ఇతర తృతీయ ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసుకోవడానికి భారత భూభాగాలను ఉపయోగించుకునే సదుపాయాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దుచేసింది. ఈ సవరణ ఆదేశాలు మంగళవారం నుండి అమలులోకి వచ్చాయి. భారత్, బంగ్లాదేశ్ సహా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై భారీ ఎత్తున భరించలేనిరీతిలో అమెరికా ప్రభుత్వం సుంకాలు విధించిన తరుణంలో కేంద్ర ప్రభుత్వం ఈ సర్క్యులర్ జారీ చేసింది. టెక్స్‌టైల్స్ రంగంసహా కొన్ని విభాగాలలో భారతదేశానికి బంగ్లాదేశ్ అతిపెద్ద పోటీదారుగా చెలామణీ అవుతున్న తరుణంలో ఈ నిషేధ ఉత్తర్వులు భారతదేశంలోని వస్త్రపరిశ్రమకు, చెప్పులు, రత్నాలు, ఇతర అభరణాల పరిశ్రమలవారికి ఎంతో ఉపయోగంగా ఉంటాయి. దీనివల్ల మన వ్యాపారులకు బంగ్లాదేశ్ నుండి పోటీ తగ్గుతుందని నిపుణులు అంచనావేస్తున్నారు. మనదేశానికి 16 రాష్ట్రాలలో ఏడు దేశాలతో సరిహద్దులు విస్తరించి ఉన్నాయి. ఈ ఏడు దేశాల నుండి వ్యాపారం చేయడానికి వీలుగా సరిహద్దుల్లో ఉన్న భారత రాష్ట్రాలలో 122 భూభాగ సరుకు రవాణా కేంద్రాల(ఎల్‌సిఎస్)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. భారత భూభాగంలో ఉన్న ఈకేంద్రాలను ఉపయోగించుకుని ఆయా దేశాలు ఇతర తృతీయ ప్రపంచ దేశబూలకు తమ ఎగుమతులు చేసుకుంటాయి. ఇలాంటి సదుపాయాన్ని ఇప్పుడు బంగ్లాదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తూ ఒక సర్క్యులర్ జారీ చేసింది. భారత ఎగుమతి దారులు, ప్రధానంగా టెక్స్‌టైల్స్, గార్మెంట్స్, సంబంధిత ఉపకరణాలను ఎగుమతిచేసే ఎగుమతిదారులు చేసిన విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం ఈ సదుపాయాన్ని బంగ్లాదేశ్‌కు లేకుండా రద్దుచేసింది. ఈ విధమైన సదుపాయాన్ని బంగ్లాదేశ్‌కు కలగజేస్తే ఆ దేశ ఎగుమతుల వ్యాపారానికి ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. బంగ్లాదేశ్ సరుకులను భారత భూభాగం ద్వారా సులభంగా ఇతర తృతీయ ప్రపంచ దేశాలకు తరలించుకోవచ్చు. అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్, భూటాన్, చైనా, మయన్మార్, నేపాల్, పాకిస్థాన్ దేశాలు ఈ భూకేంద్రాలను ఉపయోగించుకుంటున్నాయి. ఈ సదుపాయం ఉంటే భూటాన్, నేపాల్, మయన్మార్ దేశాలకు చాలా సులభంగా బంగ్లాదేశ్ తన సరుకులు ఎగుమతి చేసుకోగలదు. ఈ సదుపాయాన్ని 2020 జూన్ నెలలో బంగ్లాదేశ్‌కు భారత్ కల్పించింది. ''2020 జూన్ 29వ తేదీన జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం బంగ్లాదేశ్‌కు ఇచ్చిన అనుమతిని రద్దుచేయడమైనది, ఈ సవరణ తక్షణం అమలులోకి వస్తుంది, ఇప్పటికే భారత్‌లోకి ప్రవేశించిన బంగ్లాదేశ్ సరుకును మాత్రం పాత ఒప్పందం ప్రకారం అనుమతిస్తాం, ఆ మేరకు ఆ సరుకు భారత్ భూభాగం నుండి బయటకు ఇతర ఉత్పత్తి దారులు, కంపెనీలకు పంపుకోవచ్చు'' అని పరోక్ష పన్నుల, సుంకాల కేంద్ర మండలి (సిబిఐటిసి) సర్క్యులర్ జారీ చేసింది.

## తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసైకి పితృవియోగం



**చెన్నై:** తెలంగాణ మాజీ గవర్నర్, బిజెపి నాయకురాలు తమిళిసై సౌందరరాజన్ ఇంట్లో విషాదం చోటుచేసుకుంది. ఆమె తండ్రి, కాంగ్రెస్ సీనియర్ నేత కుమారి అనంతన్ (హరికృష్ణన్ నాడార్ అన ంతకృష్ణన్) (92) కన్నుమూశారు. ప్రముఖ కాంగ్రెస్ నేతగా, గాంధేయవాదిగా, గొప్ప వక్తగా పేరు పొందిన ఆయన.. వయో సంబంధిత సమస్యలతో మంగళవారం అర్ధరాత్రి 12.15గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఒక కుమారుడు, న లుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో బిజెపి నేత, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై ఒకరు. పార్లమెంటులో తొలిసారి తమిళంలో మా ట్లాడిన నేతగా రికార్డు నెలకొల్పారు. తమిళ భాషా సంస్కృతుల అభివృద్ధికోసం విశేష కృషిచేశారు. కుమారి అనంతన్ మరణవార్త తెలుసుకున్న త మిళ ప్రముఖులు ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, సీ ఎం స్టాలిన్, తమిళనాడు ప్రతిపక్ష నేత పళనిస్వా మి, వి.శశికళ, పన్నీర్ సెల్వం, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై, టివికె చీఫ్ వి జయ్‌తో పాటు పలువురు సిపిఐ, సిపిఐ(ఎం) నేతలు తమిళి సై త ండ్రి పార్థివ దే హానికి నివాళులర్పించారు. ఈ స ంద ర్భంగా సిఎం స్టాలిన్ మాట్లాడుతూ.. కు మారి అనంతన్ మరణం తమిళ సమాజానికి పెద్ద లోటు అన్నారు.ప్రభుత్వ అధికార లాంఛనాలతో ఆయన అంత్యక్రియలునిర్వహించనున్నట్లుప్రకటించారు.

**కుమారి అనంతన్ మరణం బాధించింది.. ప్రధాని మోదీ :** తమిళిసై సౌందరరాజన్ తండ్రి మరణం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, తెలంగాణ సిఎం రేవం త్ రెడ్డి సహా పలువురు ప్రముఖులు సా మాజిక మాధ్యమాల వేదికగా సంతాపం తెలిపారు. కుమారి అనంతన్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

### సిఎం సంతాపం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణరాష్ట్రమాజీగవర్నర్ తమిళిసై సౌంద రరాజన్ తండ్రి, తమిళనాడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, గొ ప్ప సా హితీవేత్త కుమారి అనంతన్ (హరికృష్ణన్ నా డార్ అనంతకృష్ణన్) మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మ హాత్ముడి సిద్ధాంతాలను పునికిపుచ్చు కున్న దేశ భక్తుడు, తమిళ భాషా ప్రేమి కు డు అనంతన్‌ను కోల్పోవడం ఎంతో బాధాకరం అని ఆయ న తన సంతాప సం దేశంలో పేర్కొన్నారు.తండ్రిని కోల్పోయి దుఃఖంలో ఉన్న తమిళిసై, ఆమె కుటుంబసభ్యులకుముఖ్యమంత్రిప్రగాఢసానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు.

## హామీల అమలుకు ప్రభుత్వం కృషి



**ప్రజాపక్షం/ నిడమనూరు:** ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జయవీర్‌రెడ్డి స్పష్టం చేశారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయబడిన నిడమనూరు మండలం తుమ్మడం గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చిత్తశుద్ధితో ఉందని ప్రజలు అపోహాలకు గురి కావాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, హాలియా మార్కెట్ చైర్మన్ శేఖర్ రెడ్డి, నూకల వెంకట్ రెడ్డి, అంకతి వెంకట రమణ, మలిగిరెడ్డి లింగారెడ్డి, ఎడవల్లి వల్లపు రెడ్డి పాల్గొన్నారు.

## గ్యాస్, పెట్రోల్, డిజీల్ ధరలు తగ్గించాలి



**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు):** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజేపి ప్రభుత్వం పేద మధ్య తరగతి వర్గాల ప్రజలను ఆర్థికపరమైన ఇబ్బందులకు గురి చేస్తుందని సిపిఐ సీనియర్ నాయకులు దొడ్డా నారాయణరావు అన్నారు. బుధవారం చిలుకూరు మండల కేంద్రంలో జడ్చర్ల జాతీయ రహదారిపై ఖాళీ గ్యాస్ బండలతో బస్టాండ్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తూ రాస్తోరోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మండవ వెంకటేశ్వర్లు, రెమిడాల రాజు, చేపూరి కొండలు, చిలువేరు ఆంజనేయులు, మొక్క లక్ష్మి నారాయణ, దొడ్డా నాగేశ్వరరావు, వడ్డేపల్లి కోటేష్, మల్లెపంగు సురిబాబు, పొరల మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.



## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/చిట్యాల:** రైతుల సంక్షేమం కోసం పాటు పడే ప్రభుత్వాలకు ప్రజల దీవెనలు ఎల్లపుడూ ఉంటాయని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలోని ఊర చెరువు మరమ్మత్తు పనులను ఆయన బుధవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఊర చెరువు మరమ్మత్తుల కోసం ప్రభుత్వం రూ. 1 కోటి 18 లక్షలు విడుదల చేయడం అభినందనీయమని అన్నారు. మరమ్మత్తులు పూర్తి అయితే నీటి నిల్వ సామర్థ్యం పెరిగి భూజల మట్టం పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాంత రైతులకు లబ్ధి చేరనుందన్నారు. త్వరలో పూర్తి కాబడే బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టుతో అనేక ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశం ఉందని, దీని పూర్తి కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వనమా వెంకటేశ్వర్లు, గుడిపాటి లక్ష్మినర్సింహ్మా, చెరుకు సైదులు, పోలగోని స్వామి, పల్లపు బుద్ధుడు, పట్ల జనార్ధన్, జనపాల శ్రీను, బొడ్డు శ్రీను, ఉయ్యాల నరేష్, మర్రి రమేష్, మర్రి శ్రీకాంత్, నడింపల్లి గోపాల్, గుత్తా రవిందర్‌రెడ్డి, మేడబోయిన శ్రీను, గంగాపురం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన 650 పడకల భవన నిర్మాణ పనులు పూర్తి

### సూర్యాపే జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నూతనంగా నిర్మిస్తున్న 650 పడకల భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్మిస్తున్న నూతన భవనాన్ని ఆయన పరిశీలించారు. ఏ అంతస్తులో ఏ విభాగం ఉండబోతుందో అడిగి తెలుసుకున్నారు. వీటిలో మార్పులు చేర్పులపై తగు సూచనలు చేశారు. టిఎస్ ఎంఐడిసికి మార్పులపై ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. హెచ్ఓడిలతో సమీక్ష నిర్వహిస్తూ ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన సేవలు అందేలా చూడాలని కోరారు. అనంతరం వైద్యాధికారులు, టిఎస్ ఎంఐడిసి ఇంజనీరింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ, టిఎస్ ఎండిసిసిఈఈ దేవేందర్, ఈఈ జైపాల్ రెడ్డి, హెచ్ఓడిలు, ఎఈలు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం



**ప్రజాపక్షం/సూర్యా పేట(రూరల్):** ప్రభు త్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకవచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పాటు బోనస్ పొందాలని జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు అన్నారు. బుధవారం మండలంలోని పిల్లలమర్రి, రాజునాయక్ తండా, బాలెంల1 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. రైతులు తీసుకవచ్చిన ధాన్యాన్ని పరిశీలించిన ఆయన కొనుగోలు నిర్వహకుల డైలీ షిట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ధాన్యం తెచ్చిన రైతులకు టోకెన్లు జారీ చేయాలని కోరారు. 17శాతం తేమ ఉన్న ధాన్యాన్ని వెంటనే తూకం వేసి రైస్ మిల్లులకు తరలించాలన్నారు. కేంద్రాల వద్ద తాగునీరు, టెంటు వంటి మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన గోనే సంచులను సమకూర్చుకోవాలన్నారు. ఆయనతో పాటు ఆర్ఐ గోపి, కేంద్రాల నిర్వహకులు వెంకటమ్మ, నాగరాజు, బాలాజీ, దేవి ఉన్నారు.

## సకాలంలో ఉపాధిహామీ డబ్బులు

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** ఉపాధి కూలీలకు సకాలంలో కూలీ డబ్బులు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట మండలం మాసాయిపేటలో ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు గడ్డపారలు, తట్టలు, పారలు లేవన్నారు. ఉపాధి కూలీలకు పని చేసే వారికి జాబ్ కార్డు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం ఆత్మీయ ఇందిరమ్మా భరోసా కింద గుంట నుండి ఎకరం వరకు కూలీలకు సంవత్సరానికి రూ. 12,000 ఇవ్వాలన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇంటి స్థలాలు, రేషన్ కార్డులు అర్హులైన వారికి వృద్ధాప్య పింఛన్లు, వికలాంగులకు పెన్షన్లు ఇవ్వాలన్నారు. కూలీలకు రోజుకు కనీస వేతనం రూ.400 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కలెపల్లి మహేందర్, చెక్క సబిత, రజిని, జాప సరిత, లావణ్య, పల్లెపాటి నరసింహ, ఆకిటి కనకయ్య, మేకల రాజయ్య వాకిటి వెంకటేష్ పల్లెపాటి లక్ష్మి ఎల్లమ్మ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



## కేంద్రం వంటగ్యాస్ ధరల పెంపుతో సామాన్య ప్రజలపై పెనుభారం

### సంపన్నులకు లాభం చేకూర్చే విధంగా మోదీ విధానాలు...పల్లా నర్సింహారెడ్డి

### సిపిఐ ఆధ్వర్యంలో ఖాళీ సిలిండర్లతో ర్యాలీ



**ప్రజాపక్షం/దేవరకొండ:** కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్లపై రూ. 50లను అదనంగా పెంచడం వలన సామాన్య, మధ్య తరగతి కుటుంబాలపై మరింత ఆర్థిక భారం పడుతుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట గ్యాస్ సిలిండర్ల ధర పెంపుదల కు నిరసనగా బుధవారం పట్టణంలో సిపిఐ ఆధ్వర్యంలో ఖాళీ సిలిండర్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద నిరసన ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ చర్య ములిగే నక్క మీద తాడి పండు పడిన చందంగా ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మేలు చేయడానికి రూ. 500లకే గ్యాస్ సిలిండర్లను అందిస్తుందటే కేంద్ర ప్రభుత్వం తన ఇష్టానుసారంగా ధరలు పెంచు కుంటూ పోతుందని ఆయన విమర్శించారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండ ల కార్యదర్శులు దేప సుదర్శన్‌రెడ్డి, పోలే వెంకటయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు రామస్వామి, ఆంజనేయులు, పట్టణ కార్యదర్శి వెంకట్రాములు, పార్టీ, ప్రజా సంఘాల నాయకులు రంగారెడ్డి, మైనోద్దీన్, వెంకటేశ్వర్లు, వెంగళ య్య, యాదయ్య, నవీన్, వెంకటయ్య, మోహన్‌రెడ్డి, నగేష్, భారీము లు, పుల్లయ్య, ఉస్సేన్, మహేష్, పార్వతాలు, మల్లయ్య, జ్యోతిబసు, సత్తెమ్మ, కృష్ణవేణి, వెంకటమ్మ, అలివేలు, రమణమ్మ పాల్గొన్నారు.

### వంటగ్యాస్ ధరలను తగ్గించాలి : జంగమ్మ

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** పెంచిన వంట గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని మహిళా సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట మున్సిపల్ గుండ్లపల్లిలో గ్యాస్ సిలిండర్లతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్రూడ్ ఆయిల్ ధరలు నిలకడగా ఉన్నప్పటికీ వంట గ్యాస్ ధరలు పెంచేసి ప్రజల మీద భారం మోపిందన్నారు. బిజెపి అనుకూలమైన రాష్ట్రాలలో ఎన్నికలు జరిగినప్పుడు నామమాత్రంగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించినట్టు ప్రకటన చేసి ఎన్నికలు అయిపోగానే తిరిగి గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడం ఆనవాయితీగా మారిందని ఆరోపించారు. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అని గొప్పలు చెబుతున్న నరేంద్ర మోడీ గారు గ్యాస్ ధరలు పెంచి ప్రజల నెత్తిపై మంటలు పెట్టారని మండిపడ్డారు. గతంలోరూ. 855గా ఉండగా రూ. 905 కు ఎగబాకిందన్నారు. ప్రజల నెత్తిపై రూ.50 పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

### పేదలపై పెనుభారం : శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/కోదాడ:** కేంద్రంలో ఉన్న బిజేపి ప్రభుత్వం అనేక సార్లు గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ పేద ప్రజలపై భారం మోపుతుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సిపిఐ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బత్తినేని హనుమంతరావు, నాయకులు పోతు రాజు సత్యనారాయణ, మాతంగి ప్రసాద్, కొండా కోటేశ్వరరావు, నాగుల్‌మీరా, కాటమరాజు, రహిమాన్, మోషిన్, షేక్ నాగుల్ తదితరులు పాల్గొన్నారు.







## దొడ్డు బియ్యం పక్కదారి పడుతున్నాయనే సన్నబియ్యం

### ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/బీబీనగర్ :** దొడ్డి బియ్యం పక్కదారి పడుతున్నాయని ఉద్దేశంతోనే పేదోళ్లకు కడుపు నింపడానికి సన్న బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టిందని బోనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం మండలం రావిపహాడ్ తండాలో తెల్ల రేషన్ కార్డు లబ్దిదారులు భానోత్ శంకర్ నాయక్ కాంతి ఇంట్లో సన్న బియ్యం అన్నం తిన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పేద వాడి కడుపు నింపేందుకు ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టిందని ఈ పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశంలో మొట్ట మొదటి సారిగా కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి మన రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ మొదలు పెట్టారని తెలిపారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యాన్ని లబ్ధిదారులు సంతోషంగా తింటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో క్రిష్ణారెడ్డి, ఇన్చార్జి తహసిల్దార్ భగత్, ఎంపీడీవో వైస్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఫోటోల శ్యామ్ గౌడ్, మాజీ ఎంపిటిసిలు వాణి వీరు నాయక్ పాల్గొన్నారు.

## ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

### తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) యాదాద్రి భువనగిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** ధాన్యం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించి కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లూరు రాజయ్య అన్నారు. రైతాంగం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఏఐకేఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ అధికారి జగన్మోహన్ ప్రసాద్ కి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ 2 లక్షల వరకు, 2 లక్షలకు పైగా ఉన్న రుణమాఫీ రైతులందరికీ పూర్తిస్థాయిలో మాఫీ చేయాలని రైతు భరోసా సాగు అయ్యే భూములన్నింటికీ యుద్ధ ప్రాతిపదికన ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్షాలు వడగండ్లకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని కోరారు. మిర్చి క్వింటాకు 25 వేల రూపాయలు పసుపుకు రూ.20 వేలు ధర చెల్లించాలని అన్నారు. ప్రధానమంత్రి రాతపూర్వకంగా ఇచ్చిన హామీ మేరకు పంటలకు కనీస మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని చెప్పారు. జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం విరమించుకోవాలని, పిఎం కిసాన్ సమ్మాన్ నిధి 6 వేల నుండి 18 వేలకు పెంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. గుండాల మండలంలోని షాపురం వంగాల మధ్యన ఉన్న సర్వే నెంబర్ 157158 లో అసంపూర్తిగా ఉన్న కాలువను పూర్తి చేసి నవాబుపేట రిజర్వాయర్ ద్వారా తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పుల కొమురయ్య, ఎలగందుల అంజయ్య, జిల్లా సహాయ కార్యదర్శి జక్క దయాకర్ రెడ్డి, రైతు సంఘం నాయకులు నరికే యాదయ్య, తెడ్డు ఆంజనేయులు, బోదాసు స్వామి, గుర్రం పద్మా రెడ్డి, యుద్ధం రెడ్డి, ఏనుగు మల్లారెడ్డి, సోమన ఐలయ్య, కూర వెంకటేష్ రాజప్ప పాల్గొన్నారు.



## నల్లగొండ జిల్లాలో 384 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి


**ప్రజాపక్షం/చిట్యా:** నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 384 ధాన్యం కొనుగోలు ఏర్పాటు చేశామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు, పెద్దకాపర్తి గ్రామాలలో బుధవారం నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ నకిరేకల్ నియోజకవర్గంలో 50 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా అందులో 45 దొడ్డు రకం, 5 సన్న రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలున్నాయని అన్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి ప్రభుత్వం ప్రకటించిన సాధారణ ధాన్యం రకానికి ప్రకటించిన మద్దతు ధర రూ. 2300, గ్రేడ్ ఏ రకానికి రూ. 2320, సన్న ధాన్యానికి రూ. 500 బోనస్ పొంది సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తాలు, తేమ లేకుండా ధాన్యాన్ని తీసుకువచ్చి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సహకరించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు పంపించాలని, రైతులకు రెండు, మూడు రోజుల్లో ధాన్యం అమ్మిన రైతుల ఖాతాలలో జమ అయ్యే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. మిల్లర్లు, రైతులకు తాలు, తేమ సమస్యలు రాకుండా ఆటోమేటిక్ ప్యాడి క్లీనింగ్ మిషన్లు ఏర్పాటు చేశామని, వీటితో పాటు మాన్యువల్ క్లీనింగ్ మిషన్‌లను కూడా ఏర్పాటు చేశామని కలెక్టర్ వివరించారు. ఎంఎల్ఏ వేముల వీరేశం మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో రైతులకు కావల్సిన సౌకర్యాలను ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాటు చేసిందన్నారు. వెలిమినేడు గ్రామంలో నూతనంగా నిర్మించిన సింగిల్‌విండో కార్యాలయాన్ని కలెక్టర్, ఎంఎల్ఏలు ఈ రోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి పత్యానాయక్, డిసిసిబి వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, వెలిమినేడు సింగిల్ విండో చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, నాయకులు పిశాటి భీష్మారెడ్డి, గుడిపాటి లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

## చంద్ర రాజేశ్వరరావు ఆశయాలు సాధిద్దాం

**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి:** సిపిఐ జాతీయ సమితి మాజీ ప్రధాన కార్యదర్శి,ఆదర్శ నాయకుడు, అమరజీవి కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతిని పురస్కరించుకొని నల్లగొండ సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలదండ వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు మాట్లాడుతూ చంద్ర రాజేశ్వర రావు విద్యార్థి దశ నుండే స్వాతంత్రోద్యమంలో తెలంగాణ సాయుధ పోరాటంలో పనిచేసిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్,జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, తీర్పారి వెంకన్న, గురిజా రామ చంద్రం, బంటు వెంకటేశ్వర్లు,పట్టణ కార్యదర్శి గాదెపాక రమేష్, వి లెనిన్, ముండ్ల ముత్యాలు, కనకయ్య, తిరందాసు శ్రీనివాసులు, సుజాత, కౌశల్య,బండమీది యాదయ్య,చాపలవిప్లవ కుమార్, దోటి పండరి, అక్కలయ్య పాల్గొన్నారు.







**ప్రజాపక్షం/భువనగిరి :** ఆదర్శ జీవి చంద్ర రాజేశ్వరరావు ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు అన్నారు. జిల్లా కేంద్రంలోని సిపిఐ పార్టీ కార్యాలయం ఆవరణలో భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి ప్రజల నాయకులు ఆదర్శ జీవి చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, కొల్లూరి రాజయ్య, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, ప్రజాసంఘాల నాయకులు దాసరి లక్ష్మయ్య, ఉప్పుల కొమురయ్య, ఎలగందుల అంజయ్య, జక్క దయాకర్ రెడ్డి, తెడ్డు ఆంజనేయులు, నరిగె యాదయ్య,స్వామి పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** దేశంలో అసలైన మానవతావాది చంద్ర రాజేశ్వరరావు అని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరి,సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో చంద్ర రాజేశ్వరరావు 31 వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యల్లావుల రమేష్,ఇందిరాల వెంకటేశ్వర్లు,సోమగాని కృష్ణ,మామిడి వెంకయ్య,జడ వెంకన్న,జక్కుల శ్రీను,యల్లావుల ఉమ,కుడితొట్టి స్వామి,గాంధీ,బత్తిని ప్రసాద్,కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/దేవరకొండ:** నిజాం పునాదులను కదలించి, తెలంగాణ సాయుధ పోరాటంలో అగ్రగామిగా నిలిచి, ప్రజల పక్షాన పోరాటం చేసిన కామ్రేడ్ చంద్ర రాజేశ్వర్‌రావు స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉధృతంగా పోరాటం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శులు దేప సుదర్శన్‌రెడ్డి, వెంకటయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు రామస్వామి, ఆంజనేయులు, వెంకట్రాములు, పార్టీ , ప్రజా సంఘాల నాయకులు మైనోద్దీన్, వెంకటేశ్వర్లు, వెంగళయ్య, యాదయ్య, నవీన్, వెంకటయ్య, మోహన్‌రెడ్డి, నగేష్, భారీములు, పుల్లయ్య, జ్యోతిబసు, సత్తెమ్మ, కృష్ణవేణి, వెంకటమ్మ, లక్ష్మమ్మ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.





## ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పైపులైన్ బాధితులతో ఆర్‌డిఓ సమీక్ష

**ప్రజాపక్షం/చింతలపాలెం:** చింతలపాలెం మండల కేంద్రంలో ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ ఎత్తిపోతల పథకం పైపులైన్ చింతలపాలెం బాధిత రైతులతో బుధవారం ఆర్డీవో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులకు కింది పొలాలకు సైతం నీళ్లు అందించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ ఎత్తిపోతల పథకం తీసుకవచ్చిందని అందులో భాగంగా భూ సేకరణ చట్టం 2013 అనుసరించి చింతలపాలెం పైపులైన్ బాధ్యత రైతులతో సమావేశం ఏర్పాటు చేశామని రైతులకు ఉన్న ప్రతి అనుమానాలకు వివరణ ఇవ్వడానికి వచ్చానని, ఇక్కడ ఉన్న రెవిన్యూ వ్యాల్యూ ప్రకారం ప్రభుత్వం ఎకరానికి 24 లక్షలు వరకు నష్ట పరిహారం అందిస్తుందని, అదికాక పొలంలో బోర్లు ఉన్న చెట్లున్న, ప్రహరి గోడ ఉన్న ప్రతి దానికి వాల్యూలేషన్ చేయించి నష్టపరిహారం ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అనంతరం రైతులు మాట్లాడుతూ తమ పొలాల్లో ఇప్పటికే శివగంగా లిఫ్ట్‌పోయి ఉన్నందున ఆ లిఫ్ట్‌కు ఎటువంటి నష్టపరి హారం తీసుకోనందున ఆ లిఫ్ట్‌కు పోయిన భూమికి నష్టపరిహారం ఇవ్వా ల్సిందిగా రైతులు డిమాండ్ చేశారు. మరికొంతమంది రైతులు కుంటకు మూడు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎక్కువశాతం మంది రైతులు తమకు ఈ లిఫ్ట్‌కు భూమి ఇవ్వమని అవసరమైతే ప్రాణ త్యాగానికైనా సిద్దమవుతామని ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు.



## 14లోగా 'రాజీవ్ వికాసం' దరఖాస్తు

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు ఈ నెల 14 వరకు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ తెలిపారు.బుధవారం రోజున మున్సిపల్ కార్యాలయంలో వార్డ్ ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు సబ్సిడీపై రాజీవ్ యువ వికాసం పథకం ద్వార అందిస్తున్న 4,00,000 నాలుగు లక్షల రూపాయల రుణలకు సంబంధించి మీసేవ ద్వార అప్లికేషన్ చేసు



కున్నటువటి అప్లికేషన్ ఫారాలను మున్సిపల్ కార్యాలయం యందు ప్రజాపాలన కౌంటర్ లో ఈనెల 14వ తేది లోపు సమర్పించగలరని అన్నారు.ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదర్శ విద్యార్థులకు ప్రశంస

**ప్రజాపక్షం/శంకరపట్నం:** మండల పరిధిలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎస్.రక్షిత, కె.తేజేశ్వర్ మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందుకున్నారు. బుధవారం ఉపాధ్యాయ బృందంతో కలిసి పాఠశాల ప్రిన్సిపాల్ వి.సరిత వారిని అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 8వ తరగతి చదువుతున్న ఎస్.రజిత మ్యాథ్స్ విభాగంలో, 9వ తరగతి చదువుతున్న కె.తేజేశ్వర్ సైన్స్ విభాగంలో ఒలంపియాడ్‌లో అద్భుత ప్రతిభ కనబర్చారన్నారు. మ్యాథ్స్



ఉపాధ్యాయులు ఎస్.రజిత, ఆర్.రజిత, స్వప్న, సైన్స్ ఉపాధ్యాయులు రాజు, సతీష్, శివశంకర్, మనోహర్, మధుకర్ తదితరులున్నారు.

## శ్రీరుతిక్‌కు అభినందన



**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి మండల కేంద్రంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి డి.శ్రీరుతిక్ గణిత ఒలంపియాడ్‌లో బ్రాంజ్‌మెడల్ సాధించాడు. ఈ సంధర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైద్యుల రాజిరెడ్డి మాట్లాడుతూ అల్ఫోర్స్ విద్యాసంస్థల సహకారంతో ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకుని దీకొండ శ్రీరుతిక్ గణిత ఒలంపియాడ్‌లో బ్రాంజ్ మెడల్ సాధించడం జరిగిందని తెలిపారు. సరైన శిక్షణతో పాటు విధ్యార్థులు క్రమశిక్షణ పట్టుదలతో చదివితే దేనినైనా సాధించవచ్చని , అందుకు నిదర్శనమే శ్రీరుతుక్ అని పేర్కొన్నారు. శ్రీరుతిక్ చురుకైన క్రమశిక్షణ కలిగిన విధ్యార్థి అని, భవిష్యత్తులో ఐఐటిలో సీటు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని కోరారు. ఈ సంధర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి, పుష్పలత, సత్యనారాయణ, శారద, సుధారాణి, షరీఫ్, సమత, లక్ష్మి, వేణు, ఫర్హానా తదితరులు శ్రీరుతిక్‌ను అభినందించారు.

## బుగ్గారంలో సన్న బియ్యం పంపిణీ



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుదారులకు ఇస్తున్న సన్న బియ్యం పథకాన్ని బుధవారం బుగ్గారం లో కాంగ్రెస్ నాయకులు ప్రారంభించి కార్డుదారులకు పంపిణీ చేశారు. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశాలతో, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వేముల సుభాష్ సూచనతో బుగ్గారం స్థానిక నాయకులు కలిసి లబ్ధిదారులకు సన్నబియ్యాన్ని పంపిణీ చేశారు.మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నగునూరి నర్సగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దనవేణి శంకర్,గ్రామశాఖ అధ్యక్షులు కొడిమ్యాల రాజన్న, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు జంగ శ్రీనివాస్, తాడేపు లింగన్న,మాజీ ఎంపీటీసీ నగునూరి రామగౌడ్, పొనకంటి కైలాసం, నగునూరి పెద్ద రామగౌడ్, దశర్తి పోసన్న, అహ్మద్ షరీఫ్,నక్క శంకర్, ఇల్లంధుల స్వామి,నగునూరి శ్రీనివాస్, నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



**వేములవాడ :** వేములవాడ పట్టణ పరిధిలోని బాలనగర్, వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి, మల్లారం గ్రామాల్లో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరా సంస్థలి ద్వార వేములవాడ ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధ్యానం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, జిల్లా అదనపు కలెక్టర్ కిమ్య నాయక్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు, స్థానిక నాయకులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో అమ్మితేనే మద్దతు ధర



**ప్రజాపక్షం/సిద్దిపేటఅర్బన్:** రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల లోనే విక్రయించాలని మిట్టపల్లి పిఎసిఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం మిట్టపల్లి పిఎసిఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్నిప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కొనుగోలు కేం ద్రాలలోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని సూచించారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్,పిఏసిఎస్ వైస్ చైర్మన్ దుర్గారెడ్డి,నాయకులు పయ్యావుల రాములు,అంకుష్‌వళి,బాలకృష్ణారెడ్డి,చింతల సంతోష్, రాము, డైరెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

## ఫిట్టర్ సంపత్‌రావుపై విచారణ పూర్తి



**ప్రజాపక్షం/జమ్మికుంట:** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో ఫిట్టర్ సంపత్‌రావుపై విచారణ చేయాలని పబ్బు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుపై బుధవారం ఆర్‌డి ఎంఏ షాహిద్ మసూద్ విచారణ చేపట్టారు. ఇరువురిని పూర్తిగా విచారణ చేశారు. ఫిట్టర్ విధులకు కావాల్సిన ఎటువంటి పత్రాలు లేకుండా విధులున ఇర్వహిస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టినట్లు ఆయన తెలిపారు. సంపత్‌రావు ఐటిఐ సర్టిఫికెట్ పరిశీలన చేసిన ఆర్‌డి ఎం.ఏ మసూద్ మాట్లాడుతూ పూర్తి నివేదికను సిడిఎంఏ హైదరాబాద్ కు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కమిషనర్ మొహమ్మద్ ఆయాజ్, మేనేజర్ జి. రాజిరెడ్డి, ఆర్‌డి కార్యాలయ మేనేజర్ గుర్రపు శ్రీనివాస్‌లున్నారు.

## విజేతగా 'ఠాగూర్ కింగ్స్' జట్టు

**ప్రజాపక్షం/గంగాధర:** గంగాధరలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ సీజన్ 5 క్రికెట్ టోర్నమెంటులో ఠాగూర్ కింగ్స్ విజేతగా నిలిచింది. 15 రోజులు పాటు జరిగిన టోర్నమెంటులో 10 జట్లు పాల్గొనగా ఫైనల్‌లో స్నేర్దన్ సూపర్ కింగ్స్, ఠాగూర్ కింగ్స్ మధ్య పోటీ జరిగింది. హోరా హోరీ మ్యాచ్‌లో ఠాగూర్ కింగ్స్ విజేతగా నిలువగా రూ.20 వేలు , రన్నర్‌గా స్నేర్దన్ సూపర్ కింగ్స్‌కు రూ.10 వేలు నగదును తుడి లచ్చన్న ప్రధానం చేశారు. ఉపసర్పంచ్ ప్రభాకర్, ఆదిపల్లి అంజయ్య, ఒడ్నాల రామ్‌రెడ్డి, ఉప్పు ప్రశాంత్, మహేష్, ప్రదీప్, టోర్నమెంట్ ఆర్గనైజేషన్ మోతె శ్రీహరిరెడ్డి, బాచి, హరీష్, కిరణ్, గంట విజయ్, కట్ల శ్రీనివాస్, గుర్రం మనోజ్ పాల్గొన్నారు.

## 'కుంగ్‌ఫూ'లో 8మందికి బెల్టులు

**ప్రజాపక్షం / ధర్మపురి :** ధర్మపురి పట్టణంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు కుంగ్‌ఫూ లో ప్రతిభ కనబర్చి యెల్లో బెల్టులు సాధించినట్లు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. రాణి లక్ష్మి భాయ్ ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమంలో భాగంగా బాలికలకు కుంగ్‌ఫూలో శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. 8మంది విద్యార్థులకు డ్రాగన్ స్వార్డ్ కుంగ్‌ఫూ అకాడెమి ఆధ్వర్యంలో బెల్టులు, సర్టిఫికేట్లు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ భారతి, కుంగ్‌ఫూ కోచ్ కస్తూరి ప్రవీణ్, ఉపాధ్యాయులు అభినందించారు.

# కమ్యూనిస్టు యోధుడు సిఆర్‌కు నివాళి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** భారతదేశంలో అణగారిన వర్గాల కోసం సమ సమాజ స్థాపన నిర్మాణం కోసం తన జీవితాన్ని ధారబోసిన గొప్ప కమ్యూనిస్టు యోధుడు చంద్ర రాజేశ్వర రావు అని సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి కొనియాడారు. బుధవారం స్థానిక బద్దం ఎల్లా రెడ్డి భవన్‌లో చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజేశ్వరరావు చిత్రపటానికి వెంకటస్వామి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సంధర్భంగావెంకటస్వామిమాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో జన్మించిన రాజేశ్వరరావు ఉన్నత విద్యను అభ్యసించి కార్మిక, కర్షక, పేద, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం భారత కమ్యూనిస్టు పార్టీలో చేరి ప్రజల కోసం పనిచేసిన నాయకుడని అన్నారు. దున్నే వాడికి భూమి కావాలని పేదలందరికీ భూమి చెందాలని భూ సంస్కరణ చట్టం అమలు చేయడం కోసం ప్రజా ఉద్యమాలు నిర్మిస్తూనే మరోవైపు కోర్టులో ఆ చట్టం కోసం పోరాటం చేసి సాధించిన గొప్ప మహోన్నతమైన వ్యక్తి రాజేశ్వర్‌రావు అని , తన యావదాస్తిని పేదలకు పంచాడని, ఆరు దశాబ్దాల పాటు భారత కమ్యూనిస్టు పార్టీలో పనిచేసి ఉన్నతమైన పదవులు అనుభవించి జాతీయ ప్రధాన కార్యదర్శిగా దేశంలో అనేక ప్రజా ఉపయోగకర కార్యక్రమాలు నిర్వహించడంలో సఫలీకృతమై నిరంతరం పేదల కోసం పరితపించిన గొప్ప మానవతావాది అన్నారు. కులాలకు మతాలకతీతంగా ఆయన ప్రజలకు సేవ చేశాడని, అలాంటి రాజేశ్వర్‌రావు మృతి చెంది 31 సంవత్సరాలు అవుతుందని, రాజేశ్వర్‌రావు ఆశయాలను లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు నేటితరం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం ప్రతినబూని రానున్న రోజుల్లో భూమిలేని నిరుపేదలకు దళితులకు, గిరిజనులకు, బలహీన వర్గాలకు ఇండ్లస్థలాల కోసం, ఇండ్ల కోసం, వ్యవసాయ భూముల కోసం పోరాటాలు నిర్వహించాలని వెంకటస్వామి పిలుపునిచ్చారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌కుమార్,కసిరెడ్డిసురేందర్‌రెడ్డి, సమ్మయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కసిరెడ్డి మణికంఠరెడ్డి, కిన్నెర మల్లవ్వ, పిట్టల సమ్మయ్య, మచ్చ రమేష్, బోనగిరి మహేందర్, కంది రవీందర్ రెడ్డి, నాయకులు సత్యనారాయణ చారి, కొట్టె అంజలి, సాంబరాజు తదితరులున్నారు.

## చివరి ఆయకట్టుకు నీరివ్వాల్సిందే



**ప్రజాపక్షం/శంకరపట్నం:** చివరి దశలో ఉన్న వరి పొంట పొలాలకు చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలని కేశవపట్నం, తాడికల్, కరీంపేట్, అంబాలాపూర్ వివిధ గ్రామాలకు చెందిన రైతులు మండల కేంద్రంలో కరీంనగర్ వరంగల్ జాతీయ రహదారిపై బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సంధర్భంగా రైతులు మాట్లాడుతూ వరి పంట పొలాలు కోత దశలో ఉన్నాయని, ఎస్సారెస్పీ నీరు చివరి ఆయకట్టు వరకు చివరి తడి నీరు అందించకపోతే రైతులు చేతికొచ్చిన పంటకు నష్టం వాటిల్లుతుందని వాపోయారు. ఈ విషయమై మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చొరవ తీసుకుని వెంటనే చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలని, రైతులు నష్టపోకుండా ఆదుకోవాలని కోరారు. జాతీయ రహదారిపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయని సమాచారం అందుకున్న ఏఎస్ఐ సుధాకర్ పోలీసు సిబ్బందితో ఘటనా స్థలాన్ని చేరుకుని ఆందోళన విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# బిసి బాలుర వసతి గృహంలో సకల వసతులు

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్ :** బీసీ బాలుర వసతి గృహంలో అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం ఓదెల మండలంలో ఆకస్మికంగా తహసిల్దార్ కార్యాలయం, బీసీ బాలుర వసతి గృహం పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తహసిల్దార్ కార్యాలయంలో పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ధరణి దరఖాస్తుల పెండింగ్ ఉంచకుండా చూడాలని అన్నారు.బిసి బాలుర వసతి గృహంలో 9 లక్షల రూపాయలతో చేపట్టిన మౌలిక వసతుల కల్పన పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. వసతి గృహంలో డోర్స్, కిటికిలు, టాయిలెట్స్, విద్యుత్ మరమ్మత్తు పనులు, పేయింటింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. తహసిల్దార్ సునీత, ఏఈ జగదీష్, అధికారులు పాల్గొన్నారు.



### చలి వేంద్రం ప్రారంభం

వేసవి కాలంలో ప్రయాణికులకు, కలెక్టరేట్‌కు వచ్చే సందర్శకులకు ఇబ్బందులు కలగకుండా బస్ స్టాప్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశామని కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలోని బస్ స్టాప్ వద్ద చలి వేంద్రాన్ని అదనపు కలెక్టర్ డి.వేణు తో కలసి ప్రారంభించారు. చలివేంద్రంలో ప్లాస్టిక్ గ్లాసులు వినియోగించవద్దని సూచించారు. కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్‌అధికారిప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

## క్వార్టర్ల కేటాయింపుపై కౌన్సిలింగ్



**ప్రజాపక్షం/గోదావరిఖని :** సింగరేణి రామగుండం1 ఏరియా పరిధిలో విధులు నిర్వహిస్తున్న మంత్లి గ్రేడ్ ఉద్యోగులకు లోయర్, హైయ్యర్ టైప్ క్వార్టర్ల కేటాయింపు విషయమై ఆర్.సి.ఓ.ఏ. క్లబ్‌లో బుధవారం అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎస్ఓటూ జీఎం గోపాల్‌సింగ్ ఆధ్వర్యంలో అధికారులు సీఎంఓ, ఎస్‌సి, బిసిహెచ్, డి, టి2, ఎంబి, ఎస్టీ2 టైప్ క్వార్టర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అర్హత, గ్రేడ్, పదవి ప్రాధాన్యతగా పారదర్శకతతో క్వార్టర్ల కౌన్సిలింగ్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఏఐటియుసిబ్రాంచి సెక్రటరీ ఆరెల్లి పోషం, సీనియర్ పర్సనల్ అధికారి శ్రావణ్ కుమార్, హనుమంతరావు, పీవో ఎ.దేవాచారి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# కోడి పుంజు కోసం వెళ్లి బావిలో పడి ఒకరు మృతి

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** పెద్దపల్లిజిల్లా కమాన్ పూర్ మండలంలోని సిద్దిపల్లె గ్రామానికి చెందిన నామని రాజేశం (70) అనే వ్యక్తి బుధవారం ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నామని రాజేశం సిద్దిపల్లెలోని తన వ్యవసాయ భూమిలో సాగు చేసిన వరి పంట కోతకు రావడంతో సంప్రదాయ పద్దతిలో కోడి పుంజును కొనుక్కుని పోత లింగన్న గుడి వద్ద కోసేందుకు సంచిలో నుండి కోడి పుంజును బయటకు తీశాడు. ఈ క్రమంలో కోడి పుంజు ఎగిరి పోయింది. దానిని దొరకబట్టే క్రమంలో ఎగిరిన కోడి పుంజు బావులోకి దూకింది. దానిని పట్టుకునే క్రమంలో రాజేశం ప్రమాదవ శాత్తు కాలు జారీ వ్యవసాయ బావిలో పడిపోయాడు.ఆసమయంలోఆ ప్రాంతంలో ఎవ్వరు లేకపోవడంతో రాజేశం బావిలోనే మృతి చెందాడు. కోడి కోయడం కోసం పొలం వద్దకు వెళ్లి తిరిగిరాక పోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి పరిశీలించగాఆబావిలోపడిపోయినట్లు గుర్తించారు. ఈ మేరకు కమాన్ పూర్ పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటన స్థలానికి చేరుకొని పర్యవేక్షించారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ బావిలో నుండి రాజేశం మృతదేహన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కమాన్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# చెక్కుల ద్వారా విఓఎల వేతనాలు చెల్లించాలి

### అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** గ్రామ సమాఖ్యలో పనిచేయుచున్న విఓఏల వేతనాలను సకాలంలో చెక్కుల ద్వారా చెల్లింపు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. బుధవారం సెర్ఫ్ సిబ్బందితో సమీక్షించారు. జిల్లాలో ఐకెపి ద్వారా చేపట్టబోయే కొనుగోలు కేంద్రాలలో పారదర్శకంగా తూకం వేస్తూ తేమశాతాన్ని సరైన విధంగా చూస్తూ తాలు లేకుండా కొనుగోలు చేయాలని, అందుకు సంబంధించిన రికార్డును డాటా ఎంట్రీని సకాలంలో పూర్తి చేయాలని పేర్కొన్నారు. విధ్యార్థులకు సంబంధించి ఏకరూప దుస్తులు సకాలంలో కుట్టించి సంబంధిత పాఠశాలలకు అందజేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో జరిగిన పనులపై సమీక్షించారు. సిబ్బంది సంస్థలో నిర్వహించబడుతున్న ఆర్థిక లావాదేవీలపై నిబద్ధతతో పనిచేయాలని, అవకతవకలకు ఆస్కారం లేకుండా పనిచేస్తూ ప్రాజెక్టు పురోగభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. ఆర్థిక, వివోఏల వేతనాల విషయంలో పొరపాట్లు జరిగితే విధుల నుంచి తొలగించి, క్రిమినల్ కేసులు పెట్టడం జరుగుతుందని తెలిపారు. సమస్యలుంటే సకాలంలో తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. డిఆర్‌డిఓ వి.శ్రీధర్, అడిషనల్ డిఆర్‌డిఓ పి.సునీత, డిపిఎంలు, ఆర్‌ఎం స్త్రీనిధి, ఎపిఎంలు పాల్గొన్నారు.

## 'జైబాపు, జై భీమ్, జై సంవిధాన్' పాదయాత్ర

**ప్రజాపక్షం/కొహెడ:** ఏఐసీసీ, టీపీసీసీ, రాష్ట్ర రావాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు కొహెడ మండలంలో కాంగ్రెస్ అధ్యక్షులు మంద ధర్మయ్య ఆధ్వర్యంలో నాగ సముద్రాల, వేంకటేశ్వర్లపల్లి, ధర్మసాగర్‌పల్లి, కూరెల్ల గ్రామాల్లో 7వ రోజు జై బాపు జై భీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. మంద ధర్మయ్య మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అవమానించేలా పార్లమెంటులో హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తూ కాంగ్రెస్ కేంద్ర పెద్దలు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమానికి పిలుపు ఇచ్చిందని, జాతి ఐక్యత ముఖ్యం అని మహాత్మా గాంధీ పేర్కొన్న మాటలను గుర్తు చేస్తూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని గౌరవించుందామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో సీనియర్లకు ఆదరణ కరువేనా?

### కనీస ప్రోటోకాల్ పాటించడం లేదని అసహనం

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్ద పల్లి జిల్లా ముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన జై బాపు జై సంవిధాన్ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్, కాంటెస్ట్ జెడ్పీటీసీ చొప్పరి సంపత్ పట్ల కాంగ్రెస్ పార్టీలో నుండి ఒక వర్గం కనీస ప్రోటోకాల్ పాటించకుండా అవమానించిన తీరు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఒకింత అసహనం గురిచేసింది.కేవలం ఇద్దరు, ముగ్గురు నేతల తీరుతో కాంగ్రెస్ పార్టీ నాయకులు అసంతృప్తికి లోనవుతున్నారు.ఇప్పటికే అధిష్టానానికి ఫిర్యాదు చేసిన తీరు మార్చుకోకపోవడంతో తాము లేకుంటే కాంగ్రెస్ పార్టీ లేదు అని బహిరంగంగా చెప్పుకుంటూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను, సీనియర్లు ను పార్టీ కార్యక్రమాల్లో అవమానించడం కరెక్ట్ పద్ధతి కాదు అని ఇప్పటికే మంత్రిశ్రీధర్‌బాబు, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ శ్రీను బాబు అందరిని కలుపుకొని కార్యక్రమాలు నిర్వహించాలి అని చెప్పారు. వాళ్ల ప్రవర్తన తీరు మార్చుకోకపోవడంతో పార్టీకి తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని ఇప్పటికీ అయినా వారి మీద చర్యలు తీసుకోవాలి అని, పార్టీని కాపాడుకోవాలని సీనియర్ నాయకుడు చొప్పరి సంపత్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తన ఆవేదన పలు వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేయడంపై పార్టీలో విభేదాలు మొదలయ్యాయా అని పలువురు చర్చించుకుంటున్నారు.

# రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు

### ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

### కోనరావుపేట, నిజామాబాద్‌లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**ప్రజాపక్షం /కోనరావుపేట :** రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం కోనరావుపేట మండల కేంద్రంలో, నిజామాబాద్ లో పాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఇస్తూ కొనుగోలు చేస్తున్నామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా తల్లులను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో రాష్ట్ర వ్యాప్తంగా 50శాతం కొనుగోలు కేంద్రాలను వారికి కేటాయించారని రైతులకు పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్, ఎరువులు, మేలైనా వంగడాలను ప్రభుత్వం తరుపున అందిస్తున్నామని తెలిపారు. రైతులకు ఏక కాలంలో రైతుప్రయోజనాల కోసం 21వేల కోట్ల మేర రుణమాఫీ చేయడం జరిగిందని సన్న వడ్లు పండించే రైతులను ప్రోత్సాహించాలని ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి క్వింటాళ్‌కు అదనంగా రూ.లు 500 ఇస్తున్నదని పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, వైస్ చైర్మన్ ప్రభాకర్, సింగిల్ విండో చైర్మన్ బండ నర్సయ్య, నాయకులు చేపూరి గంగాధర్, గొట్టె రుక్మిణి, రమేష్ రెడ్డి, సాసాల మల్లేశం, ఉప్పల రాజేందర్, పెంతల శ్రీనివాస్,శ్రీధర్, సదానందం, బోయిని లింబాది, జింక శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్లు ఎత్తివేతకు బిజెపి కుట్ర

### సిద్దిపేట డిసిసి అధ్యక్షులు నర్సారెడ్డి

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** రాజ్యాంగం ద్వారా సక్రమించిన హక్కులను పేదలకు దక్కకుండా చేసేందుకు కేంద్రంలోని బిజెపి కుట్ర చేస్తుందని, బడా సంస్థలకు అనుకూలంగా పాలన చేసేందుకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా కల్పించిన రిజర్వేషన్లు తొలగించేందుకు కేంద్రంలోని మోడి ప్రభుత్వం కుతంత్రాలు చేస్తుందని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎంఎల్‌ఏ తూంకుంటా నర్సారెడ్డి ఆరోపించారు. బుధవారం జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్‌లో జెబాబు,జైభీం,జైసంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ, అంబేద్కర్ చిత్ర పటాలకు పూలమాల వేసి గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సిద్ధించి పది సంవత్సరాల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రకటించిన హామీలను నేరవేరుస్తూ సిఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో పజాపాలన కొనసాగుతుందన్నారు. రాష్ట్ర ఖజానాను దొపిడి చేసిన బిఆర్‌ఎస్ పార్టీ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును జీర్ణించుకోవడంలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం పథకాలతో రాష్టంలో బిఆర్‌ఎస్ పార్టీ పారిస్థితి అగమ్యగోచారంగా మారిందని, ఆ పార్టీ నేతలకు మింగుడు పడక కాంగ్రెస్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాను న్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిపక్షా పార్టీలు భూస్థాపితం ఖాయమన్నారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపధ్యాక్షురాలు అంక్షారెడ్డి,ఎఎంసిచైర్మన్‌నరేందర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి,మండల కోఆర్డినేటర్ లక్ష్మారెడ్డి, పార్టీనాయకులు మునీర్, మహేందర్‌రెడ్డి,మల్లేశం,శ్రీనివాస్‌రెడ్డి,కరుణాకర్, పాష ఉన్నారు.

## రేషన్ దుకాణాలను కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలుగా మార్చారు

**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ నీరు పేద ప్రజల నిత్యవసర సరుకులు పంపిణీ చేసే ప్రజా పంపిణీ ప్రభుత్వ రేషన్ దుకాణాల వద్ద కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ ఫ్లక్సీలు పెట్టి రేషన్ దుకాణాలను పూర్తిగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయముగా మార్చి ప్రజాస్వామ్యాన్ని ఖునీ చేస్తున్నారని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం నర్సాపూర్ లోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సన్న బియ్యం పంపిణీ పేరుతో రేషన్ దుకాణాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని సన్న బియ్యం లో విపరీతమైన నూకలు వాటితో పాటు దొడ్డు బియ్యం వస్తున్నాయన్నారు. ప్రజా పాలనలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని ఎమ్మెల్యే సునీత రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్ గౌడ్ పట్టణ అధ్యక్షులు పంబళ్ల బిక్షపతి, నాయకులు ఆంజనేయులు గౌడ్, ప్రసాద్, వినయ్, సద్దాం, సాయి, నవీన్, సాకేత్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## అసంపూర్తిగా ట్రాక్ మరమ్మతులు..

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలో రైల్వే ట్రాక్‌ల అసంపూర్తి మరమ్మతుల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుస్తుంది. ఈ మరమ్మతుల వల్ల కొన్ని ప్రాంతాల్లో గేటును దాటాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. తాజాగా రెండు రోజుల క్రితం సాటాపూర్ గేటు వద్ద రైల్వే ట్రాక్ మరమ్మతులు చేపట్టగా పనులు సక్రమంగా నిర్వహించకపోవడంతో ట్రాక్ మధ్యలో వాహనాలు ఇరుక్కొని అటు ప్రక్కకు వెళ్లలేక పోతున్నారు. బుధవారం ఓ టాటా ఏస్ వాహనం ట్రాక్ మధ్యలో ఇరుక్కోగా ట్రాక్టర్ సహాయంతో బయటకు తీశారు. ట్రాక్ మరమ్మత్తులపై వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా ద్విచక్ర వాహనదారులు సైతం ట్రాక్ వద్ద ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అలాగే ఇటీవల ఎడపల్లి మండల కేంద్రంలో బోధన్‌నిజామాబాద్ ప్రధాన రహదారిపై ట్రాక్ మరమ్మతులు చేపట్టగా అక్కడ సైతం ద్విచక్ర వాహనదారులు వాహనాలపై నుంచి పడి గాయాలపాలవుతున్నారు. ఇకనైనా సంబంధిత రైల్వే అధికారులు ట్రాక్ మరమ్మత్తులు సక్రమంగా చేపట్టే విధంగా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

## పకడ్బందీగా ఓపెన్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలు



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో అదనపు ఎస్పి ప్రభాకర్ రావు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి పరీక్షల నిర్వహణపై జిల్లా విద్య, వైద్య, ఆరోగ్య, రవాణా, ఆర్‌టిసి, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా, తపాలా శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ప్రకటించిన కార్యచరణ ప్రకారం ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు జిల్లాలో జరగనున్న పదో తరగతి ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు ప్రతి రోజు 2 పేపర్లు ఉంటాయని, 10వ తరగతి పరీక్షల కొరకు ఆసిఫాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, కాగజ్ నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షల కొరకు ఆసిఫాబాద్ మండల కేంద్రంలోని జనకాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కాగజ్ నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరీక్షల కమిషనర్ ఉదయ్ బాబు, సీతారాం, రామచందర్, శేషరావు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విడిసి అక్రమ కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణచివేస్తాం

పోలీసు కమిషనర్ సాయి చైతన్య



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** గ్రామాభివృద్ధి కమిటిల పేరుతో విడిసి అక్రమాలకు పాల్పడిన, సివిల్ తగాదాలను చేపట్టిన, న్యాయం, చట్టం తమ చేతుల్లో తీసుకొని గ్రామ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన వారిపై కేసులు పెట్టడం వారి పట్ల కఠిన చర్యలు తీసుకోవడం తప్పదని నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయి చైతన్య అన్నారు. బుధవారం విడిసిల ఆగడాలపై ఒక ప్రకటనను జారీ చేశారు. భారతదేశంలో గల ఏ వ్యక్తి అయిన భారత ప్రభుత్వ చట్టాలను గౌరవించి ఆ చట్టాలకు లోబడే తమ కార్యకలాపాలు నిర్వహించాలి. ఎవరికైనా ఎలాంటి సమస్యలు వచ్చినా సంబంధిత శాఖలను సంప్రదించి ఆ శాఖల నుంచి సహాయ సహకారాలు పొందాలని సూచించారు. గ్రామాభివృద్ధి కమిటిలు సామరస్యంగా పండుగలు తదితర వేడుకలను ఐకమత్యంతో నిర్వహించుటకు, ప్రజల్లో అందరు కలిసి వేడుకలు చేసుకుంటు సంతోషాలతో ఏర్పాటు చేసుకున్నవని అలాంటి విడిసిల ముసుగులో పంచాయతీలపేరుతో డబ్బులు వసూలు చేయడంలో ఇతర ఆర్థిక లావాదేవీలు నిర్వహించడం, ఇవన్నీ చట్ట వ్యతిరేక చర్యలుగా పరిగణించబడతాయని అన్నారు. ఎవరైనా గ్రామ అభివృద్ధి కమిటి పేరుతో ప్రజల్లో శాంతి భద్రతలకు భంగం వాటిల్లే విధంగా వ్యవహరించినా ఏ ఒక్కరిని వదిలేది లేదని అన్నారు. కావున గ్రామాభివృద్ధి కమిటి పేరులో ఎవరు చట్టం, న్యాయాన్ని తమ చేతిలో తీసుకోకూడదని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



**ప్రజాపక్షం/గజ్వేల్:** అవసరమైన ప్రతిచోట ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి సూచించారు. ఫ్యాక్స్ చైర్మన్ జేజాల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం గజ్వేల్ మార్కెట్ యార్డు ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు. రైతులకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం కాగా, పండించిన ప్రతి పంటను కొనుగోలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా దలారులను ఆశ్రయించకుండా అన్నదాతలను ఆర్థికంగా బలోపేతం చేసే దృష్టిలో పెట్టుకొని గిట్టుబాటు ధర ఇవ్వడంతో పాటు సన్నధాన్యానికి రూ 500 బోనస్ అందజేస్తున్నట్లు తెలిపారు. వరి ధాన్యం మొదటి రకానికి రూ 2320, సాధారణ రకానికి రూ 2300 అందజేస్తుండగా, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని, అకాల వర్షాలు పడుతున్నందున అన్నదాతలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి జాన్ వెస్లీ, ఫ్యాక్స్ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, ఫ్యాక్స్ సీఈవో బాల్ నర్సయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరుణాకర్ రెడ్డి, యాదగిరి, డాక్టర్ వహీద్, నర్సింహ రెడ్డి, నాయకులు నిమ్మ రమేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకం గడవు ఈ నెల 15 వరకు

**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి:** భారత ప్రభుత్వం కార్పోరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వారు అందించే ప్రధాన మంత్రి ఇంటర్న్ షిప్ పథకము రెండవ దశ దరఖాస్తు గడువు ఈ నెల 15 వరకు అనగా తేది 15 ఏప్రిల్ 2025 వరకు పొడిగించారని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.ఈ ఇంటర్న్ షిప్ కు ఎంపికైన విద్యార్థులకు నెలవారి భత్యం రూ 5 వేలు ,ఒకసారి రూ. 6వేలు మంజూరు చేయబడతాయని 12 నెలల ఇంటర్న్ షిప్ కాలవ్యవధిలో కనీసం 6 నెలలు ఉద్యోగ శిక్షణ ఉంటుందని ఈ ఇంటర్న్ షిప్ ద్వారా అవకాశాలను మెరుగుపరచుకుంటాయన్నారు

**ఈ ఇంటర్న్ షిప్ పథకానికి కావాలసిన అర్హత ప్రమాణాలు.....**

21 నుండి 24 సంవత్సరాల మద్య వయస్సు కలిగిన వారై ఉండాలి, కుటుంబంలో ఏవరూ ప్రభుత్వ ఉద్యోగి ఉండకూడదు. 10వ తరగతి, ఇంటర్ /ఐటిఐ/పాలిటెక్నిక్ డిప్లోమా ,డిగ్రీ పూర్తయి ఉండాలి గత సంవత్సర కుటుంబ ఆదాయం రూ. 8 లక్షల లోపు ఉండాలి.

ధరఖాస్తు చేయువిధానం ....

pnintemship mca.gov పోర్టల్ సందర్శించి లాగన్ చేయాలని యువత నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి వారి భవిష్యత్తును సురక్షితంగా ఉంచుకోవడానికి ఈ సువర్ణ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

# రైతులకిచ్చిన హామీలు అమలు చేయాలి




**ప్రజాపక్షం/నిజామాబాద్‌ప్రతినిధి:** అర్హులైన రైతులందరికి రెండు లక్షలలోపు రుణమాఫీ చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు కంజర భూమయ్య అన్నారు. బుధవారం రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలు చేయాలని జిల్లా కలెక్టరేట్ల ముందు నిరసన కార్యక్రమం పిలుపులో భాగంగా ధర్నాచౌక్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కంజర భూమయ్య పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందు ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. గెలిచిన తర్వాత రైతును రుణవిముక్తులను చేస్తామని చెప్పి రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని పూర్తిస్థాయిలో చేయలేకపోయారన్నారు. 41 వేల కోట్లు చేయాల్సి ఉండగా కేవలం 21 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారన్నారు. బ్యాంకు తప్పిదాతలో రుణమాఫీ కానీ రైతులకు పూర్తి చేస్తామని చెప్పి ఇప్పటివరకు చేయకపోవడం సరికాదన్నారు. అలాగే బోధన్ షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని అనేక వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన తర్వాత అంతంత మాత్రంగానే చేస్తుందన్నారు. రైతును రుణవిముక్తి చేస్తామని చెప్పి మాట తప్పారన్నారు. రుణమాఫీ కానీ మిగతా రైతులకు వెంటనే మాఫీ చేయాలన్నారు. రెండు లక్షల వరకు రుణమాఫీ చేశామని తప్పుడు లెక్కలు చూయిస్తున్నారని, ఎలాంటి మెలికలు పెట్టకుండా రెండు లక్షల వరకు రుణమాపీని వెంటనే చేయాలని, రైతు భరోసా గత ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఇవ్వకుండా ఇన్ని ఎకరాలకు మాత్రమే చేస్తామని చెప్పకుండానే ఒకటి రెండు ఎకరాల వరకు రైతు భరోసానిచ్చి చేతులు దులుపుకుంటుందన్నారు. మార్చి 31 వరకు పూర్తి చేస్తామని చెప్పి మాట తప్పారని, కాలయాపన మాని అర్హులైన రైతులందరికి వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజారెడ్డి, రాజేశ్వర్, నాయకులు రాందాస్, కృష్ణయ్య, రాజన్న, రైతులు పాల్గొన్నారు.

## కల్తీ కల్లు బాధితులకు పరామర్శ



**ప్రజాపక్షం/బాన్సువాడ:** ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కల్తీకల్లు తాగి పేద వర్గాలకు చెందిన ప్రజలు ఆసుపత్రుల పాలయ్యారని, కల్తీకల్లు కు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మినారాయణ అన్నారు. ఇటీవల కల్తీ కల్లుతాగి అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని మాజీ ఎంపి బిబి పాటిల్‌తో కలిసి, యెండల లక్ష్మినారాయణ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి ఆరోగ్య పరిస్తితిపై ఎప్పటికప్పుడు వైద్యులు పర్యవేక్షించాలని, కల్తీ కల్లుకు కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమన్నారు. గత ప్రభుత్వం ఈతవనాలు పేరుతో ప్రజాధనాన్ని వృధా చేశారని, ఇప్పటికైనా ప్రజల ఆరోగ్యం పట్ల సంబందిత అదికారులు తమ విదులను సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అద్యక్షులు నీలం చిన్నరాజులు, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ గుడుగుట్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు తుప్తి శివప్రసాద్, నాయకులు దొరబాబు, చిదుర సాయిలు, పైడిమల్ లక్ష్మినారాయణ, శంకర్ గౌడ్, కోనాల గంగారెడ్డి, కొండని గంగారాం, రుద్రూర్, నసురుల్లాబాద్ పార్టీ మండల అధ్యక్షులు హరికృష్ణ, సున్నం సాయిలు, అనిల్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం తాజుద్దీన్



**ప్రజాపక్షం/ సదాశివపేట :** పెంచిన ఎల్పిజీ గ్యాస్ సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం తాజుద్దీన్ డిమాండ్ చేశారు. ఎన్డీ మొన్న ఎల్పిజీ సిలెండర్ పై ఏకంగా రూ. 50లు పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ ఆద్వర్యంలో గ్యాస్ సిలిండర్ తో నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈసందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంతాజుద్దీనన్ మాట్లాడుతూ మోదీ గత ఎన్నికల్లో మేం కూడా మళ్లి అధికారంలోకి వస్తే నిత్యావసర వస్తువుల ధరలను తగిస్తామని ,ప్రతి పేద ,మద్యతరగతి, ప్రజల ఆదాయాన్ని పెంచుతామని ,ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అనేక హామీలు ఇచ్చారు. ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా ఆచరణకు నోచుకోలేదన్నారు. పైగా ఏకంగా ఎల్పిజీ సిలిండర్ పై 50 రూపాయల పెంచడం నిజంగా సిగ్గుచేటు అన్నారు. ఈ పెంపుతో పేద ,మద్యతరగతి ,ప్రజలపై మరింత భారం పడనుందన్నారు. ముల్గే నక్కపై తాటికాయపడినట్లు కేంద్రం వ్యవహరిస్తుందన్నారు. మరో ప్రక్క అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ అయిల్ తగ్గిన్నాయన్నారు. ఈ లెక్కన దేశంలో పెట్రోల్ ,డిజిల్, గ్యాస్ ధరలు తగ్గాలన్నారు. అయితే దీనికి పూర్తిగా విరుద్దంగా మోడీ ధరలను పెంచుతున్నాడన్నారు. ఆయన ఊడిగమంతా కార్పోరేట్ సంస్థలకు కంపెనీలకి చేస్తున్నాడన్నారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాని సిపిఐ కేంద్ర ప్రభుత్వాని డిమాండ్ చేస్తుందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండిషఫి, రజినీ, మేడం, సాదిక్ అలీ, లింగం , మైబెల్లి, ఎం రమేష్, శ్రామిక మహిళా కార్యదర్శి అనుసూజ యాదవ్ రైతు మహిళా కార్యదర్శి బుజ్జమ్మ, తస్లీమ్ రాజమ్మ, శంకరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## లైబ్రరీని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నూతనంగా అందుబాటులోకి తెచ్చిన డిజిటల్ లైబ్రరీ విభాగాన్ని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు, నిరుద్యోగ యువత కోసం ఇంటర్నెట్ సేవలతో కూడిన డిజిటల్ లైబ్రరీ కోసం కలెక్టర్ ప్రత్యేకంగా ఐదు లక్షల నిధులను సమకూర్చారు. ఈ నిధులతో ఇంటర్నెట్ సదుపాయంతో కూడిన పది కంప్యూటర్లతో డిజిటల్ లైబ్రరీని నెలకొల్పారు. దీనిని ప్రారంభించిన సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అనేక మంది జిల్లాకు చెందిన యువతి యువకులతో పాటు ఇతర జిల్లాల నుండి కూడా నగరానికి వచ్చి జిల్లా కేంద్ర గ్రంథాలయం సేవలను వినియోగించుకుంటున్నార న్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వారికి డిజిటల్ లైబ్రరీ కూడా అందుబాటులో ఉంచాలనే ఉద్దేశ్యంతో దీనిని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. పోటీ పరీక్షలు, వివిధ ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పరీక్షల మెటీరియల్‌ను ఆన్‌లైన్ ద్వారా సేకరించుకునేందుకు డిజిటల్ లైబ్రరీ ద్వారా వీలు కలిగిందన్నారు. ఉద్యోగార్థులు దీనిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. ఇప్పటికే పాత డీఈఓ కార్యాలయంలోని పలు గదులను రీడింగ్ రూమ్‌గా వినియోగించుకోవడం జరుగుతోందని గుర్తు చేశారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారి కోసం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, తదితరులు చొరవ చూపి గత నెలలో మధ్యాహ్న భోజన సదుపాయం సమకూర్చడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, జిల్లా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేష్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డి, అధికారులు, సిబ్బంది రాజారెడ్డి, నరేష్‌రెడ్డి, తారకం, రాజేశ్వర్, శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన ఏకరూప దుస్తులు

కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/నస్పూర్:** ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు జూన్ మాసం మొదటి వారంలోగా పాఠశాలలకు కేటాయించిన మేరకు నాణ్యమైన ఏకరూప దుస్తులు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, విద్యాశాఖ సమన్వయ కర్త చౌదరి లతో కలిసి మండల విద్యాధికారులు, ఎపిఎంలు, జిల్లా సమాఖ్య, మెప్మా సభ్యులతో ఏకరూప దుస్తుల తయారీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాజిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధి దిశగా అనేక చర్యలు చేపడుతుందని, ప్రతి ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, వంటశాల, భోజనశాల, ప్రహరీగోడ ఇతర మౌళిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తుల తయారీ ప్రక్రియను వేగవంతం చేయాలని, మే నెల 20వ తేదీ లోగా దుస్తులు సిద్ధం చేసే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులకు సంబంధించి దుస్తుల తయారీ కొరకు కొలతలు ఇప్పటికే తీసుకోవడం జరిగిందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు విద్యార్థుల ఏకరూప దుస్తుల తయారీ కొరకు మహిళా స్వయం సహాయక సంఘాలకు అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి పనులు పూర్తి అయి ఎంబి రికార్డులు సమర్పించిన వాటికి బిల్లులు చెల్లించడం జరిగిందని, ఇంకా మిగిలి ఉన్న ప్రాంతాలలో పనులను త్వరగా పూర్తి చేసి రికార్డులు సమర్పించాలని తెలిపారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యులకు హైదరాబాద్లో అందించిన శిక్షణకు సంబంధించిన ధృవపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల కోసం పోరాడేది ఎఐటియుసి

సిఐటియు నుండి 15 మంది కార్మికులు ఎఐటియుసిలో చేరిక



**ప్రజాపక్షం/ శ్రీరాంపూర్:** ప్రజల హక్కుల కోసం ఎఐటియుసి యూనియన్ చేస్తున్న నిరంతర పోరాటాలకు ఆకర్షితులై 15 మంది నర్సరీ కాంట్రాక్టు కార్మికులు సిఐటియు యూనియన్ నుండి ఎఐటియుసి లోకి చేరారని బెల్లంపల్లి రీజియన్ సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, బ్రాంచ్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్ తెలిపారు. బుధవారం నాడు శ్రీరాంపూర్ ప్రాంతంలోని సింగరేణి నర్సరీ విభాగంలో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నర్సరీలో పనిచేస్తున్న కార్మికులను యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులుగా గుర్తించకపోవడం వల్ల శ్రమ దోపిడీ జరుగుతోందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ సమస్యను పట్టించుకోకపోయినా, ఎఐటియుసి గుర్తింపు సంఘంగా విజయాన్ని సాధించిన తరువాత నర్సరీ కార్మికుల హక్కుల కోసం నిర్విరామంగా పోరాడుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య చొరవతో నర్సరీ కార్మికులకు వైద్య సదుపాయం, సిఎంపిఎఫ్ లాభాలు కల్పించేలా యాజమాన్యాన్ని ఒప్పించామని తెలిపారు. అనంతరం యూనియన్‌లో చేరిన కొత్త సభ్యులకు భవిష్యత్తులో సముచిత స్థానాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు రాచర్ల చంద్రమోహన్, ఖాతరాజు ప్రభాకర్, కార్యదర్శి బూర వీరేశం, సహాయ కార్యదర్శి సురేంద్ర చారి, నర్సరీ అధ్యక్షురాలు స్వప్న, కార్యదర్శి లక్ష్మి, నాయకురాలు సరోజన, కార్మికులు లక్ష్మి, సునీత, స్వరూప, గూడ రాజవ్వ, భాగ్యలక్ష్మి, గంగ, రజిత తదితరులు పాల్గొన్నారు.

## రాజేశ్వరరావు కృషి ఎనలేనిది

సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్




**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వరరావు చేసిన కృషి ఎనలేనిదని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. బుధవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో అమరజీవి కా॥ చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించామన్నారు.ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానంలో నైజాంకు వ్యతిరేకంగా, ఆంధ్ర మహాసభ ఆనాటి తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలకు, పార్టీ ప్రజా సంఘాల ఉద్యమాల ద్వారానే పార్టీ పురోగతిపై దిశా దశ చూపించటంలో సీఆర్ కృషి ఎనలేనిదన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వరరావు చేసిన కృషి ఎనలేనిదన్నారు. 196489 వరకు 25 సంవత్సరాలు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలో ఉండి పార్టీని అగ్రస్థానంలో నిలబెట్టిరన్నారు. 1990లో వయస్సు ఆరోగ్యరీత్యా పార్టీ ప్రధాన కార్యదర్శి బాధ్యతల నుండి స్వచ్ఛందంగా తగ్గినారన్నారు. వారు పార్టీ బాధ్యతలున్న పూర్తి కాలం ఢిల్లీ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లోనూ, బాధ్యతల నుండి తగ్గిన తర్వాత హైదరాబాద్ మగ్దుమ్ భవన్‌లో తుదిశ్వాస వరకు గడిపారన్నారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు సమైక్యం కావలన్న వారి చిరకాలవాంఛ. భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రత్యేకించి దక్షిణ భారతంలో సుదీర్ఘకాలం ఆయన ప్రముఖ పాత్ర వహించారన్నారు. ప్రతి కార్యకర్త ఆయన స్ఫూర్తితో పని చేద్దామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఓమయ్య, జిల్లా నాయకులు రాజిరెడ్డి, రాజన్న, రమేష్ పాల్గొన్నారు.

# సన్నబియ్యంతో పేద కుటుంబాలలో ఆనందం

కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/టేక్మాల్ :** ధనవంతులు తినే బియ్యమే పేద వాళ్ళు తినాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చౌక ధరల దుకాణాల ద్వారా ఆహార భద్రత కార్డు దారులకు ఉచిత సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం ధ వారం మండల్ చంద్రు తండా లో లంబాడా సామాజిక వర్గానికి చెందిన రమావత్ పీరియ ఇంట్లో ప్రభుత్వం అందించిన సన్నబియ్యం భోజనాన్ని వారి కుటుంబ సభ్యులు ఇతర జిల్లా అధికారులతో, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ భోజనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఉగాదిన ప్రారంభించిన సన్న బియ్యం పంపిణీతో ఇలాంటి పేదవారికి ఎంతో మేలు కలుగుతుందని తెలిపారు. సన్న బియ్యంతో భోజనం సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. పేదలందరికీ పూర్తి స్థాయిలో ఆహార భద్రత కల్పించడమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం ఆహార భద్రతా కార్డు దారులకు ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్నట్లు తెలిపారు. సన్నబియ్యం పంపిణీ తో పేదవారి కళ్ళలో ఆనందాన్ని స్వయంగా చూశానని కలెక్టర్ అన్నారు. సన్నబియ్యం లబ్దిదారుని కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేయడం చాలా సంతోషంగా ఉందని, సంతృప్తి ఇచ్చిందని అన్నారు. భోజన అనంతరం కలెక్టర్ రమావత్ పీరియ కుటుంబ సభ్యులకు శాలువా బహుకరించి, స్వీట్స్ అందజేశారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వ హిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని అన్ని చౌక ధరల దుకాణాలకు సన్నబియ్యం స్టాకు చేరినట్లు తెలిపారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య,తాసిల్దార్ తులసిరాం, ఎంపీడీవో విటల్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని వీర్ దరఖాస్తు గడువు ఈ నెల 25 వరకు పెంపు

కలెక్టర్ క్రాంతి వల్లూరు



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి:** భారత సైనంలో అన్ని కేటగిరిలో నియామకం కోసం వెలువరించిన దరఖాస్తు గడువు పెంచినట్లు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు బుధవారం నాడు ఓ ప్రకటనలో తెలిపారు. భారత సైనంలో నియామక సంవత్సర 2025 26 కొరకు అగ్నివీర్ (అని కేటగరీలు) జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్లు ఇతర హోదాల నియామక నోటిపికేన్‌కు 2025 మార్చి 12 వెబ్ సైట్ పోర్టల్ లో విడుదల చేయబడినదన్నారు. అగ్ని వీర్ జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్లు/ఇతర హోదాల నియామకానికి సంబంధించిన ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ పరీక్షలకు నమోదు గడువును 2025 ఏప్రిల్ 26 వరకు పొడిగించారన్నారు. ఆసక్తి ,అర్హతలు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# కళారంగం

## ఫోకస్

# గిరిజన రైతుల సంబురాలు



మేఘాలయలో జరుగుతున్న గిరిజన రైతుల సంబురాలు ఎప్పటి మాదిరిగానే యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నాయి. మంచి పంటను అందించిన ప్రకృతికి కృతజ్ఞతలు తెలుపుతూ గిరిజనులు నిర్వహించే 'షాద్ సుక్ మైన్సియం' ఈనెల 15వ తేదీ వరకూ కొనసాగుతుంది. గిరిజన నృత్య ప్రదర్శనలు, సంగీత వాయిద్య ప్రదర్శనలు, ఇతర కళా రూపాలను ఆస్వాదించవచ్చు. ఈ పండుగను ఖాసీ అనే గిరిజన తెగ జరుపుకోవడం ఆనవాయితీ. ఇక్రమంగా ఇతర గిరిజన తెగలు కూడా దాదాపు ఇలాంటి సంబురాలనే నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతున్నది. స్థానికులతోపాటు ఎంతోమంది దేశ విదేశ పర్యాటకులు ఈ గొప్ప నృత్యాలను చూసేందుకు తరలి వస్తారు. వేడుకల్లో పాల్గొంటారు. పంట నాట్ల నుంచి కోత వరకూ ఉన్న వివిధ దశలను మహిళకు వర్తింప చేసి, వారిని గౌరవించుకోవడం ఇందులోని ప్రత్యేకత. గర్భం దాల్చడం నుంచి బిడ్డకు జన్మనివ్వడం వరకూ గల వివిధ దశలను పంటలతో పోలుస్తూ, పాటలు పాడతారు. నృత్యాలు చేస్తారు. కనుమరుగవుతున్న గిరిజన సంప్రదాయాలు, కళా రూపాలను చూసే అవకాశం ఇలాంటి వేడుకల్లో లభిస్తుంది.దాదాపు ఇదే మాదిరి ఉత్సవాన్ని పంజాబ్‌లో 'బైశాఖీ మేళా' రూపంలో నిర్వహిస్తారు. బైసాఖి (వైశాఖి) అనేది పంటకోత పండుగ. ఇది సిక్కు మతం ప్రారంభానికి గుర్తు కూడా. పంజాబీల అంతర్లీన ఆనందకరమైన డివి న్‌ఎకి బైశాఖి మేళాను జోడిస్తారు. అందుకే, వారు జరుపుకొనే బైశాఖి మేళా భారతదేశంలో అత్యంత హృదయపూర్వకమైన, విలక్షణమైన పండుగలలో ఒకటిగా గుర్తింపు సంపాదించింది. ఈ రోజున పంజాబ్ మొత్తం జానపద సంగీతం, భాంగ్రా నృత్యాలతో హోరెత్తిపోతుంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో, అదే విధంగా ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో ఉంటున్న సిక్కులు ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. సంగీతం, నృత్యం, ఇతర కళాప్రదర్శనలతోపాటు, వివిధ రకాల వంటకాలు కూడా ఈ వేడుకలో భాగం. ఒక రకంగా చెప్పాలంటే, పంజాబ్ సంస్కృతి దాని స్వచ్ఛమైన రూపం ఈ ఉత్సవాల్లో దర్శనమిస్తుంది. అమృత్సర్ స్వర్ణ దేవాలయంలో ఈ వేడుక మరింత ఆహ్లాదకరంగానూ, ఘనంగానూ ఉంటుంది.తెలుగులో వైశాఖమే పంజాబీలో బైశాఖీగా మారిన విధంగానే, అస్సామీ భాషలో బిహుగా పిలుస్తారు. ఏప్రిల్ 14 నుంచి 16వ తేదీ వరకూ అస్సాంతోపాటు ఈశాన్య ప్రాంతంలోని ఇతర రాష్ట్రాల్లోనూ 'బోహాగ్ బిహు' పండుగను ఘనంగా జరుపుకొంటారు. అస్సామీలకు ఇది నూతన సంవత్సరాది. మిగతా ఈశాన్య రాష్ట్రాల్లో ఇది వసంతకాల ఆగమాన్ని సూచిస్తుంది. జానపత సంగీతం, బిహు నృత్యం ఈ పండుగ ప్రత్యేకం. కొన్ని రాష్ట్రాల్లో బిహు ఉత్సవాన్ని వారం రోజులు జరుపుకొంటారు. వివిధ రకాల కళా ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.



# కేరళ నూతన సంవత్సరాది

కేరళ ప్రాంతవాసుల విషు నూతన సంవత్సరాది ఈనెల 14వ తేదీ జరుగుతుంది. ఇళ్ల తలుపులపై పూలతో రంగోలను సృష్టించడం ద్వారా ఈ పండుగ ప్రారంభమవుతుంది. కేరళలో మాత్రమేగాక, దేశంలోని మిగతా ప్రాంతాలతోపాటు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మలయాళీలంతా ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. పూలతో ముగ్గులు వేసే కళాత్మక నైపుణ్యం మరెక్కడా కనిపించదు. ఈ పండుగకు ఒక రోజు ముందు నుంచే సందడి నెలకొంటుంది. 20 వస్తువులతో కూడి న ప్రత్యేక విందు ఏర్పాటు చేస్తారు. అనేక హో టళ్లలోనూ ఈ విందును ఆరగించవచ్చు. రాష్ట్రం వ్యాప్తంగా వివిధ నగరాలు, పట్టణాలు, చారిత్రక ప్రదేశాల్లో నృత్య, సంగీత ప్రదర్శనలు జరుగుతాయి. సాంస్కృతిక కార్యకలాపాలతో ప్రజలు ఉల్లాసంగా గడుపుతారు. సాంప్రదాయ నృత్య రూపాలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటాయి.

### తమిళ పుతండు..

తమిళనాడు నూతన సంవత్సరం ఏప్రిల్ 14న జరుగుతుంది. వసంత విషువత్తు తర్వాత రోజు, తమిళ నూతన సంవత్సరాన్ని నిర్వహించుకోవడం ఆనవాయితీ. ఇది తమిళ హిందూ క్యాలెండర్ మొదటి నెల మొదటి రోజు. ఈ రోజు కన్నితో ప్రారంభమవుతుంది తెల్లవారుజామున, కుటుంబాలు ఒక పెద్ద అద్దం ఉంచి, దాని ముందు, ఒక ట్రేలో ఉష్ణమండల పండ్లు, కొబ్బరి, బంగారు ఆభరణాలు, పండ్లు, నగదు, బీటల్ ఆకులు, ఇతర శుభ వస్తువులను ఉంచుతారు. వాటి ప్రతిబింబాన్ని అద్దంలో చూస్తారు. పూల అలంకరణలతో ఆయా ప్రాంతాలన్నీ కళాత్మకంగా గోచరిస్తాయి. సంగీత, నృత్య ప్రదర్శనలతో ఈ పండుగ మరింత శోభను సంతరించుకుంటుంది.

### నాబా బార్షా

బెంగాలీ లిపిలో 'వ' అనే అక్షరం లేదు. దాని స్థానంలో 'బ' అక్షరాన్నే వాడతారు. దక్షిణాది రాష్ట్రాల్లో, ప్రత్యేకించి తెలుగు రాష్ట్రాల్లో 'వ' అక్షరంతో మొదలయ్యే పలు పదాలు బెంగాలీలో 'బ' అక్షరంతో ఉండడాన్ని గమనించవచ్చు. ప్రత్యేకించి సంస్కృతం నుంచి వచ్చి చేరిన పదాల్లో ఈ తేడా స్పష్టంగా కనిపిస్తుంది. 'నవ వర్ష' లేదా 'కొత్త సంవత్సరం' అనే అర్థాన్ని సూచించే 'నాబా బార్షా' పండుగల పశ్చిమ బెంగాల్ సంవత్సరాది. ఈ పండుగను నృత్యం, సంగీతం, ప్రాంతీయ ఆటలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలతో జరుపుకుంటారు. ప్రతి సమాజం ఈ పండుగను ఒక ప్రత్యేకమైన రీతిలో నిర్వహిస్తుంది. స్థానికులు తమ ద్వారం తలుపులను అందమైన రంగుల కళతో అలంకరిస్తారు. అనేక ఆసక్తికరమైన సంప్రదాయాలు, ఆచారాలు ఇప్పటికీ కొనసాగే ఎన్నో కళా ప్రదర్శనలు ఉంటాయి. ఈ పండుగ సమయంలో తెలుపు, ఎరుపు రంగు దుస్తులు ధరించిన స్త్రీలను, సాంప్రదాయ కుర్తా, ధోతీలో పురుషులను చూడవచ్చు.





## చిత్తిరై పండుగ

మధురై (తమిళనాడు)లో ఈనెల 14న జరిగే చితిరై పండుగ సంప్రదాయ కళలకు సిసలైన వేదికగా నిలుస్తుంది. సాంప్రదాయబద్ధంగా నిర్వహించుకునే ఈ పండుగ సందర్భంగా నృత్య, సంగీత ప్రదర్శనలు ఉంటాయి. పూల అలంకరణలు ఈ ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణ. రకరకాల కళాప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకుంటాయి. ఒకవైపు సాంస్కృతిక వారసత్వం, మరోవైపు అధునిక పొకడలను సంతరించుకున్న కళాప్రదర్శనలతో విలక్షణమైన వేడుకగా పేరు తెచ్చుకున్న చితిరైని తిలకరించడానికి దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా ప్రజలు తరలివస్తారు. విదేశీయులను కూడా ఈ వేడుక అకట్టుకుంటుంది.

# ఉల్లాసభరితం.. ధమాల్ నృత్యం

ధమాల్ నృత్యం అనేది ఆనందం, ఉల్లాసం ప్రతిబింబించే లయబద్ధమైన వ్యక్తీకరణ. తరచుగా శుభ సందర్భాలలో, విశిష్టమైన లేదా ప్రత్యేక వేడుకల్లో ఆనందం ఉత్సాహం నింపటానికి ఈ నృత్య ప్రదర్శన జరుగుతుంది. నృత్యకారులు వలయాకారంలో/వృత్తాకారంలో కదులుతూ నర్తిస్తారు. వారి పాదాల కదలికలు, వాయిస్తున్న సంప్రదాయ వాయిద్యాల దరువుతో మమేకమవుతాయి. నృత్యం ఆద్యాంతం ఉల్లాసం, ఉత్సాహంతో నిండి వుంటుంది. నర్తిస్తున్నవారిలో ఉత్సాహాన్ని నింపే రీతిలో, ప్రదర్శన చూస్తున్నవారు ప్రోత్సాహాన్ని అందిస్తారు. వారితో కలిసి నాట్యం చేస్తారు. అహిర్లు నివసించే గుర్గావ్ ప్రాంతంలో ధమాల్ నృత్యం ప్రసిద్ధి చెందింది. నృత్యం మూలం పురాతన కాలం నాటిది. ఈ నృత్యం పురుషులు మాత్రమే చేస్తారు. వారు ధమాల్ వాయిద్య లయ ధ్వనితో పాడతారు. నృత్యం చేస్తారు. ప్రజలు తమ పంట కోతకు సిద్ధంగా ఉన్నప్పుడల్లా ఈ నృత్యం చేస్తారని చెబుతారు. నృత్య సమయంలో, పాల్గొనే మగవారు అర్ధవృత్తాన్ని ఏర్పరుచుకుని ప్రకృతి ఆశీర్వాదం కోరుతూ ప్రార్థన చేస్తారు.



# రైతుల సమస్యలు పరిష్కరించాలి



నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో..


సూర్యాపేట కలెక్టరేట్ వద్ద...

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ముందు తెలంగాణ రాష్ట్రరైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు బిజ్జ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సూర్యశంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి తెలంగాణరాష్ట్ర కార్యదర్శి వార్లవెంకటయ్య, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా వార్లవెంకటయ్య మాట్లాడుతూ గత 15నెలల క్రితం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లు వాగ్ధానాలు ఎన్నికల మేనిఫెస్టోలో నమోదుచేశారుకాని నేటికి 42లక్షలమంది రైతులు తెలంగాణరాష్ట్రంలో ఉంటే కేవలం 22లక్షలమందికి మాత్రమే రూ. 2లక్షల రుణమాఫీ చేశారన్నారు. మిగతావారందరికి తక్షణమే రూ.2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. అదే విధంగా ఎకరాకు రూ.15వేలు ఇస్తానన్న రైతుభరోసాను రూ.12వేల రూపాయలకు కుదించడం జరిగిందన్నారు. జనవరి 26నుండి ప్రారంభించిన రైతుభరోసాను అరకొర నాలుగు ఎకరాలవరకు మాత్రమే రైతుభరోసా ఇవ్వడం జరిగిందని, మిగతా వారందరికి రైతుభరోసా ఇవ్వాలని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పంటల సంరక్షణబీమా పథకాన్ని అమలుచేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో సిపిఐరాష్ట్ర కౌన్సిల్‌సభ్యులు కేశవగౌడ్, రైతుసంఘం జిల్లా కార్యవర్గం సభ్యుడు సాయిలు, బండికృష్ణయ్య, కొండన్నగౌడ్, ప్రకాష్, కుర్మయ్య, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సూర్యాపేట కలెక్టరేట్ వద్ద...


రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొడ్డ వెంకటయ్యలు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ పి రాంబాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొప్పోజు సూర్యనారాయణ, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు అనంతుల మల్లేశ్వరి, నాయకులు పుట్టపాక అంజయ్య, సతీష్, శ్రీనివాస్ రెడ్డి, కె.రాము తదితరులు పాల్గొన్నారు.

### నల్లగొండ టౌన్‌లో...

రాష్ట్రంలో రైతన్న ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మాజీ శాసనసభ్యులు ఉజ్జిని యాదగిరిరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురజ రామచంద్రం డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యలయం ఏఓ మెతిలాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు కనకయ్య, బుర్ర శేఖర్, బండమీది వెంకన్న, బొడ్డు వెంకటేశ్వర్లు అల్వాల నరసింహ, బండమీది యాదయ్య, వెంకట్ రెడ్డి వి.అంజల్ రావు, ఎం.పాండు, డి.శాంత, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద

ఏకకాలంలో రెండు లక్షల మాఫీ చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం పిలుపుమేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ ధర్నా కార్యక్రమానికి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కె. మాధవరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగా, జిల్లా కార్యదర్శి ఎం ప్రభు లింగం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.సుభాన్ రెడ్డి ఎం.సుధాకర్ గౌడ్, చంద్రశేఖర్ రెడ్డిలు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మహిళా రైతులు బక్కని మల్లేష్,గుండాల శివుడు, బాల్ రెడ్డి, చల్లా నారాయణరెడ్డి,జె అంజయ్య,బి వెంకన్న, నరసింహులు,శ్రీనివాస్ నాయక్,ఎల్ నరసింహారెడ్డి, చతుర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండ టౌన్‌లో...



రంగారెడ్డి కలెక్టరేట్ వద్ద...

# కేంద్ర ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరలు తగ్గించాలి

## రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాలలో సిలిండర్‌తో సిపిఐ శ్రేణుల నిరసన



నాగర్‌కర్నూల్ జిల్లాసమితి ఆధ్వర్యంలో..

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి:** కేంద్రప్రభుత్వం పెంచిన సిలిండర్‌ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా డిమాండ్ చేశారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లాసమితి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరలను తగ్గించాలని అంబేద్కర్ కూడలిలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఈనెల8న గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధరలను ఉన్నట్టుండి రూ.50రూపాయలు పెంచి వెంటనే అమల్లోకి తెచ్చిందని దీనివలన దేశంలోని 35కోట్ల గృహ వినియోగదారులైన పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు పెనుభారం మోపిందన్నారు. అదేవిధంగా పెట్రోల్, డిజిల్ ధరలపై రెండుశాతంపెం చి పేదప్రజలపై పెనుభారం మోపుటకు సిద్ధమైందన్నారు. కేంద్రప్రభుత్వం ఈ దేశంలో ఉన్న వ్యాపారవేత్తలకు అధికలాభాలను తెచ్చి పెట్టేందుకు బిజెపిప్రభుత్వం అహర్నిశలు కష్టపడుతూ పేద, మధ్యతరగతి ప్రజలపై అధిక సుంకాలభారాన్ని మోపుతుందన్నారు. పెంచిన ధరలను తగ్గించేంతవరకు సిపిఐపార్టీ ప్రజలపక్షాన నిలబడిపోరాడుతుందని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్రసమితి సభ్యులు పల్లదేవేందర్‌రెడ్డి, కేశవగౌడ్, వార్లవెంకటయ్య, జిల్లాసమితిసభ్యులు శంకర్‌గౌడ్, బిజ్జశ్రీనివాసులు, శివశంకర్, ఖాజ, ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సుమల శివకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### పేదలపై భారం మోపడం సరికాదు : సుధాకర్

**నిజామాబాద్ ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు కోట్లాది రూపాయలు రుణమాఫీ చేస్తూ పేదలపై భారం మోయడం సరికాదని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. ధర్నాచౌక్‌లో కేంద్ర ప్రభుత్వం గ్యాస్‌పై పెంచిన ధరను వ్యతిరేకిస్తూ గ్యాస్ బండను మోస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాక ముందు కేవలం రూ. 400 ఉన్న గ్యాస్ బండ ఇప్పుడు వెయ్యి రూపాయలకుపైగా పెరిగిందన్నారు. రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు భూమయ్య మాట్లాడుతూ పేదలకు గ్యాస్ సబ్సిడీ మాత్రం అకౌంట్‌లో నామమాత్రంగా రూ.45లు మాత్రమే వస్తుందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు రాజిరెడ్డి, రాజన్న, రాజేశ్వర్, హన్మాండ్లు, రాందాస్, రఘురాం, రంజిత్, పాల్గొన్నారు.

### పెంచిన ధరలు వెంటనే తగ్గించాలి: జంగయ్య

**షాబాద్:** కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం చేవెళ్ళ మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలకు నిరసనగా నియోజకవర్గ ఇన్‌చార్జి కె.రామస్వామి అధ్యక్షతన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, మొయినాబాద్ మండల కార్యదర్శి కె.శ్రీనివా స్, శంకర్‌పల్లి మండల కార్యదర్శి సుధీర్, షాబాద్ మండల కార్యద ర్శి నక్క జంగయ్య, బికెఎంయు జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల తదితరులు పాల్గొన్నారు.


నిజామాబాద్‌లో..

### ధరలు తగ్గించాలి : బెజవాడ వెంకటేశ్వర్లు

**సూర్యాపేట:** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రాఘవప్లాజా సమీపంలో ఉన్న పూలే విగ్రహం వద్ద పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు అనంతుల మల్లేశ్వరి, రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు కొప్పు సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షులు దొడ్డ వెంకట య్య, జిల్లా కార్యవర్గ సభ్యులు బూర వెంకటేశ్వర్లు, నాయకులు చా మల అశోక్ కుమార్, ఖమ్మంపాటి రాంబాబు, రెగట్టి లింగయ్య, తదితరుల పాల్గొన్నారు.


చేవెళ్ళ మండల కేంద్రంలో..


సూర్యాపేటలో..

# రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా బిజెపి పాలన

## సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** డాక్టర్‌బి.ఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా దేశంలో బిజెపి ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తుందని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తా వద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బిజెపి విధానాలకు వ్యతిరేకంగా సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ భారతదేశంలో కులం, మతం కన్నా దేశం ముఖ్యమని, విభిన్న జాతులు,సంస్కృతులు, భాషలు, మతాలు కలిసి ఉండాలని ఉద్దేశ్యంతో స్వాతంత్రం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ లాంటి అనేక మంది యువకులు తమ ప్రాణాలను సైతం దేశం కోసం తృణప్రాయంగా విడిచిపెట్టారన్నారు. అలాంటి అమరవీరుల ఆశయాలకు బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తుందన్నారు. కులాల మధ్య మతాల మధ్య చిచ్చు పెట్టడానికి ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి బిజెపి కుటిల ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని, ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టి నిర్బంధాలకు గురిచేస్తున్నారన్నారని, వీటన్నింటిపై ప్రజలను చైతన్యపరిచి ప్రజా ఉద్యమాలు నిర్వహించడానికి సిపిఐ శ్రేణులు సిద్ధం కావాలని వెంకటస్వామి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, నగర కార్యదర్శి సురేందర్ రెడ్డి తదితరులున్నారు.





# స్థానికం REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## పెంచిన ధరలు తగ్గించాలని వామపక్షాల రాస్తారోకో



ప్రజాపక్షం/తొర్రూరు : కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్, డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించాలని సిపిఐ, సిపిఎం పార్టీల నాయకులు తమ్మెర విశ్వేశ్వరరావు, ఎండి.యాకూబ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తొర్రూరు రెవెన్యూ డివిజన్ కేంద్రంలోని సిపిఐ, సిపిఎం నాయకులు గాంధీ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎండి.యాకూబ్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో క్రూడ్ ఆయిల్ ధరలు 41శాతం తగ్గినా గాని భారతదేశంలో వంట గ్యాస్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచి పేద, మధ్య తరగతి ప్రజలను దోపిడీ చేస్తుందన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని లేకపోతే రాబోయే రోజుల్లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్ర తరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి అధ్యక్షులు ఓమ బిక్షపతి, సిపిఐ మండల కార్యదర్శి బందు మహేందర్, ఘనపురం లక్ష్మణ్, సిపిఎం మండల కమిటీ సభ్యులు మార్క సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## గాలివానకు పాడైన పంటలు
### పరిశీలించిన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎద్ల నరేష్‌రెడ్డి



ప్రజాపక్షం/గూడూరు: గత రెండు రోజులుగా సాయంత్రాల్లో సంభవించిన గాలివాన తోటలను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎద్ల నరేష్ రెడ్డి పరిశీలించి సమగ్ర రిపోర్టును ఎమ్మెల్యే మురళి నాయక్ తెలిపి నష్ట పరిహారం వచ్చే విధంగా కృషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన వడ్లగళ్ల వానతో పంటనష్టంపై సీతానగరం భూపతిపేట చిన్న ఎల్లాపురం వెంగంపేట గ్రామాలతో పాటు ఇతర గ్రామాలలో గాలివాన బీభత్సానికి జరిగిన నష్టపరిహారంపై మానుకోట ఎమ్మెల్యే డాక్టర్ మురళినాయక్ కు ఈ విషయాన్ని తెలిపి సహాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. రోడ్లపై కల్లాలపై తడిసి మొక్కలను అరబెట్టుకుని రైతులు నెక్కోండ మార్కెట్ కు తీసుకోవస్తే రైతులకు గిట్టుబాటు ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## రైతులకు న్యాయం చేస్తాం
### జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్



ప్రజాపక్షం/గూడూరు : 45రోజుల్లో సీతానగరం భూముల విషయంలో రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తానని జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యుడు హుస్సేన నాయక్ హామీ ఇచ్చారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం భూముల సమస్య గురించి ధర్మారెడ్డి మంగీలాల్ అశోక్ భానోత్ బన్సీ దోడ్ల జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ తమ భూమి గురించి ఉన్న సమాచారిన్న వివరించారు. సీతానగరం భూముల విషయంలో ఫీల్డ్ ఎంక్వయిరీ చేసి 45 రోజుల్లో పరిష్కరించి రైతులకు న్యాయం చేస్తానని చెప్పారని ఆయన హామీ ఇచ్చారు.

## ఆస్తి పన్ను ముందే చెల్లిస్తే రాయితీ



ప్రజాపక్షం/తొర్రూరు : డివిజన్ కేంద్రంలో ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ ప్రకటించినందున పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తొర్రూరు మున్సిపల్ కమిషన్ పి.శాంతికుమార్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ మాట్లాడుతూ ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ ప్రకటించినట్లు తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాల మేరకు ఏప్రిల్ ఒకటి నుండి ఏప్రిల్ 31 వరకు ప్రభుత్వం ఆస్తి పన్నుపై ఐదు శాతం పర్సెంట్ రెబిట్ ఉందని చెప్పారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కట్టస్వామి, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ ధరల్ని తగ్గించాలని సిపిఐ ధర్నా



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: కేంద్ర ప్రభుత్వం ఇష్టారాజ్యంగా పెంచిన గ్యాస్ ధరల్ని తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం జనగామ పట్టణంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఆకుల శ్రీనివాస్, ఆది సాయన్నలు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇష్టారాజ్యంగా గ్యాస్ ధరలు పెంచిందని, పెంచిన ధరల్ని తగ్గించాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. ఒక వైపు పెరిగిన ధరలలో రైతులు ఇబ్బందులు పడుతుంటే మరో వైపు ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచి ప్రజలపై మరింత భారం వేసిందన్నారు. ఇప్పటికైనా పెంచిన గ్యాస్ ధరల్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. లేని యెడల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి సొప్పరి సోమయ్య, ఉప్పల ఐలయ్య, మేటే శ్రీశైలం, గుర్రం మధు, ఉదరి వెంకటాద్రి, మదుకర్, సుదర్శన్, చింతకింది అరుణ, గుగులోతు సఖి, కంబాల యాదలక్ష్మి, బైరబోయిన విజయ, కావటి వనజ పాల్గొన్నారు.

## ఒక్క పూట పనిని అనుమతించాలి



ప్రజాపక్షం/తొర్రూరు : మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఒక్క పూట పనిని అనుమతించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి కోరారు. తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఉష్ణోగ్రత తీవ్రంగా పెరుగుతున్నందున కార్మికులు ఎండ వేడిమితో అనారోగ్యానికి గురై ప్రాణాప్రాయస్థితి ఏర్పడకముందే కార్మికులకు ఒక్క పూట పనిని అనుమతించాలని కోరారు. ఉదయం ఐదు గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు పని సమయాన్ని మార్చాలన్నారు. ఈ కార్యక్ర మంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అర్వపల్లి వెంకన్న, జిల్లా అధ్యక్షుడు ఏర్పుల మహేందర్, యూనియన్ తొర్రూరు అధ్యక్షుడు మంగళపల్లి రామస్వామి, యూనియన్ నాయకులు మాచర్ల మురళి, మంగళపల్లి యాకయ్య, మహేశ్, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన



ప్రజాపక్షం/జనగామ టౌన్: జనగామ మున్సిపాలిటీని అందంగా తీర్చిదిద్దుతామని జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. బుధవారం మున్సిపల్ అధికారులతో పట్టణంలో పర్యటించి పలు ప్రాంతాలను జేసి పరిశీలించారు. ఆయా ప్రాంతాలలో చేపట్టబోయే అభివృద్ధి పనులను పింకేష్‌కుమార్ అధికారులతో పరిశీలించడం జరిగింది. సదరు ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించి ప్రతిపాదనలు అందించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సహాయ ఇంజనీర్‌మహిపాల్ ఉన్నారు.

## 'దేవాదుల' పెండింగ్ పనులు పూర్తి చేయాలి
### అత్యంత ప్రాధాన్యత కలిగినది 'దేవాదుల ఎత్తిపోతల' ప్రాజెక్టు
### స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: దేవాదుల ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టు అని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. దాని ద్వారా ఆయకట్టు రైతులకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, స్టేషన్ ఘనపూర్ మార్కెట్ ఛైర్మన్ లావణ్య, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మారుజోడు రాంబాబు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్‌తో కలిసి కడియం శ్రీహరి దేవాదుల ప్రాజెక్టు పథకం కింద భూసేకరణ, పెండింగ్ పనుల పురోగతి, సాగునీటి సరఫరాపై నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ అత్యంత ప్రాధాన్యత కలిగిన దేవాదుల ప్రాజెక్టు ద్వారా స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాలకు సాగునీరు అందుతుందన్నారు. యుద్ధ ప్రాతిపదికన దేవాదుల ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నెల సమీక్షిస్తూ పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే గుర్తించి వాటిని పరిష్కరించాలని, మల్లన్నగండి లిఫ్ట్ 1 లిఫ్ట్ 2 పనులు జూలై లోగా పూర్తి చేసి సాగునీరు అందించాలన్నారు. డిసెంబర్‌లోపు అశ్వరావుపల్లి ప్రధాన కుడి కాలువ పనులు పూర్తి చేయాలని, ఆర్ ఎస్ ఘనపూర్ నుండి నవాబుపేట ప్రధాన కాలువ సిస లైనింగ్ పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. దేవాదుల సంబంధిత పెండింగ్ భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మాట్లాడుతూ అధికారులు అందరు సమన్వయంతో పెండింగ్ పనుల్ని వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నీటి నిర్వాహణకు అవసరమైన కార్యాచరణ, ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఎస్డీసీలు సుహాసిన, హనుమాన్‌నాయక్, ఆర్‌డిఓ గోపిరాం, వెంకన్న, నీటపారుదల శాఖ ఎస్‌ఈలు, ఈఈలు, నియోజకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

### పేదల కడుపు నింపేందుకే సన్నబియ్యం పంపిణీ..

పేదల కడుపు నింపేందుకే సన్నబియ్యం పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌లో కలసి స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ కేంద్రం ఎస్సీ కాలనీలో సన్న బియ్యం పంపిణీ చేసి తాటికొండ యాదమ్మ ఇంట్లో వారి కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటి సారి తెలంగాణలో సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వెంకన్న, తహశీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## నెలాఖరులోపు హైవే భూసేకరణ
### హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి : పరకాల నియోజకవర్గ పరిధిలో వివిధ గ్రామాల మీదుగా వెళుతున్న జాతీయ రహదారి 163జి భూ సేకరణ ప్రక్రియను నెలాఖరులోగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పరకాల నియోజకవర్గం పరిధిలో నేషనల్ హైవే కోసం చేపట్టిన భూ సేకరణ ప్రక్రియ పురోగతిపై ఆర్డీఓ, డాక్టర్ నారాయణ, తహసీల్దార్‌లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పరిధిలో భూసేకరణ ప్రక్రియ, రైతుల భూములకు పరిహార చెల్లింపు, తదితర వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసం అదనంగా కావాల్సిన 12.38 ఎకరాల భూ సేకరణ ప్రక్రియ, గౌరవెల్లి ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే భీమదేవరపల్లి, వేలేరు మండలాలకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియను గురించి హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. భూ సేకరణకు కావలసిన బడ్జెట్ అంచనా ప్రతిపాదనలను తయారు చేయాలన్నారు. ఎల్కతుర్తి జంక్షన్ నుండి ములుగు వైపు నిర్మిస్తున్న జాతీయ రహదారి పనుల పురోగతి గురించి జాతీయ రహదారుల శాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వీటన్నింటిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో పరకాల డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, జాతీయ రహదారుల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగం రక్షణకు పోరాటం
### అయిప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్




ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి : భారతదేశంలో ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీ కరణ విధానాలతో కేంద్ర పాలకులు, తమ ప్రజా వ్యతిరేక పాలన విధానాల ద్వారా ,భారత జాతిని,భారత రాజ్యాంగాన్ని, ప్రమాద పరిస్థితుల్లోకి తీసుకెళ్తున్నారని, ఈ ప్రమాదకరమైనటువంటి పరిస్థితుల నుండి దేశాన్ని,ప్రజలను, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, లౌకికవాదాన్ని కాపాడుకోవడానికి దేశంలో ప్రజాస్వామ్య వాదులంతా రాజకీయాలకు అతీతంగా ముందుకు రావాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్ర ధాన కార్యదర్శి కే.వి.ఎల్. పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహంవద్ద రాజ్యాంగాన్ని కాపాడుకుందాం.. దేశాన్ని రక్షించుకుందాం..అని జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చే సిన ఏఐపిఎస్ఓ సమావేశం కెవిఎల్ మాట్లాడారు. హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహం, శిలాఫలకం మీద చెక్కబడిన రాజ్యాంగం పీఠిక ముందు శాంతి సంఘీభావ సం ఘం నాయకులు సేవ్ నేషన్ సేవ్ కాన్‌స్టిట్యూషన్ నినాదాలు రాయబడిన బ్యానర్‌ను పట్టుకొని కార్యక్రమాన్ని నిర్వహించారు. కేవిఎల్ మాట్లాడుతూ దేశ స్వాతంత్రం సాధన కోసం బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నాడు భగత్‌సింగ్ ,రాజగురు, సుఖదేవ్, కమ్యూనిస్టులు, అభ్యుదయవాదులు, స్వాతంత్ర సమరయోధులు, ఎనలేని త్యాగం చేశారని వారి త్యాగాలు వృధా కాకూడదని, నాటి స్వాతంత్ర పోరాట స్ఫూర్తితో ఆ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. కేంద్రం లో, దేశంలో శాస్త్రీయమైన ఆలోచనలను, సమ భావన ఆలోచనలు విస్మరించి కాషాయకరణ దేశం చేయటానికి కానీ ఈ దేశ ప్రజలంతా భారతదేశాన్ని ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని రక్షించాలని కోరుకుంటున్నారన్నారు. అయిప్సో జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి నేదునూరి రాజమౌళి, మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ పరిపాలన కాలంలో దేశంలో అంతరాలు పెరిగిపోతున్నాయన్నారు పేదలు మరింత పేదలుగా తయారవుతున్నారని, రాజ్యాంగ ఫలాలు పేదలకు అందడం లేదని అన్నారు. జిల్లా కార్యదర్శి మేడిపల్లి శోభన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, మానవ హక్కుల రక్షణ నేటి తరం మీదనే ఉన్నదని అన్ని వర్గాల ప్రజలు సమైక్యంగా ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో దొమ్మాటి ప్రవీణ్ కుమార్, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లేరు వీరస్వామి, ఉపాధ్యక్షులు నిధి, శాంతి సంఘీభావ సంఘం నాయకులు శ్రీనివాస్, మంచాల రమాదేవి, వెంకట రాజం, సూర్యం, మధ్యల ఎల్లేష్, నాగరాజు, పాల్గొన్నారు.

## కమ్యూనిస్టు విలువలకు మారుపేరు చంద్ర రాజేశ్వరరావు
### మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: భారతదేశంలో కమ్యూనిస్టు విలువలకు మారుపేరు, నియమ నిబంధనలు కలిగిన విప్లవ సేనాని చంద్ర రాజేశ్వర్ రావు అని జనగామ మాజీ ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ సభ్యులు సిహెచ్ రాజారెడ్డి అన్నారు. బుధవారం జనగామలోని సిపిఐ కార్యాలయంలో గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో భారతదేశంలో సిపిఐ ఉద్యమ నిర్మాతల్లో ముఖ్యుడు, ఆదర్శ కమ్యూనిస్టు, సిపిఐ విప్లవ సేనాని అమరజీవి చంద్ర రాజేశ్వర్‌రావు 31వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. వర్ధంతి కార్యక్రమంలో రాజారెడ్డి మాట్లా డు తూ కమ్యూనిస్టు సిద్ధాంతాలనికి ఆకర్షితులై, కమ్యూనిస్టు సిద్ధాంత విలువలు పాటిస్తూ, తాను ఆచరస్తూ సమాజంలో దోపిడీ, పీడనకు గురవుతున్న ప్రజలకు అండగా ఉంటూ, 60 ఏళ్ల పాలు కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్రవహించినవ్యక్తి చంద్ర రాజేశ్వర్‌రావు అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమ నాయకులు, పార్టీ కార్యకర్తలు వారి బాటలో పయనిస్తూ పార్టీని విస్తరింపజేసేందుకు ప్రతిజ్ఞ చేయాలని పలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు, ఆది సాయన్న, పట్టణ కార్యదర్శి చొప్పరి సోమయ్య, జిల్లా నాయకులు ఏఐటియుసి షాప్స్ అండ్ గ్రేన్ మార్కెట్ యూనియన్ అధ్యక్షులు మోటే శ్రీశైలం, చామకూర యాకూబ్, మహిళా సంఘం నాయకులు చింతకింది అరుణ, గూగులోత్ సఖీ, గుర్రు మధు, ఊదర వెంకటాద్రి, జి నాగరాజు, కే.వనజ, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమాలపై విచారణ చేపట్టాలి



ప్రజాపక్షం/నర్సంపేట : ( సిరి అగ్రోస్ ) ఇంజనీరింగ్, పాషా ఇంజ నీరింగ్, మహేంద్ర జాండిర్ ట్రాక్టర్ షోరూమ్ లలో ప్రభుత్వం రైతులకు ఇస్తున్న సబ్సిడీ యంత్ర పరికరాల విషయంలో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేపట్టాలని తెలంగాణ రైతు కూలీ సంఘం వరంగల్ జిల్లా కా ర్యదర్శి కామ్రేడ్ ఈర్లపైడి డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ రైతు కూలీ సంఘం వరంగల్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో నర్సంపేటలోని ఆర్డిఓ ఉమారాణికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సంపేటలో గత కొన్ని నెలల నుండి ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ద్వారా వ్యవసాయ యంత్ర పరిక రాలను మన డివిజన్ కు సుమారుగా రూ. 75 కోట్లు మంజూరు చేసిందన్నారు. నర్సంపేట పట్టణంలోని సిరి అగ్రోస్ ఇంజనీరింగ్ వర్క్, పాషా ఇంజనీరింగ్ వర్క్, మహేంద్ర ట్రాక్టర్ షోరూం, జాండిర్ ట్రాక్టర్ షోరూమ్ యజమాన్యులు వ్యవసాయ శాఖ అధికారులతో ఒప్పందం చేసుకోవడం జరిగిందని, కానీ పై యజమాన్యులు రైతులకు అందించే వ్యవ సాయ పరికరాలలో కనీసం నాణ్యతలేని పరికరాలను తీసుకువస్తూ రైతులకు అంటగడు తున్నారన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న సిరి అగ్రోస్ ఇండస్ట్రీస్ ఇంజనీరింగ్, పాషా ఇంజనీరింగ్, మహేంద్ర ట్రాక్టర్ షోరూమ్, జాండిర్ ట్రాక్టర్ షోరూమ్ లపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం వరంగల్ జిల్లా నాయకులు బొర్ర ఆనంద్, భూమా అశోక్, శివరాత్రి కుమార్, ఎలకంటి చిన్న కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బకు గురి కాకుండా అవగాహన
### హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య




ప్రజాపక్షం/హనుమకొండ : వేసవిలో వడదెబ్బకు గురికాకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల సరైన జాగ్రత్తలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య ప్రజలకు సూచించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వేసవిలో వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ వేసవిలో ఉష్ణోగ్రతల వల్ల తలెత్తే అనారోగ్య సమస్యల గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింద న్నారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆధ్వర్యంలో ఆరోగ్య శాఖ తరఫున జిల్లాలో 21వ తేదీన వైద్యాధికారులు, పల్లె దవాఖాన వైద్యులు, ఎంఎల్ హెచ్పీలతో జిల్లా స్థాయిలో సమావేశాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. వైద్యాధికారులు పని చేస్తున్న చోట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, వడదెబ్బకు గురికాకుండా నివారణ చర్యలు చేపట్టి తగిన చికిత్సకు సంబంధించిన విషయాలను కూడా వారికి అవగాహన కల్పించాల్సిందిగా సూచించడం జరిగిందన్నారు. జిల్లాలో ఉన్నటువంటి ఆరోగ్య సిబ్బందితో పాటు లైన్ డిపార్ట్మెంట్స్ అయినటువంటి అంగన్వాడీ, సెర్ప్ ఐకేపీ వారితో కూడా సమావేశాన్ని నిర్వహించి, ముఖ్యంగా గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్న ప్రదేశాలలో ఓఆర్ఎస్ పాకెట్లు అందించే విధంగా చేయడంతోపాటు షెడ్ నెట్ ద్వారా నీడ సౌకర్యాన్ని కల్పించాలని కోరినట్లు తెలిపారు. గ్రామాలలో ఆశా కార్యకర్తల ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయడం జరుగుతుందని, ప్రజలకు అవగాహన కల్పి స్తున్నట్లు పేర్కొన్నారు. వడదెబ్బకు గురైన వారికి తల నొప్పి, తీవ్రమైన జ్వరం, నాలుక ఎండిపోవటం, దాహం వేయడం, మగతా లేదా నిద్ర లాంటి స్థితి, వాంతులు, పూర్తి ఆపస్మారక స్థితిలో ఉండడంలా ంటి లక్షణాలు ఉన్నవారిని వెంటనే చల్లని ప్రాంతానికి చేర్చాలని, చల్లని నీటిలో ముంచిన క్లాత్ లతో తూడవాలని సూచించారు. సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించాలన్నారు. ఈ సందర్భం గా కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ వరంగల్ మహా నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాల మేరకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నగరంలో పలు కార్యక్రమాలు నిర్వహిన్నస్తుట్లు తెలిపారు. గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ముఖ్యమైన 42 చోట్లలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయ డం జరుగుతుందన్నారు. నగర పాలక సంస్థ పరిధిలో పని చేసే కార్మికులకు వేసవి దృష్ట్యా పనివేళల్లో మార్పు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఏడీజి. వి. భానుప్రసాద్, ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఇక్తేదార్ అహ్మద్, జిల్లా మాస్ మీడియా అధికారి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 27న పాతికేళ్ళ గులాబీ జెండా ప్రస్థాన సభ
### మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్



ప్రజాపక్షం/ఎల్కతుర్తి: పాతికేళ్ళ కిందట ఆవిర్భవించిన గు లాబీ జెండా ప్రస్థానం...27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి లో జరుగనున్న భారీ బహిరంగ సభతో సంబురాలు అంబరాన్ని తాకనున్నట్లు మాజీ ఎంపీ, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో గులాబీ జెండా పార్టీ బీఆర్ఎస్ 25 సంవత్సరాల భారీ బహిరంగ సభ ఏర్పాట్లను వినోద్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ పాతికేళ్ళ ప్రస్థానంలో పోరాటాలు,రాష్ట్ర సాధన,అనంతరం అధికారంలోకొచ్చి తొమ్మి దేళ్ళలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, సంక్షేమంలో రికార్డులు సృష్టించాం అని వినోద్ కుమార్ వివరించారు.గులాబీ జెండా పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. రోడ్లను పరిశీలించిన వినోద్ కుమార్ గులాబీ జెండా పాతికేళ్ళ భారీ బహిరంగ సభ జరుగనున్న ఎల్కతుర్తి సభా ప్రాంగణాన్ని వినోద్ కుమార్ బుధవారం పరిశీలించిన అనంతరం జాతీయ, రాష్ట్ర రహదారుల పరిస్థితులను ప్రత్యక్షంగా గమనించారు.కరీంనగర్ నుంచి వరంగల్ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రోడ్, వరంగల్ నుంచి మెదక్ హైవే రోడ్లను పరిశీలించి మైనర్ రిపేర్స్ అవసరం అని సంబంధిత అధికారులకు వినోద్ కుమార్ ఫోన్ చేసి చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన ఎంఎల్‌సి తక్కలపల్లి రవీంద్రరావు , మాజీ ఎమ్మెల్యే లు సతీష్ కుమార్, పెద్ది సుదర్శన్ రెడ్డి, ఎల్కతుర్తి మండల బిఆర్ఎస్ అధ్యక్షులు మహేందర్, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో పేదలకు భరోసా
### ప్రభుత్వ విప్ డాక్టర్ రాంచంద్రునాయక్



ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి: కాంగ్రెస్ పాలనలో పేదల బతుకులకు భరోసా ఉంటుందని,మహిళలకు సముచిత స్థానం కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ అన్నారు. బుధవారం మరిపెడ మండల కేంద్రంలోని ఆడిటోరియంలో డిపిఎం శ్రీనివాస్, ఏపిఎం రాములు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మరిపెడ, చిన్నగూడూరు మండలాల మహిళా సమాఖ్య సంఘాలకు వడ్డీలేని రుణాల చెక్కులను అందించారు. ఆయన మాటాలడుతూ ఒక ఏశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలంటే మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా సమైఖ్యసంఘాలకు వడ్డీలేని రుణాలను అందించి వారు స్వయం ఉపాధి ఏర్పర్చుకునేలా ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు.డోర్నకల్ నియోజకవర్గానికి రూ.8కోట్లు వీఎల్ఎఆర్ మహిళా సమైఖ్య సంఘాలకు ఈ ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించిందని, అందులో భాగంగా డోర్నకల్ నియోజకవర్గానికి రూ.8కోట్లు వCలేని రుణాలు మంజూరయ్యాయన్నారు. ఇందిరా మహిళా శక్తి ద్వారా పౌల్ట్రీ ఫాం, ఇందిరమ్మ మహిళా క్యాంటీన్, సోలార్ పవర్ ప్లాంట్, పెట్రోల్ బంకు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రె స్ నాయకులు ఒంటికొమ్ము యుగంధర్‌రెడ్డి, జిల్లా యువనాయకులు నూకల అభినవ్ రెడ్డి, మం డల కాంగ్రెస్ అధ్యక్షులు పెండ్లి రఘువీరారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ తాజొద్దీన్, కేసముద్రం మార్కెట్ వైస్ చైర్మన్ పెదబోయిన ఐలమల్లు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుగులోతు రవి, మాజీ సర్పంచ్ పానుగోతు రాంలాల్, తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

**ప్రజాపక్షం/పెనుబల్లి :** పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. మండల కేంద్రమైన పెనుబల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెనుబల్లి ఆసుపత్రి పరిసరాలలో ఆహ్లాద కర వాతావరణం ఏర్పాటు చేయాలని, ఆసుపత్రి బిల్డింగ్ మీద వున్న చెట్లు తొలిగించాలని, ఆసుపత్రి చుట్టూ గోడ నిర్మించాలని, వాటర్ ట్యాంక్ ఏర్పాటు గురించి, ఐఓ వాటర్ ప్లాంట్ , ఆసుపత్రి చుట్టూ సోలార్ లైట్స్, సెక్యూరిటీ సిబ్బంది , ఆధునిక వైద్య పరికరాలు, డయాలిసిస్ సెంటర్ ఏర్పాటు, నూతన డాక్టర్స్ అవసరం గురించి కమిటీతో చర్చించారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10 లక్షలు అందిస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రతాప్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బుక్కా కృష్ణవేణి, లైన్స్ క్లబ్ అధ్యక్షులు పొట్లపల్లి వెంకటేశ్వరరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్, హాస్పిటల్ డాక్టర్స్, సిబ్బంది, సత్తుపల్లి ఎఎంసి చైర్మన్ దోమ ఆనంద్, పెనుబల్లి వైస్ చైర్మన్ కోటేశ్వరరావు, పెనుబల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు, పెనుబల్లి మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పివిఎన్ కాలనీకి రక్షణ కల్పించండి

ఎఐటియుసి నాయకులు వినతి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సింగరేణి కంపెనీ కార్మికుల కోసం నిర్మించిన పివిఎన్ కాలనీలో మంగళవారం అర్థరాత్రి దొంగల సృష్టించిన అలజడితో కార్మికుల కుటుంబాలు భయభ్రాంతులకు గురవుతున్నారని తక్షణమే కాలనీకి రక్షణ కల్పించి, సెక్యూరిటి గార్డును నియమించాలని ఎఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జేవిఆర్ ఓసిలో ఎఐటియుసి ఆద్వర్యంలో నిరసన తెలిపి మాట్లాడుతూ ఇప్పటికైనా యాజమాన్యం సత్తుపల్లి కాలనీలో సెక్యూరిటీని ఏర్పాటు చేయాలని గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి సముద్రాల సుధాకర్ డిమాండ్ చేశారు. అనంతరం కార్మిక కుటుంబాలను గుర్తింపు సంఘం నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో దారా భీమయ్య, భరణి, నరసింహారావు, బరిగల శేఖర్, బుగ్గ సుధాకర్, గ్రౌంటాల సురేష్, తిరుపతి, దాసరి రాంచందర్, తిరుపతి, బద్దం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల ప్రచార బాధ్యత ఎన్ఎస్‌యుఐదే : ఎమ్మెల్యే రాగమయి



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల ప్రచార బాధ్యత ఎన్ఎస్‌యుఐపై ఉందని ఎమ్మెల్యే రాగమయి అన్నారు. పట్టణంలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎన్ఎస్‌యుఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సత్తుపల్లి నియోజకవర్గ ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు అర్వపల్లి సందీప్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్‌లు హాజరై ఎన్ఎస్‌యుఐ జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేసి ఆవిర్భావ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు చేస్తున్న రాజకీయ, సేవా, విద్యా కార్యక్రమాలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసి చైర్మన్ దోమ ఆనంద్, నాయకులు చల్లగుళ్ల నరసింహ రావు, దొడ్డా శ్రీను, కమల్ పాషా, మానుకోట ప్రసాద్, పింగళి సామ్యూల్, ఆంగోతు రామారావు, షరీఫ్, సత్తుపల్లి పట్టణ మాజీ కౌన్సిలర్స్ నాగలక్ష్మి, నాగుల్ మీరా, సత్తుపల్లి మండలం ఎన్.ఎస్.యు.ఐ మండల అధ్యక్షులు దోమ దీపక్, ఖమ్మం జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కన్నీగంటి లోకేష్, జొన్నలగడ్డ రాజు, జొన్నలగడ్డ వంశీ, తేజా, రాజా, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని, పేదవారి గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోవాలనే సంకల్పంతో సన్న బియ్యం పథకం ప్రవేశ పెట్టి ప్రారంభించుకోవడం జరిగిందని పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆనందపురం గ్రామ పంచాయితీ నందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సన్న బియ్యం పథకం పంపిణీలో భాగంగా ఆయన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, ధనిక అనే తేడా లేకుండా ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వం 10 ఏళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, తమ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులకు పేర్లు చేర్పించడం జరిగిందన్నారు. కొత్త రేషన్ కార్డు ఇచ్చిన ఘనత ఈ ప్రభుత్వాన్ని దేనని అన్నారు. ప్రతి ఒక్క పేద కుటుంబానికి ప్రతి మనిషికి ఆరు కిలోల చొప్పున ప్రతి ఒకరికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా రాజీవ్ వికాసం పథకాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు వాగ్దానాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుంటే బిఆర్ఎస్ నాయకులు మింగుడు పడక ఏమి చేయాలో అర్థం కాక విమర్శిస్తున్నారని అన్నారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సత్తుపల్లిలో దొంగల హల్‌చల్

8 ఇళ్ళలో దొంగతనం, 80 తులాల బంగారం, 50 తులాల వెండి, రూ.2 లక్షల నగదు చోరీ



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో సింగరేణి కార్మికుల కోసం నిర్మించిన పివిఎన్ కాలనీలో మంగళవారం అర్థరాత్రి దొంగలు హల్ చల్ చేశారు. సుమారు 8 ఇండ్లలో చోరీకి పాల్పడి అందిన కాడికి దోచుకున్నారు. ఒకేరోజు ఎనిమిది ఇండ్లలో దొంగతనాలు జరగడంతో క్వార్టర్స్ లోని కార్మికులు భయాందోళన గురయ్యారు. కాలనీ వాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి తరువాత మంకీ క్యాపులు ధరించిన ముగ్గురు దొంగలు క్వార్టర్స్ గోడ దూకి కాలనీలోకి ప్రవేశించినట్లు సిసి కెమెరాలు రికార్డయిందన్నారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లోకి చొరబడి దొంగతనాలు చేశారన్నారు. ఈ చోరీల్లో 80 తులాల బంగారం, 50 తులాల వెండి, రూ. రెండు లక్షల నగదు చోరీ జరిగినట్టు కాలనీ వాసులు తెలిపారు. విషయం తెలుసుకున్న కల్లూరు ఎసిపి ఎ.రఘు, ఎస్ఐ, పోలీస్ సిబ్బందితో వచ్చి దొంగతనాలు జరిగిన ఇళ్లను తనిఖీ చేశారు. ఖమ్మం నుంచి క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. దొంగతనాలకు సంబంధించిన సీసీ ఫుటేజ్, వీడియోస్ సేకరించారు. దొంగల కోసం పోలీసు బృందాలు గాలింపు చర్యలు మొదలుపెట్టారు.

# షరతుల్లేకుండా రైతులకు రుణమాఫీ

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాల విశ్వనాథం డిమాండ్

కలెక్టరేట్ ఎదుట ఎఐకెఎస్ ధర్నా



**ప్రజాపక్షం/పాల్వంచ :** షరతుల్లేకుండా రైతులకు సంపూర్ణంగా రుణమాఫీ చేయాలని రాష్ట్ర రైతు సంఘం(ఎఐకెఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాల విశ్వనాథం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎఐకెఎస్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బుధవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ పాలకులు రైతు వ్యతిరేక విధానాల వలన వ్యవసాయ రంగం దెబ్బతిని సంక్షోభంలో ఉందని ఆరోపించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులు అనుకూలంగా మూడు నల్ల చట్టాలు తీసుకొచ్చి దొడ్డిదారిన అమలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ రంగం దెబ్బతింటే అన్ని రంగాలు మీద నష్టాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వాలు గమనించి స్వామినాథన్ సిఫార్సులు తక్షణమే అమలు చేసి రైతాంగ, వ్యవసాయ రంగాన్ని కాపాడాలని కోరారు. పంట మద్దతు గ్యారెంటీ చట్టం అమలు చేస్తే తప్పా వ్యవసాయంలో రైతు నిలబడగలుగుతాడన్నారు. మిర్చి కింటాకు 25 వేలు రూపాయలు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా శక్తివంతమైన ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో సాగునీరు ప్రాజెక్టు ప్రాధాన్యత కల్పించి పంటలకు సాగునీరు అందించే విధంగా పాలకులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో వ్యవసాయ యంత్రాలకు సబ్సిడీ ఇచ్చేవారని, గత పదిహేళ్లుగా బిఆర్ఎస్ ప్రభుత్వం సబ్సిడీని ఎత్తివేసిందని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి రైతులకు వ్యవసాయ యంత్రాలను అందించాలని కోరారు. అనాదిగా పోడుసాగు చేసుకుంటున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు ఇవ్వాల్సిందేనన్నారు. జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో రైతు సంఘం జిల్లా నాయకులు కల్లూరి వెంకటేశ్వర్లు, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, నారాటి రమేష్, సపావట్ రవి, నిమ్మల రాంబాబు, విజయలక్ష్మి , బుబ్బారెడ్డి, సీతారాంరెడ్డి, కుమారి హనుమంతరావు, వైఎస్ గిరి, గుగులోత్ రామచందర్, భూక్యా దసురు, గుండుపిన్ను వెంకటేశ్వర్లు, ఇమ్మానుయేల్, లక్ష్మిపతి, నూనవత్ గోవింద్, బండి నాగేశ్వరరావు, యూసుఫ్ పాల్గొన్నారు.

## ప్రేమానురాగాలకు ప్రతీక ఆడపిల్ల

ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రేమానురాగాలకు ప్రతీకైన ఆడపిల్ల జన్మించడం తల్లిదండ్రులకు దేవుడిచ్చిన ఆత్మీయ కానుకని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మా పాప మా ఇంటి మణిదీపం కార్యక్రమంలో భాగంగా ఖమ్మం పట్టణం సారధినగర్‌లోని మౌనిక సురేష్ దంపతులకు 2025 మార్చి ఒకటిన ఆడపిల్ల జన్మించిందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం ఆ కుటుంబానికి స్వీట్‌బాక్స్, ఫ్రూట్స్, బట్టలు, సర్టిఫికెట్ అందించి తల్లిదండ్రులను, అత్త, మామలను శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంట్లో అమ్మాయిలు ఉంటే ఆ ఇల్లు కళకళలాడుతుందన్నారు. మౌనిక సురేష్ దంపతుల కోరిక మేరకు పెద్దపాప రుతికకు కలెక్టర్ అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి సన్నబియ్యం అందిన వివరాలను తెలుసుకుని కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో సంక్షేమ అధికారి రాంగోపాల్‌రెడ్డి, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ రవికుమార్, సిడిపివో వీరభద్రమ్మ, అధికారులు పాల్గొన్నారు.



## నర్సింహారావుకు పువ్వాడ పరామర్శ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మందడపు నర్సింహారావు ఇటీవల మోకాలు చికిత్స ఆపరేషన్ చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బుధవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని వీడియోస్ కాలనీలోని వారి స్వగృహానికి వెళ్లి నర్సింహారావు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

### శ్రీకాంత్ మృతదేహానికి నివాళి



సిపి(ఐ)ఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ మృతదేహానికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యర్రా శ్రీకాంత్ మరణం పార్టీకి, ఆయన కుటుంబానికి తీరని లోటన్నారు. శ్రీకాంత్ ఈ సందర్భంగా శ్రీకాంత్‌తో ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. కార్యక్రమాల్లో బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, కూరాకుల నాగభూషణం, సొసైటీ చైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి, ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మగ్బూల్, బచ్చు విజయ్ కుమార్, కార్పొరేటర్లు బుర్రి వెంకటకుమార్, మాటేటి నాగేశ్వరరావు, పాలడుగు పాపారావు, మందడపు రామకృష్ణ, మస్తాన్, ఖయ్యూం, రఘు, యర్రా అప్పారావు, మాటేటి కిరణ్, లెనిన్, తిరుపతిరావు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యల కోసం పనిచేసిన నాయకుడు శ్రీకాంత్



సంతాప సభలో వక్తలు

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** సిపిఐ(ఎం) అఖిల భారత మహాసభలకు ప్రతినిధిగా హాజరై ఆకస్మికంగా మృతిచెందిన యర్రా శ్రీకాంత్‌కు బుధవారం అంతిమ వీడ్కోలు పలికారు. ఖమ్మం పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోని శ్రీకాంత్ నివాస గృహం నుంచి మొదలైన అంతిమయాత్ర త్రీటౌన్ మీదుగా కాల్వ ఒడ్డులోని వైకుంఠధామంలో ముగిసింది. కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. దీనికి ముందు సిపిఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన శ్రీకాంత్ సంతాపసభలో పలువురు నేతలు మాట్లాడారు. సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు అరుణ్‌కుమార్ మాట్లాడుతూ శ్రీకాంత్ ఔన్నత్యా న్ని చాటుతూ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ శ్రీకాంత్ కుటుంబం మొత్తం పార్టీకి కట్టుబడి పని చేస్తుందన్నారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ సైద్ధాంతిక అవగాహన, క్రమశిక్షణ కలిగిన నాయకుడు యర్రా శ్రీకాంత్ అన్నారు. రాజకీయ విలువలు దిగజారుతున్న స్థితిలో కమ్యూనిస్టుగా శ్రీకాంత్ జీవితాంతం కొనసాగారన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు అరాధ్యుడిగా కార్మిక వర్గంతో మమేకమై ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ మంచి కమిట్‌మెంట్ ఉన్న నాయకుడు యర్రా శ్రీకాంత్ అని పాఠశాల విద్య నుంచే శ్రీకాంత్‌తో తనకు అనుబంధం ఉందని త్రీటౌన్ పరిరక్షణ సమితి ఏర్పాటు చేసి ఆ ప్రాంతాభివృద్ధి కోసం పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర నాయకులు పొలడుగు భాస్కర్, బండారు రవికుమార్, చావా రవి, అలుగుబెల్లి నర్సిరెడ్డి, మాచర్ల భారతి, వెంకటేశ్వర్లు, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, ఏజె రమేష్, అన్నవరపు కనకయ్య, అన్నవరపు సత్యనారాయణ, న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవునూరి మధు, సిపిఎం జిల్లా నాయకులు వై. విక్రం, యర్రా శ్రీనివాసరావు, బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, బండి పద్మ, స్కైలాబ్ బాబు, డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అమరుల త్యాగాలను స్మరించుకోవాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు

ఘనంగా శేషగిరిరావు విగ్రహ పునఃప్రతిష్ఠ, బందెల నర్సయ్య విగ్రహావిష్కరణ



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** కార్మిక వర్గంకోసం, పేద ప్రజలకోసం తమ జీవితాలను అంకితం చేసి పోరాడిన నాటి అమరవీరుల త్యాగాలు స్మరించుకుంటూ వారి ఆశయాల సాధనకు నేటితరం కమ్యూనిస్టులు కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా కోరారు. చుంచుపల్లి మండలం రుద్రంపూర్ సెంటర్లో పునఃనిర్మించిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక సభ్యులు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దేవూరి శేషగిరిరావు విగ్రహాన్ని, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర మాజీ అధ్యక్షులు బందెల నర్సయ్య విగ్రహాన్ని బుధవారం వారు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ, సింగరేణి ప్రధాన కార్యాలయంలో సాధారణ ఉద్యోగిగా జీవితం ప్రారంభించిన శేషగిరిరావు నాడు నాటి బ్రిటీష్ తెల్లదొరల కార్మికుల దోపిడికి వ్యతిరేకంగా పోరాటాలకు శ్రీకారం చుట్టారన్నారు. బొగ్గుగనుల్లో మహిళలు, పిల్లలతో పనిచేయించే విధాన్ని వ్యతిరేకించిన తొలితరం ఉద్యమకారుడు శేషగిరిరావు అని కొనియాడారు. కార్మికవర్గం, ప్రజలకోసం పోరాడిన శేషగిరావుతోపాటు ఆయనతో సహచరులు రంగయ్య, పాపయ్యలు అప్పటి రజాకార్లు బూర్గంపాడు ప్రాంతంలో కాల్చి చంపారని పేర్కొన్నారు. వాసిరెడ్డి మురళి, గనిగళ్ళ వీరస్వామి, తోట రాజు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య, వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, తాటి వెంకటేశ్వర్లు, వెంకన్న, సరెడ్డి పుల్లా రెడ్డి, చంద్రగిరి శ్రీనివాస్ రావు, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్ర కుమార్, ధమాలపాటి శేషయ్య, వంగ వెంకట్, వట్టికొండ మల్లికార్జునరావు, కంచర్ల జమలయ్య, రమణ మూర్తి, భూక్యా శ్రీను, భూక్యా దస్రు, పోలుమూరి శ్రీనివాస్, లక్ష్మిపత్తి, జక్కుల రాములు, కుమారి హనుమత్‌రావు, బరిగల సంపూర్ణ పాల్గొన్నారు.


## ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలి : టిఎన్‌జిఒస్

**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** పెండింగ్ ఉన్న ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని తెలంగాణ వసతి గృహ సంక్షేమ అధికారుల ఫోరం సర్వసభ్య సమావేశం నగరంలోని టిఎన్‌జీవోస్ భవనంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా టిఎన్‌జీవోస్ ఖమ్మంజిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, హాస్టల్ వెల్ఫేర్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు గౌస్ హష్మిలు మాట్లాడుతూ సబార్డినెట్ సర్వీస్ రూల్స్ 16హెచ్ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ప్రమోషన్ల విషయంలో అందరికీ ఆమోదయోగ్యమయ్యే విధంగా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. వసతి గృహ సంక్షేమ అధికారుల సమస్యలను టిఎన్‌జీవోస్ నాయకత్వం దృష్టికి తీసుకు వస్తే వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రుక్మారావు, ఎన్.నాగేశ్వరరావు, తిరుపతిరావు, హన్మకొండ జిల్లా అధ్యక్షులు కృష్ణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు రాంబాబు, నెల్లూరి విజయ, వివిధ జిల్లాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# చంద్రరాజేశ్వరరావు పోరాటస్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

సిఆర్ వర్ధంతి సభలో పలువురు నివాళి



**ప్రజాపక్షం/ఖమ్మం :** సుదీర్ఘకాలం పార్టీ జాతీయ కార్యదర్శిగా, ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు నిర్వహించిన చంద్ర రాజేశ్వరరావు పోరాటస్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ పేర్కొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ మాజీ జాతీయ కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు 31వ వర్థంతి సందర్భంగా బుధవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జమ్ముల జితేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభ లో దండి సురేష్ మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు నైజాం సంస్థానంలో భూస్వామ్య, దొరల దోపిడీ, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా ఆంధ్రమహాసభ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో తెలంగాణలో వరంగల్, నల్లగొండ జిల్లాల్లో పర్యటించి ఉద్యమాన్ని తీవ్రతరం చేయుటకు రహస్య సమావేశాలు నిర్వహించి ఉద్యమ చైతన్యాన్ని రగిలించారన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, ఏపూరి లతాదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, బిజి క్లెమెంట్, పోటు కళావతి, మహ్మద్ సలాం, రావి శివరామకృష్ణ, సిహెచ్ సీతామహాలక్ష్మి, మిడికంటి వెంకటరెడ్డి, మేకల శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు గాదె లక్ష్మి నారాయణ, తాటి నిర్మల, యానాలి సాంబశివరెడ్డి, నాయకులు నంబూరి శంకర్‌రావు, విష్ణు పాల్గొన్నారు.

**పాల్వంచ :** దేశ వ్యాప్తంగా భూ పోరాటాలకు శ్రీకారం చుట్టి నిరుపేద కుటుంబాలకు జీవనోపాధి కల్పించిన చంద్ర రాజేశ్వరరావు ధన్యజీవి అని సిపిఐ రాష్ట్ర సమితి నాయకులు ముత్యాల విశ్వనాథం అన్నారు. సిపిఐ అగ్ర నాయకులు చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి సందర్భంగా బుధవారం సిపిఐ కార్యాలయంలో సిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, పట్టణ సహాయ కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్, అన్నారపు వెంకటేశ్వర్లు, వేములపల్లి శ్రీను, వైఎస్ గిరి, భిక్కులాల్, కొంగర అప్పారావు, చల్లా కృష్ణ, అమృతరావు, ఆదినారాయణ, కృష్ణ, బాలాజీ, రాము, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, రామారావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

**ఇల్లందు:** సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వర్‌రావుకు సిపిఐ కార్యాలయంలో బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కె.సారయ్య మాట్లాడుతూ తన యావదాస్తి పేద ప్రజలకు పంచిన మహోన్నత వ్యక్తి, స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధపోరాట యోధుడు రాజేశ్వర్‌రావు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవరకొండ శంకర్, పట్టణ కార్యదర్శి బంధం నాగయ్య,, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బాస శ్రీనివాసరావు, బొల్లి కొమరయ్య,, మోజేశ్, కాశబోయిన నాగేశ్, బొప్పిశెట్టి సత్యనారాయణ, బజారు ఆంజనేయులు, గూళ్ల దర్మేందర్,, ఎస్.కె.వలీ తదితరులు పాల్గొన్నారు.

**మణుగూరు :** చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను ముందుకు తీసుకెళ్ళాలని సిపిఐ నేతలు మున్నా లక్ష్మీకుమారి, పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ అన్నారు. చంద్ర రాజేశ్వరరావు వర్ధంతిని బుధవారం సిపిఐ మణుగూరు కార్యాలయంలో నిర్వహించారు. చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎస్కే సర్వర్, ఎఐటియుసి మండల కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు ఆదర్ల రాములు, కన్నెబోయిన ప్రసాద్, మంద కోటి, బోసెట్టి సంపత్, మహిళా సమాఖ్య మండల అధ్యక్ష, కార్యదర్శు లు బోలగాని సమ్మక్క, దుబ్బాక నిర్మల, దుబ్బాక ప్రమీల, అదేర్ల రేణుక,వంగ గౌరమ్మ, బీమా పాల్గొన్నారు.







క్రీడ

# ఆర్‌సిబి డామినేషన్ 42 కోట్ల వ్యూస్



ఐపిఎల్ తాజా ఎడిషన్‌లో ఆర్సీబీ హవా నడుస్తోంది. ఎప్పుడూ పడుతూ లేస్తూ పోయే ఈ జట్టు.. ప్లేఆఫ్స్‌కు చేరుకుంటే గొప్ప అనేలా పరిస్థితి ఉండేది. ఒకవేళ ప్లేఆఫ్స్‌కు చేరుకున్నా అక్కడి నుంచి ముందుకు వెళ్లడం కష్టసాధ్యమే. ఇప్పటిదాకా ఒక్కసారి కూడా ట్రోఫీని అందుకోలేదు కోహ్లీ టీమ్. అయితే ఈసారి వరుస విజయాలతో హోరెత్తిస్తోంది బెంగళూరు. ఇప్పటి దాకా ఆడిన 4 మ్యాచుల్లో 3 విజయాలతో పాయింట్స్ మూడో స్థానంలో కొనసాగుతోంది ఆర్సీబీ. అలాంటి టీమ్ వ్యూయర్‌షిప్‌లోనూ దుమ్మురేపుతోంది. 42 కోట్ల మార్క్‌ను ఉఫ్‌మని ఊదిపారేసింది. దీని గురించి మరింతగా తెలుసుకుందాం..


## అస్సలు తగ్గేదేలే

ఈ ఐపీఎల్‌లో ఆర్సీబీ పట్టిందల్లా బంగారం అవుతోంది. తమకు ఉన్న లిమిటెడ్ రిసోర్సెస్‌తో కొత్త కెప్టెన్ రజత్ పాటిదార్ టీమ్‌ను అద్భుతంగా నడిపిస్తున్నాడు. ఆ జట్టు వరుస విజయాలతో దూసుకెళ్తోంది. దీంతో ఆర్సీబీ మ్యాచుల కోసం భారీగా ఎగబడుతున్నారు ఆడియెన్స్. ఈ సీజన్‌లో ఆర్సీబీ, కేకేఆర్ మ్యాచ్‌కు ఏకంగా 41.7 కోట్ల వ్యూస్ వచ్చాయి. అదే ఆర్సీబీసీ, ఎస్కే మ్యాచ్‌కు 37.4 కోట్లు, ఆర్సీబీఎంఐ మ్యాచ్‌కు 34.7 కోట్ల వ్యూస్ వచ్చాయి. మరే టీమ్ ఆడినా ఇన్ని వ్యూస్ రాకపోవడం గమనార్హం.

## కొత్త రికార్డులు ఖాయం

ఆర్సీబీ మ్యాచ్ అంటే చాలు క్రికెట్ లవర్స్ టీవీలు, ఫోన్లకు అతుక్కుపోతున్నారు. అందుకే ఆ టీమ్ మ్యాచులకు కనీసం 35 కోట్లకు మించే వ్యూస్ వస్తున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే ఈ సీజన్ ఎండింగ్‌కు వ్యూయర్‌షిప్ విషయంలో బెంగళూరు కొత్త రికార్డులు సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది. బెంగళూరు మ్యాచులతో బ్రాడ్‌కాస్టింగ్ సంస్థ జియో హాట్‌స్టార్ పండుగ చేసుకుంటోంది. దీనిపై ఆర్సీబీ ఫ్యాన్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. టీమ్‌కు ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్, సక్సెస్ రేట్, కోహ్లీ క్రేజ్, ప్లేయర్ల పెర్ఫార్మెన్స్ వల్లే రికార్డు స్థాయిలో వ్యూస్ వస్తున్నాయని చెబుతున్నారు. ఆర్సీబీ మ్యాచులకు వస్తున్న వ్యూస్ ఇతర మ్యాచెస్ మీదా సానుకూల ప్రభావం చూపిస్తోందని.. దీంతో జియోకు ప్రతి రోజూ పండుగలా మారిందని అంటున్నారు.

# పంత్ వేసిన మాస్టర్ ప్లాన్



మంగళవారం కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో లఖ్నో సూపర్ జెయింట్స్ జట్టు నాలుగు పరుగుల తేడాతో కోల్‌కతా నైట్ రైడర్స్‌పై విజయం సాధించింది. లఖ్నో నిర్దేశించిన 238 పరుగుల భారీ స్కోరును కోల్‌కతా ఓ దశలో ఛేదించేలాగానే కనిపించింది. 12 ఓవర్లకు 149/2తో నిలిచింది. 8 ఓవర్లలో 90 పరుగులు చేస్తే విజయం ఖాయం. అప్పటికి రహానే (61) దూకుడుగా ఆడుతున్నాడు. ఆ సమయంలో పంత్ వేసిన మాస్టర్ ప్లాన్ మ్యాచ్ స్వరూపానే మార్చేసింది. మ్యాచ్‌ను కోల్‌కతా కోల్పోయింది.13వ ఓవర్ వేసే ముందు పంత్ గాయపడినట్లు నటించాడు. నడుం నొప్పి వేధిస్తోందని మైదానంలోనే పడిపోయి ట్రీట్మెంట్ తీసుకున్నాడు. అలా కొంత సమయం గడిపి కోల్‌కతా రిథమ్‌ను దెబ్బతీసే ప్రయత్నం చేశాడు. ఆ తర్వాత 13వ ఓవర్ వేసిన శార్దూల్ ఠాకూర్ వరుసగా ఐదు వైడ్లు వేశాడు. దీంతో కోల్‌కతా బ్యాటర్లు రిథమ్ కోల్పోయారు. అదే ఓవర్లో రహానే అవుటయ్యాడు. ఆ తర్వాత రమణ్‌దీప్, వెంకటేష్ అయ్యర్, రస్సెల్, రఘువంశీ వరుస ఓవర్లలో అవుటై పెవిలియన్ చేరిపోయారు. చివర్లో రింకూ సింగ్ పోరాడినా అప్పటికే ఆలస్యం అయిపోయింది.

# పంజాబ్ ప్లేయర్‌పై బిసిసిఐ చర్యలు!



ఐపిఎల్ 2025లో తాజాగా జరిగిన హై ఓల్టేజ్ మ్యాచులో చెన్నై ఓడింది, పంజాబ్ గెలిచింది. అయితే గెలిచిన పంజాబ్ జట్టుకు ఓ షాక్ తగిలింది! ఆ జట్టు విజయంలో తనవంతు పాత్ర పోషించిన ఆల్‌రౌండర్ గ్లెన్ మాక్స్‌వెల్‌పై చర్యలు తీసుకుంది ఐపీఎల్ పాలక మండలి. మ్యాచు సమయంలో అతడి ప్రవర్తన తీరుకుగానూ జరిమానా విధించింది. అసలేం జరిగిందంటే?

## కీలక వికెట్ తీసి..!

ఈ మ్యాచ్‌లో ఆరో స్థానంలో బరిలోకి దిగిన గ్లెన్ మాక్స్‌వెల్ విఫలమయ్యాడు. రెండు బంతులు ఎదుర్కొన్న అతడు.. అశ్విన్ బౌలింగ్‌లోనే అతడికే క్యాచ్ ఇచ్చి ఔట్ అయ్యాడు. అయితే బౌలింగ్ లో మాత్రం కీలక వికెట్ తీశాడు. రచిన్ రవీంద్ర వికెట్ తీసి పంజాబ్ కింగ్స్ విజయంలో తన వంతుగా ఉడుత సాయం అందించాడు. అయితే మ్యాచ్ సమయంలో అతడు కాస్త దురుసుగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది.

ఎందుకంటే మ్యాక్స్ వెల్ ఆర్టికల్ 2.2 లెవల్ 1 తప్పిదానికి పాల్పడినట్లు ఐసీసీ నోట్ విడుదల చేసింది. అతడు కూడా తన తప్పిదాన్ని ఒప్పుకున్నట్లు అందులో రాసింది. నిబంధనల ప్రకారం అతడి మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధిస్తున్నాం అని లేఖలో రాసుకొచ్చింది. అలానే అతడి ఖాతాలో ఓ డీమెరిట్ పాయింట్ ను ఇచ్చింది. కానీ ఏ విషయంలో అతడికి జరిమానా విధించిందో స్పష్టంగా చెప్పలేదు. అయితే ఆర్టికల్ 2.2 ప్రకారం చూస్తే.. ఓ క్రికెటర్ ఉద్దేశపూర్వకంగా మైదానంలో క్రికెట్ సామాగ్రి దెబ్బతినేలా ప్రవర్తిస్తే ఈ జరిమానా విధిస్తారు. కాబట్టి అతడు.. తన దురుసు ప్రవర్తనతో ఏదైనా క్రికెట్ సామాగ్రిని నాశనం చేసినట్లు తెలిసింది.

రీల్



# వేసవి కానుకగా విజయ్‘కింగ్‌డమ్’

టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న ప్రెస్టీజియస్ చిత్రాల్లో విజయ్ దేవరకొండ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం ‘కింగ్‌డమ్’ కూడా ఒకటి. దర్శకుడు గౌతమ్ తిన్ననూరి డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా క్రియేట్ అయ్యాయి. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన పోస్టర్స్, టీజర్ రిలీజ్ కాగా వాటికి ట్రెమండస్ రెస్పాన్స్ దక్కింది. కాగా ఈ సినిమాను వేసవి కానుకగా మే 30న పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్ రిలీజ్‌కు రెడీ చేస్తున్నారు.ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ ప్రస్తుతం చివరి దశకు చేరుకుంది. ఇక ఈ చిత్ర పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఇప్పటికే శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమాకు మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండటంతో ఈ మూవీపై అంచనాలు రెట్టింపు అయ్యాయి.

# ‘జటాధర’ షూటింగ్ పూర్తిచేసుకున్న సోనాక్షి !



టాలీవుడ్ హీరో సుధీర్ బాబు నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘జటాధర’ ఇప్పటికే ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలు క్రియేట్ చేసింది. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్స్ ఆకట్టుకునేలా ఉండటంతో ఈ మూవీ ఎలా ఉండబోతుం దా అనే ఆసక్తి నెలకొంది. కాగా, ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ సోనాక్షి సిన్హా తొలిసారి ఓ తెలుగు చిత్రం లో నటిస్తోంది. ఇప్పటికే ఈ చిత్ర షూటింగ్‌లో ఆమె పాల్గొంటుంది. కాగా, తాజాగా ఈ చిత్ర షూటింగ్‌పై సోనాక్షి ఓ సాలిడ్ అప్డేట్ అయితే ఇచ్చింది. ఈ సినిమాలో తన పాత్రకు సంబంధించిన షూటింగ్ పూర్తయ్యిందని.. తను ఈ సినిమా షూటింగ్‌ను ముగిస్తున్నట్లు సోనాక్షి తా జాగా తన ఇన్‌స్టా పేజీలో పోస్ట్ చేసింది. ఈ సినిమాలో తన పాత్ర అద్భుతంగా ఉందని.. తన తొలి తెలుగు సినిమా షూ టింగ్ పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందని ఆమె పేర్కొంది.వెంకట్ కళ్యా ణ్ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాను శివిన్ నారంగ్, ప్రేరణ అరోరా, నిఖిల్ నం ద, ఉజ్వల్ ఆనంద్ సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నారు.

# ‘నారీ నారీ నడుమ మురారి’ నుండి సాంగ్ రిలీజ్

చార్మింగ్ స్టార్ శర్వానంద్, అందాల భామలు సంయుక్త మీనన్, సాక్షి వైద్య హీరోహీరోయిన్లుగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం ‘నారీ నారీ నడుమ మురారి’ ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాను దర్శకుడు రామ్ అబ్బరాజు డైరెక్ట్ చేయగా, భాను బోగవరపు ఈ చిత్రానికి కథను అందిస్తున్నాడు. ఇక ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్ ఈ మూవీపై మంచి బజ్ క్రియేట్ చేశాయి.తాజాగా ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ సాంగ్ ‘దర్శనమే’ లిరికల్ వీడియోను మేకర్స్ రిలీజ్ చేశారు. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను విశాల్ చంద్రశేఖర్ రొమాంటిక్ మెలోడీ ట్యూన్స్‌తో అదరగొట్టాడు. ఇక యాజిన్ నిజార్ తన వాయిస్‌తో ఈ పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చాడు.ఇక ఈ సినిమాను అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చే విధంగా తెరకెక్కిస్తున్నారు చిత్ర యూనిట్. ఈ సినిమాను ఏకె.ఎంటర్‌టైన్‌మెంట్స్, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రై.లిమిటెడ్ బ్యానర్‌పై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నారు.






# సిఆర్ స్ఫూర్తిప్రదాత

## సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

న్యూఢిల్లీ: సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సి.రాజేశ్వరరావు (సిఆర్) స్ఫూర్తి ప్రదాతని పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా కొనియాడారు. సీఆర్ 31వ వర్ధంతిని పురస్కరించుకొని న్యూఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో ఆయన విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, పల్లబ్ సేన్ గుప్తా, డాక్టర్ బలచంద్ర కాంగో, సయ్యద్ అజీజ్ పాషా, రామకృష్ణ పాండా, అనీరాజా, గిరీశ్ చంద్ర శర్మ కూడా పుష్పాంజలి ఘటించారు. సీఆర్ సేవలు చిరస్మరణీయమని, ఆయన జీవితం ఆదర్శనీయమని నాయకులు కొనియాడారు. సీఆర్ తుది వరకు పార్టీ కోసం పనిచేశారన్నారు. ఆయన తన జీవితాన్ని బడుగు, బలహీనుల పక్షాన పోరాటాలకు అంకితమిచ్చారని శ్లాఘించారు. ఆయన సుదీర్ఘకాలం సీపీఐ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, సీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

# బాధ్యత గా పనిచేస్తా:ఎంఎల్‌సి సత్యం

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి/ శేరిలింగంపల్లి: పదవి గా కాకుండా బాధ్యత గా పనిచేస్తూ కమ్యూనిస్టు పార్టీ విలువలతో రైతులు, కార్మికులు,అణగారిన వర్గాల అభ్యున్నతి కూడా చేస్తాను ఎమ్మెల్సీ, సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు.బుధవారం హైదరాబాద్ కొండాపూర్ లోని సి ఆర్ ఫౌండేషన్ లో జరిగిన చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి వేడుకల్లో పాల్గొన్నారు.ముందుగా చంద్రా రాజేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి కు విప్లవ జోహార్లు ప్రకటించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనపై ఏ నమ్మకంతోనైతే పార్టీ ఎమ్మెల్సీ గా అవకాశం కల్పించిందో.. అదేనమ్మకం తో పార్టీ అభివృద్ధితోపాటు ప్రజల అభివృద్ధి కోసం పాటుపడతానని నెల్లికంటి సత్యం చెప్పారు. నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం లో ఏఐవైఎఫ యువజన సంఘం నాయకునిగా పనిచేయడం ప్రారంభించిన తాను సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిగా,జిల్లా కార్యదర్శిగా,రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా కొనసాగడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలు,సాగు త్రాగునీరు లేక ఇబ్బంది పడుతున్న ప్రజల కోసం సురవరం సుధాకర్ రెడ్డి నాయకత్వంలో సాగు త్రాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం, ఆ తర్వాత నక్కలగండి నుండి హైదరాబాద్ వరకు పల్లా వెంకటరెడ్డి



నాయకత్వంలో జరిగిన పోరాటంతో పాటు ఆ తర్వాత తన నాయకత్వంలో చందూరు నుండి అసెంబ్లీ వరకు ఎస్ఎల్ బిసి టన్నెల్, డిండి ఎత్తిపోతల పథకం కోసం పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించడం జరిగిందన్నారు. ముఖ్యంగా ఫ్లోరైడ్ అంటేనే విషపు నీళ్లు తాగుతున్న నల్గొండ జిల్లాకు కృష్ణా జిల్లాలో అందించాలని నినదించింది ఎఐవైఎఫ్, కమ్యూనిస్టు పార్టీగా అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించడం జరిగిందని ఎంఎల్ సి నెల్లికంటి సత్యం పేర్కొన్నారు.అటు పార్లమెంటులోనూ,ఇటు అసెంబ్లీ లోను కోటీశ్వరులు,కాంట్రాక్టర్లు, కార్పొరేట్లు కొనసాగుతున్నారని తెలిపారు.గతంలో రైతు, పీడిత తాడిత ఉద్యమం నుంచి ధర్మ భిక్షం, భీంరెడ్డి నరసింహారెడ్డి, సురవరం సుధాకర్ రెడ్డి ఇలాంటి వాళ్లు పార్లమెంటు శాసనసభల్లో లేనటువంటి పరిస్థితి కొట్టొచ్చినట్లు కనపడుతుందన్నారు.

# అవగాహన ఏది..?

(మొదటి పేజీ తరువాయి)

పారాసెటమాల్ ఔషధం ‘జనరిక్’గా రూ.5కే లభించగా, అదే ఔషధాన్ని ఓ ప్రైవేట్ కంపెనీ బ్రాండ్ పేరుతో రూ. 20 నుండి 30 కి విక్రయిస్తోంది. ప్రజలు డాక్టర్లు సూచించిన పేరుపైనే ఆధారపడుతుండటంతో, మెడికల్ షాపులు దాన్ని లాభదాయక వ్యాపారంగా మలుచుకుంటున్నారు.

## నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితం

మంచిర్యాల జిల్లాలో సుమారు 250 మెడికల్ షాపులున్నా వాటిలో చాలాచోట్ల నిబంధనలు ఉల్లంఘించడం సర్వ సాధారణంగా మారింది. అనుభవం కలిగిన ఫార్మాసిస్టులు లేకుండా మెడికల్ షాపులు నడుస్తున్నాయి. మందులు కొనుగోలు చేసిన వారికి చాలాచోట్ల బిల్లు కూడ ఇవ్వడం లేదు. అంతేకాకుండా బిల్లుల జారీ లేకపోవడం వల్ల గడువు ముగిసిన, నకిలీ మందులు కూడా వినియోగదారుల చేతికి అందే ప్రమాదం ఉంది.

## వైద్యుల, మెడికల్ షాపుల లాభ దోపిడీ పొత్తు

ప్రభుత్వ ఆసుపత్రుల్లో జనరిక్ మందులు అందుబాటులో ఉన్నా, కొంతమంది ప్రైవేట్ వైద్యులు కేవలం బ్రాండెడ్ మందుల పేర్లను మాత్రమే సూచిస్తున్నారు. మెడికల్ షాపుల యజమానులతో కుమ్మక్కై, అధిక లాభాల కోసం రోగులపై ఆర్థిక భారం మోపుతున్నారు. ఒకటే మందును, వేర్వేరు పేర్లతో ఎవరికి ఎంత అమ్మినా అదే మోసం అనే తంతుకొనసాగుతుందని, వైద్యానికి వెళితే మందుల ఖర్చే ఎక్కువ అవుతుంది. బ్రాండెడ్ ఔషధాలు ఆర్డర్ చేయించి ఎక్కువ లాభాలు గడించడమే కాకుండా, జనరిక్ మందుల స్థలాన్ని పూర్తిగా తొలగిస్తున్నారు. మందుల అమ్మకంపై కమీషన్ల కోసం వైద్యులు, మెడికల్ షాపుల యాజమాన్యం లాభ దోపిడి పొత్తు కొనసాగిస్తున్నారు.

## ప్రజల ఆరోగ్యంపై అధికారులు దృష్టి సారించాలి

ప్రజల ఆరోగ్యాన్ని బలిగొందుతున్న ఈ పరిస్థితులను నివారించేందుకు తక్షణ చర్యలు అవసరం. ప్రతి మెడికల్ షాప్‌లో అనుభవం గల ఫార్మాసిస్టును నియమించి, మందులకు బిల్లులివ్వడం తప్పనిసరి చేయాలి. జనరిక్ మందుల స్టాక్‌ను అనివార్యంగా ఉంచేలా చట్టాలు అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జనరిక్ మెడికల్ స్టోర్ల సంఖ్య పెంచి డ్రగ్ కంట్రోల్ విభాగం పకడ్బందీ తనిఖీలు నిర్వహించి ప్రజల్లో జనరిక్ మందులపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టే ఫార్మా మాఫియా, మెడికల్ షాపుల నిర్వాహకులను కట్టడి చేయాలంటే ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలి. సరైన అవగాహన కల్పించడంతో పాటు, అధికారులు కఠిన చర్యలు తీసుకుని ఈ వ్యవస్థను స్వచ్ఛంగా మార్చాల్సిన అవసరం ఉంది.

# రైతు భరోసా

(మొదటి పేజీ తరువాయి)





రైతు భరోసా సాగు భూములన్నింటికి ఇవ్వాలని, రాష్ట్ర స్థాయి పంటల బీమా పథకాన్ని ఏర్పాటు చేసి అమలు చేయాలని, అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, మిర్చి, పసుపులకు క్వింటాలుకు రూ.25, పసుపుకు రూ. 20 వేల చొప్పున చెల్లించాలని, ధాన్యం,మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి వాటిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రధాని హామీ మేరకు పంటలకు కనీస మద్దతు ధరల గ్యారంటీ చట్టం చేయాలని, జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం ముసాయిదాను ఉపసంహరించుకోవాలని, పిఎం కిసాన్, సమ్మాన్ నిధి ఆరు నుండి 18 వేలకు పెంచాలని ఆమె డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ కోసం తీసుకొన్న భూములకు గాను నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. ఈ ధర్నాలో ఎకెఎస్‌కు చెందిన జిల్లా కార్యదర్శి నిమ్మల నర్సింలు, కార్యదర్శి సంధ్య,రాష్ట్ర కోశాధికారి డి.జి.నరేంద్ర ప్రసాద్, ఎ బాపురాజు, ఎన్.వెంకటేష్, డిహెచ్పీస్ రాష్ట్ర నాయకులు సహదేవ్,దర్శన్. కౌసల్య, చీల పద్మ. నరసగారి కమలమ్మ, ఆక్కుల కలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం కలెక్టరేట్ వద్ద ...

ఖమ్మం కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం జిల్లా కలెక్టర్‌కు రైతుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. తొలుత వి. వెంకటాయపాలెం గ్రామం నుండి ప్రదర్శనగా రైతులు బయలుదేరి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. ఈ ధర్నానుద్దేశించి తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రైతాంగానికి ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలు చేయకుండా తాత్సరం చేస్తుందని రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రైతుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. రెండు లక్షల రుణమాఫీకి సంబంధించి సుమారు రూ. 45వేల కోట్లు అవసరం ఉండగా ప్రభుత్వం రూ.31వేల కోట్లు రుణమాఫీ చేస్తామని ప్రకటించి ఇప్పటి వరకు రూ.20,600 కోట్లు మాత్రమే మాఫీ చేసిందని రెండు లక్షల పైన రుణముంటే పై మొత్తాన్ని రైతులు చెల్లిస్తే రెండు లక్షలు ప్రభుత్వం బ్యాంకుల్లో జమ చేస్తుందని ప్రకటించి జీవో నెం. 567లో కూడా స్పష్టంగా పేర్కొందని ఇప్పుడు రెండు లక్షలు పైన రుణం ఉన్న వారికి రుణమాఫీ చేయకుండా రుణ మాఫీ పూర్తి అయిందని ప్రభుత్వం ప్రకటించడం సరైంది కాదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 2020 నుంచి ఎటువంటి పంటల బీమా పథకాలు అమలు కావడం లేదని గత ప్రభుత్వం రైతాంగాన్ని విస్మరించి పాలన సాగించడం వల్ల అధికారం కోల్పోయిందని ఆయన గుర్తు చేశారు. పధాన మంత్రి ఫసల్ బీమా యోజన వల్ల రైతాంగానికి ఉపయోగం లేదని దీని వల్ల ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకే లాభం చేకూరుతుందని ఆయన తెలిపారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావులు మాట్లాడుతూ రుణమాఫీ, రైతు భరోసాలు సంపూర్ణంగా అమలు చేయకపోవడం వల్ల ప్రభుత్వం పట్ల రైతుల్లో అసంతృప్తి నెలకొందన్నారు. ఖమ్మంజిల్లాలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభం చేసి కొనుగో ళ్లు ప్రారంభించాలని, మిర్చి రైతులకు రూ. 25 వేలు మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని, వర్షాలు, వడగండ్లకు పంటలు నష్టపోయి న రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వారు డి మాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సం ఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, జిల్లా నాయకులుతదితరులు పాల్గొన్నారు.

# టారిఫ్ వార్

(మొదటి పేజీ తరువాయి)

చరిత్ర స్పష్టం చేసిందని శ్వేతపత్రం పేర్కొంది. దీంతో ట్రంప్ దూకుడుగా ఆ 50 శాతం అదనపు సుంకాలు అమలు చేశారు. అమెరికాను ప్రతిఘటించేందుకు తగిన చట్టపరమైన విధాన సాధనాలు తమవద్ద ఉన్నాయని చైనా ప్రధానమంత్రి లీ ఖియాంగ్ కూడా తాజా సంకేతాలిచ్చారు. సమానస్థాయిలో వ్యవహరించేందుకు ఇప్పటికీ అవకాశం ఉందనీ చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని చైనా పేర్కొంది. ‘‘అమెరికా నిజంగా సమస్యలను చర్చలద్వారా పరిష్కరించుకోవాలనుకుంటే ‘‘సమానత్వం, గౌరవం,పరస్పర ప్రయోజనం’’ అనే మూడు సూత్రాలను పాటించాలి’’ అని చైనా విదేశీమంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ బుధవారంనాడు స్పష్టం చేశారు. బ్రహ్మాండమైన మార్కెట్ అవకాశాలు ఉన్న చైనాలో అమెరికా సరుకులు అమ్ముకోవాలని ఎదురుచూసే కంపెనీలకు, ఉత్పత్తిదారులకు ఈ 84 శాతం సుంకాలు పెద్ద శరాఘాతమని, వారికి చాలా నష్టం కలుగుతుందనీ బీజింగ్ వ్యాఖ్యాత స్టీఫెన్ మెక్‌డోనెల్ పేర్కొన్నారు. దీనివల్ల మార్కెట్లలో తీవ్ర ప్రకంపనలు చెలరేగుతాయన్నారు. చైనా ప్రభుత్వం ఎక్కడా వెనక్కు తగ్గే అవకాశాలు కనిపించడంలేదని ఆయన పేర్కొన్నారు. ట్రంప్ ఏనాడూ మాటకు కట్టుబడటంలేదు, మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు చేసిన వాగ్దానాలను ట్రంప్ గౌరవించలేదు, టిక్‌టాక్ విషయంలో కూడా మాట తప్పారు, అమెరికా యజమానికి విక్రయించేందుకు వీలుగా మరో 75 రోజులు టిక్‌టాక్‌కు గడువు ఇస్తూ ఉత్తర్వుపై సంతకం చేశారు, ఐతే టారిఫ్‌లపై సంప్రదింపులు చేసేవరకూ ఈ డీల్‌ను స్తంభింపజేస్తున్నట్లు చైనా ప్రకటించింది. అదేవిధంగా యూరోపిన్ యూనియన్ అమెరికాపై విధించిన టారిఫ్‌లు మూడు దశల్లో అమెరికాపై ప్రభావం చూపిస్తాయి. మొదటిదశ టారిఫ్‌లు మంగళవారంనుండి (ఏప్రిల్ 15) అమలులోకి వస్తాయి. రెండో దశ టారిఫ్‌లు మే 15 నుండి మూడోదశ టారిఫ్‌లు డిసెంబరు 1వ తేదీ నుండి అమలులోకి వస్తాయి. మొత్తం 18 బిలియన్ పౌండ్ల విలువైన అమెరికా సరుకులపై యూరోపియన్ యూనియన్ విధించే పెంచిన సుంకాలు ప్రభావం చూపిస్తాయి.

**అమెరికాకు తరలిరండి:ట్రంప్** : చైనా ప్రభుత్వం 84 శాతం సుంకాలు విధించిన తర్వాత మొదటిసారి ట్రంప్ స్పందిస్తూ, వ్యాపారులు తమ కంపెనీలను అమెరికాకు తరలించాలని పిలుపు ఇచ్చారు. ‘‘మీ కంపెనీలను అమెరికాకు తరలించడానికి ఇదే సరైన సమయం, మీకు జీరో టారిఫ్‌లు అమలు చేస్తాం, అమెరికాకు తరలివచ్చే కంపెనీలకు తక్షణం ఎలాంటి జాప్యం లేకుండా అన్ని రకాల అనుమతులు మంజూరుచేస్తాం, విద్యుత్, సాంకేతిక పరిజ్ఞానం, ఇతర మౌలిక సదుపాయాలు అన్నీ కలగజేస్తాం, జాప్యం చేయకండి, ఆలసించిన ఆశాభంగం, ఇప్పుడే బయల్దేరండి’’ అని ట్రంప్ కంపెనీలకు పిలుపు ఇచ్చారు. ఈ సుంకాలవల్ల అమెరికా రెవెన్యూ భారీగా పెరగుతుందని ట్రంప్ చెప్పారు. వివిధ దేశాలపై కొత్త టారిఫ్‌లు విధించడంవల్ల అమెరికాకు రోజుకు రెండు బిలియన్ డాలర్లు సుంకాలు లభిస్తాయన్నారు. అమెరికాకు చైనా విక్రయించే ప్రతి ఐదు వస్తువులకు ప్రతిగా చైనాకు అమెరికా ఒక వస్తువు మాత్రమే అమ్ముతోంది, ఈ విధానంవల్ల నష్టపోయేది చైనా మాత్రమే, చైనాకే ఎక్కువ నష్టం అని అమెరికా విశ్లేషకులు విమర్శిస్తున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com